సాహిత్య

# ప్రస్థానం

మార్చి - 2009

వెల రూ. 10



సాహితీ స్రవంతి



ఫోటో : గుడిపూడి విజయరావు

సాహిత్య
ప్రస్థానం
మార్చి, 2009
సంపుటి : 7 సంచిక : 40

# వైవిధ్య వైభవం

**స్లమ్** డాగ్ మిలియనియర్‌పై ఆస్కార్ల వాన కురవడం భారత జాతి ఘన విజయమైనట్టు ఆసేతు శీతాచలం సంబరాలు వెల్లివిరిశాయి. ఇది ఇంతకు ముందు క్రికెట్ కప్పు గెల్చుకున్న సందర్భాన్ని మించి పోయింది. ఏక కాలంలో సంతోషానికి సంవాదానికి కూడా ఆస్కారం కలిగింది. భారతీయ సమాజంలో ప్రత్యేకించి ఇక్కడి సృజన జగత్తులో వైవిధ్యాన్ని విశ్వ వేదికపై చాటిన ఈ సన్నివేశం నిస్సందేహంగా సంతోష దాయకమైందే. ఇందులోని వాణిజ్య రాగాలు, ప్రపంచీకరణ కోణాలు కూడా విస్మరించరానివి. అయితే ప్రధానంగా చెప్పుకోవలసింది మాత్రం మన దేశాన్ని సమాజాన్ని సాంస్కృతిక వారసత్వాన్ని ఏకశిలా సదృశంగా చిత్రిస్తూ తమ స్వంత భాష్యాలు రుద్దే బర్బరత్వం కూడదన్న సందేశాన్నే. ప్రపంచ స్థాయికి తీసిపోని ప్రతిభా పాటవాలు మనకున్నాయని, వాటి మూలాలు మాత్రం పూర్తిగా ఇక్కడి జన బాహుళ్యం జీవన రీతిలో వున్నాయని స్లమ్ డాగ్ విజయం చెబుతున్నది. పేదరికాన్ని ప్రపంచానికి చాటి చెప్పడం అవసరమా అనే ప్రశ్న అర్థం లేనిది. వున్న దాన్ని చూపించేందుకు కళాకారులకు ఎప్పుడూ హక్కు అవసరమూ వుంటాయి. అయితే ఆ చెప్పే తీరులో మితిమీరిన నాటకీయత, వాణిజ్య బాణీల మేళవింపు చర్చనీయమే. తెలుగు సాహిత్య రంగంలో కొనసాగుతున్న వాద వివాదాలకు ఈ చిత్ర కథాంశానికి కూడా సంబంధాన్ని గుర్తించడం పెద్ద కష్టం కాదు. వీటన్నిటిపైన సాకల్యంగా చర్చ జరిగితేనే మన సాహిత్య కళా కారులకు మార్గ నిర్దేశకత లభిస్తుంది.

ముఖచిత్రం : శ్రీరాం కారంకి
బొమ్మలు : శేఖర్, శివాజి, వెంకటేష్, బి.వి.ఆర్. చారి

## ఈ సంచికలో...

| | |
|---|---|
| హార్వెస్టర్ (కథ) | 2 |
| కవిత | 6 |
| మహాభారతానికి ఆధునిక నవలా రూపం 'పర్వ' | 7 |
| కవిత | 11 |
| కొలకలూరి ఇనాక్ ఇంగ్లీషు కావ్యానువాదం | 12 |
| రిచ్‌డాడ్ పూర్ సన్ | 15 |
| మాయాబజార్ | 17 |
| కవిత | 18 |
| నానీలు-సమకాలీన జీవన చిత్రణ | 19 |
| భారతీయ నవల-చారిత్రక మూలాలు | 21 |
| కొ.కు. సాహిత్య విమర్శ | 27 |
| పుట్టినరోజు (అనువాద కథ) | 30 |
| కవిత | 35 |
| చెక్కు ఇచ్చువాడు | 36 |
| అక్షరాల పూలుపూచిన సుద్దముక్క | 38 |
| కాషాయమూకల ఫాసిస్టు చర్యలు | 39 |
| దుర్భర భారతం నిజమా? కల్పనా? | 41 |
| డైరీ | 43 |
| కొత్త పుస్తకాలు | 47 |

సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వీరప్రసాద్
ఎం.నరహరి
కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

కవిత

◆ కథ

# హార్వెస్టర్



**■ మేరెడ్డి యాదగిరి రెడ్డి**

**ఊరంతా సందడి సందడి**
**రఘుపతిరెడ్డి ఇంటిముందు హార్వెస్టర్**
**వరిపొలాలను గంటలో కోస్తుందట. కూలీలతో పనిలేదు. గంటకు ఎకరం పొలం కోస్తుందట. రాత్రింబగల్లు పనిచేస్తుందట. వడ్లు వెంటనే అమ్ముకోవచ్చు. కోత, కట్టివేత, తొక్కిచ్చుడు, ఎగపోత ఇవేవి వుండవట. ఊరంతా ఇవే ముచ్చట్లు.**

రఘుపతిరెడ్డి కొడుకు అమెరికా నుండి పంపిన డబ్బులతో ఇంకో నలుగురి రైతులను కలుపుకొని కోత మిషను తెచ్చాడు. రఘుపతిరెడ్డిది దొరల కుటుంబం. గతంలో ఆ చుట్టుపక్కల పదివూర్లలో వీళ్ళ కుటుంబీకులే దొరతనం చలాయించేవారు. లంకంత ఇల్లు. రెండెకరాలలో పెద్ద బంగళా, చుట్టు ఎత్తైన ప్రహారీగోడ. దాన్నే దొరగడి అని పిలుస్తుంటారు. పాత తారస్ ఇల్లు కూలగొట్టి రెడ్డి ఈ మధ్యనే స్లాబ్ వేయించాడు. ఇంటిముందు నాలుగు పెద్దయాపచెట్లు. చెట్లచుట్టూ అరుగులు నేలంతా దుమ్ములేవకుండా మొద్దుబండలు పరిచాడు. ఓ పక్క పెద్ద పశువుల కొట్టం. కుమ్మరి పెంకులతో కట్టిన తాతలనాటిది చెక్కుచెదరకుండా వుంది.

ఇంకోపక్క బండ్లకొట్టం. గతంలో నాలుగు పెద్దబండ్లు, ఓ కచ్చడం బండి ఉండేది. ఓ వంద దాకా బర్లు, ఆవులు, అరకటెడ్లు వుండేవి. ఓ రెండు వందల గొర్లుండేవి. ఓ పదిమంది జీతగాండ్లు వుండేవారు. ఇప్పుడేవి లేవు. ముచ్చటగా మూడు గౌడిబర్లు, నాలుగు జెర్సీ ఆవులు వున్నాయి. బండ్లకొట్టంలో ఓ ట్రాక్టరు. ఆ పక్కన ఓ పెద్ద బాయి. బాయినిండా నీళ్ళు. ఆ పక్కన పచ్చిగడ్డి మడి.

ఊరిలో రఘుపతిరెడ్డికి వెయ్యెకరాల భూమి ఉండేది. సీలింగు వచ్చాక దాదాపు ఎనిమిది వందల ఎకరాల భూమి అమ్మి హైదరాబాదులో భూములు కొన్నాడు. ఇప్పుడవి కోట్లు పలుకుతున్నాయి. ఒక్క కొడుకు అమెరికాలో వున్నాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. బిడ్డా, అల్లుడు ఇద్దరు డాక్టర్లు, వీళ్ళు అమెరికాలోనే వున్నారు.

నాగార్జున సాగర్ కాల్వలు వచ్చిన తొలినాళ్ళలోనే గుంటూరు, క్రిష్ణా జిల్లాలనుండి వచ్చిన రైతులు ఇక్కడ భూములు చౌకగా దొరుకుతున్నాయని రఘుపతిరెడ్డి దగ్గర భూములు కొన్నారు. అలా ఓ ఇరవయి ముప్పయి కుటుంబాల వారు వచ్చి స్థిరపడ్డారు. చలపతిరావు, అప్పిరెడ్డి, గోపిరెడ్డి, సుబ్బయ్య అలా వచ్చిన రైతులే. వీళ్లందరికి రఘుపతిరెడ్డి మాటంటే వేదం.

గత రెండేండ్ల కిందట వరకు కూలీలు బాగానే దొరికేవారు. ఏ రాత్రి పిలిచినా లేచివచ్చేవారు. ఉపాధిహామీ పథకంతో వ్యవసాయానికి కూలీల కొరత వచ్చింది. అదీగాక భవన నిర్మాణాలు పెరిగాయి. రోడ్లపని, కాల్వలపని, ముమ్మరమయ్యాయి. కూలీల పిల్లలెవ్వరు ఈ బురదలో దిగి బురదపూసుకోవడానికి ఇష్టపడటం లేదు. అవతల ఆటోడ్రైవర్లుగానో, భవన నిర్మాణ మేస్త్రీలుగానో, ఇటికబట్టీ కాల్చడంలోనో, బొగ్గుబట్టీ కాల్చడానికో వెళుతున్నారు. అవతల కష్టం తక్కువ గిట్టుబాటు ఎక్కువ. అందుకనే వ్యవసాయపనులకు కూలీల కొరత తీవ్రమయింది.

రఘుపతిరెడ్డి, చలపతిరావు, అప్పిరెడ్డి, గోపిరెడ్డి ఇంకా కొంతమంది రైతులు ఆలోచనలో పడ్డారు. మిషనరీ లేంది వ్యవసాయం చేయలేమనుకున్నారు. పెట్టుబడికి రఘుపతిరెడ్డి తానున్నానన్నాడు. ఆ వరుసలో తెచ్చిందే ఈ హార్వెస్టర్. ఇలా అన్నా కూలీలను ఒక మెట్టుదించొచ్చు అనేదే వారి ఆలోచన.

పాతతరం మనుషులంతా రఘుపతిరెడ్డిని “దొర' అనే పిలుస్తారు. అలా పిలిపించుకోవడం ఆయనకు మహాయిష్టం. ఇప్పటి యువతరం మాత్రం “దొర” పిలుపు వినగానే నారాయణమూర్తి సినిమాలోని “దొరయేందిరో దొర పీకుడేందిరో” యాదికి తెచ్చుకుని ధుమధుమలాడుతారు. చిన్నరైతులు కూలీలంతా అన్న, అక్క, బావ వరుసలతో పిలుచుకుంటారు.

వరికోత మిషను పెద్దట్రాక్టరు ముందు కోత పరికరం. పైన వడ్లు నిల్వ చేసే పెద్ద డబ్బా. ఆ పక్కన వడ్లు బయట పోసే



Text.pmd 2 2/28/2009, 6:15 PM

పెద్ద గొట్టం. దాని డ్రైవర్ అమర్‌సింగ్. పరికరాల నట్లు ఫిట్ చేస్తున్నాడు. అయిల్ వేస్తున్నాడు. తలపాగా, గడ్డం, చుట్టు గుమిగూడిన పిల్లలు తమాషాగా చూస్తున్నారు. ఇక్కడి డ్రైవర్లకు మిషను సంగతి తెలువదని పంజాబునుండి సంవత్సరం జీతం మాట్లాడుకుని తీసుకుని వచ్చారు.



పిల్లలు, పెద్దలు, ఆడ, మగా ఊరు ఊరంతా వరికోత మిషను చూద్దామని అక్కడికి వచ్చారు. రైతులకది దేవతలా, కూలీలకది దయ్యంలా కనిపించింది.

ఆ సాయంత్రం రెడ్డి ఓ పెద్ద మేకపోతును హార్వెస్టరు ముందు బలిచ్చాడు. పెద్దరైతులందరిని పిలిపించి దావతు చేశాడు. సీసాలు లేచాయి. గ్లాసుల మీద గ్లాసులు ఖాళీలయ్యాయి. కూలీల మెడలు వంచొచ్చని సంబరపడ్డారు.

"మీకో సంగతి చెప్పనా" సగం ఖాళీచేసి గ్లాసుపట్టుకుని అన్నాడు రెడ్డి.

" దొరవారు చెప్పండి చెప్పండి " అందరు మత్తులో ఒకేసారి అన్నారు.

"నా చిన్నతనంలో ఈ కూలీలంతా కూలికి రోజు మాయింటి చుట్టూ తిరిగేవారు. ఏ పని చెప్పినా చేసేవారు. సాగర్ నీళ్ళు రాకముందు ఈ వూళ్ళో బియ్యమే కరువు"

"సజ్జ, జొన్న పండేవి. మాకే నాలుగు బావులుండేవి. మోటల యవసాయం. బాయికి రెండెకరాల సేద్యమయ్యేది. వరికోతలకు వద్దన్నావచ్చి కోసి కుప్పవేసేవారు. అట్లన్నా ఓ నాలుగు శేర్లవడ్లు వస్తే ఓ రెండు రోజులు వరి అన్నంతినొచ్చని వాళ్ల ఆశ. పనులు తీరిందాక మా నాయిన కుప్పలు కొట్టకపొయ్యేవాడు. దొర ఎప్పుడు కుప్ప కొడతడో అని రోజు రాత్రి కుప్పల కావలి పండేవారు. అట్లాంటిది ఇప్పుడు ఈ కూలీలు మనల్నే ఆటాడిస్తున్రు. వాళ్ల ఇండ్లచుట్టు తిప్పుకుంటున్నారు. తన కడుపులోని మాట బయటపెట్టి గ్లాసు ఖాళీ చేశాడు రెడ్డి"

"ఈ దెబ్బతో వాళ్ళు దిగిరాక తప్పదు దొరవారు" చలపతిరావు అన్నాడు. "అంతే అంతే" మిగతా వాళ్ళు మాటలు కలిపారు. ఫుల్‌గా తాగి ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి అక్కడ ఊరిమధ్య ఐమాస్ట్ లైట్ల వెలుతురు కింద కూలీలంతా సమావేశమయ్యారు. అంతా దిగులుగా కూర్చున్నారు. ఊళ్ళోకి కోతమిషను వచ్చినప్పటి నుండి వాళ్ళ మనస్సు మనస్సులో లేదు.

ఓ నెలరోజులపాటు కోతల సందడి. ఊరందరికి పని. చిన్నా, పెద్దా, ముసలి, ముతక అంతా కోతల పనుల్లో మునిగితేలుతారు. తలా ఓ పుట్టెడు వడ్లు వస్తాయి. సాయంత్రంపూట తలా ఓ సీసా కల్లు దొరుకుతుంది. వానాకాలం కోతలకు పుట్టెడు, యాసంగికి పుట్టెడు. సంవత్సరానికి సరిపొయ్యే తిండిగింజలు దొరుకుతాయి. ఇంట్లో వడ్లుంటే వాళ్లకదో భరోసా.

సాగర్ పెద్దకాల్వ ఊరి మధ్య నుండే పోతుంది. బీళ్ళన్ని పచ్చని పంటపొలాలయ్యాయి. మెరకలన్నీ బత్తాయి, నిమ్మతోటలయ్యాయి. రైతులకు, కూలీలకు చేతినిండా పని. నాట్లు, పచ్చకలుపులు, కోతలు, బత్తాయి తోటలలో గడ్డిపీకుడు సంవత్సరం పొడుగునా పనేపని. ఇప్పుడు సర్కారు ఉపాధి పథకంతో కూలీ డబ్బులకు తోడు ఇన్ని తిండిగింజలొస్తె దండి.

మేస్త్రీలు, కూలీలంతా అక్కడ కూర్చున్నారు. ఏ సమస్య వచ్చినా అక్కడే కూర్చుని మాట్లాడుకుంటారు. ఓ పక్క పాఠశాల. ఇంకోపక్క పంచాయతీ ఆఫీసు, ముందు యాపచెట్లు, కానుగచెట్లు, ఎర్రగా విరగబూసిన మంకెన చెట్లు, పైన పెద్ద ఐమాస్ట్ లైట్.

మేస్త్రీలు యాదగిరి, పిచ్చయ్య, మంగమ్మ, కౌసల్య, శకుంతల ముందు వరుసలో కూర్చున్నారు. వాల్లకెదురుగా కూలీలు కూర్చున్నారు. ఈ గండంనుండి ఎలా బయటపడాలా! అని చాలా సేపు తర్జన బర్జన పడ్డారు.

"మనమిప్పుడేంచేద్దామన్నా" కౌసల్య అడిగింది.

యాదగిరి కాస్త చదువుకున్నవాడు. మాటకారి. అందరిని కలుపుకపోతాడు. అందరి కష్టసుఖాలల్లో పాలుపంచుకుంటాడు. రైతులైనా కూలీలైనా సరే. రైతులకు, కూలీలకు అతని మాటంటే గురి. దుందుడుకుగా పోడు. ఉభయతారకంగా ఉంటాడు.

అంతసేపు గంభీరంగా కూర్చుని అందరి మాటలు విని ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి లేచినిలుచున్నాడు. "మనమంతా ఒక్క మాటమీదుండాలి. సమ్మెచేద్దాం – సమ్మెంటే మొత్తానికి మొత్తం పనులు మానేయడం గాదు. మనతో కోతలు కోయించుకున్న రైతుల పనులు చేద్దాం. మిషనుతో కోయించుకున్న వాళ్ళ పొలాల్లోకి ఏ పనికయినా మనం పోవద్దు. ఈ కారు వరకు మనం బయట పనులు చేసుకుందాం."

యాదగిరి మాటలకు కూలీలంతా చప్పట్లు కొట్టారు. యువకులు ఈలలు వేశారు.

"మరి పక్కవూరి నుండి కూలీలొస్తె ఎట్లన్నా" శకుంతల అడిగింది.

"పక్క ఊరివారిక్కూడా చెబుతాం. వాల్లు కూడా రారు. రేపువాల్లకిదే సమస్యవస్తే మనం కూడా వాళ్ళకు తోడుంటాం"

"మీ మాటమీదే నిలబడతాం. సమ్మె చేద్దాం" అందరూ ఒక్కసారిగా అన్నారు.

"ఎవడయినా సీసా కల్లుకో, పావుసేరు సారాకో, బీడీముక్కకో, వాళ్ళ మోచేతి నీళ్ళకో అమ్ముడుపోతే గుండుకొట్టిచ్చి గాడిదమీద ఊరేగిస్తా" రాంబాబు దురుసుగా అన్నాడు.

రాంబాబు మేస్త్రీ శకుంతల కొడుకు. పది ఫెయిలయ్యి ఈ మధ్యనే కూలీ బాట పట్టాడు.

"ఒరేయి రాంబాబు అంతంత మాటలొద్దురా! మనోల్లు మాటదప్పి ఎవ్వరు పోరులేరా. ఎవరయినా అట్లపోతె ఓ అయిదొందలు జుల్మానా వేద్దాం. మనం జన్మలో వాళ్ళను పనికి పిల్వము" యాదగిరి అన్నాడు.



Text.pmd 3 2/28/2009, 6:15 PM

"అంతే అంతే" అందరు మాటలు కలిపారు.

"రేపొక్కసారి రైతులను కలిసి ఇదే మాటలు చెప్పొద్దాం" మేస్త్రీ మాటలకు సరే అని అందరు ఎవరింటికి వారు వెళ్ళిపోయారు.

తెల్లవారింది. చలపతిరావు, గోపిరెడ్డి, సుబ్బయ్య, ఇంకా ఓ పదిమంది పెద్ద రైతులు రఘుపతి రెడ్డి ఇంటిముందు చేరారు. తలా ఓ అయిదువేల కోతకు బయానా పూర్వకంగా రఘుపతిరెడ్డికి యిచ్చారు. రఘుపతిరెడ్డి చాయ్‌లు తెప్పించి రైతులందరికి యిచ్చాడు. రైతులు అరుగుల మీద, రెడ్డిగారు వారి మధ్యలో ఓ కుర్చీలో కూర్చున్నాడు. సిక్కు డ్రైవర్ అమర్‌సింగ్ స్టౌవ్ వెలిగించి రొట్టెలు కాల్చేపనిలో పడ్డాడు.



మేస్త్రీ యాదగిరి, పిచ్చయ్య, కౌసల్య, శకుంతల ఇంకో వందమంది కూలీలు అక్కడికి చేరారు. కూలీలంతా మిషను చూడటానికి వచ్చారని అక్కడున్న రైతులు అనుకొన్నారు.

"ఏమోయ్! మేస్త్రీలు, కూలీలంతా ఒక్కసారిగా వచ్చారు. మిషను చూద్దామని వచ్చారా! రండి రండి ఎండలల్ల మీకు కష్టం తప్పింది. గంటకు ఎకరం కోస్తుంది. పదిపదిహేను రోజులల్లో మనవూరి పొలాలన్ని అయిపోతయి" హుషారుగా అన్నాడు రెడ్డి. కాసేపు ఎవ్వరు మాట్లాడలేదు.

"సల్లకొచ్చి ముంత దాచేదేంది దొరవారూ, మిషన్ దెచ్చింండ్రు. మా పొట్టగొట్టింండ్రు. మాకు పనిలేకుండ జేసింండ్రు. మేమెట్టబతకాల" యాదగిరి అన్నాడు.

"ఓసి నీయిల్లు బంగారం గాను. మీకు పనెందుకు లేదు. ఇప్పుడెవరన్న కూలోల్లు దొరుకుతుండ్రా చెప్పండి. మిషనొక్క వరి కొయ్యంగనే సరిపోద్దా! అది కోస్తుంటె గడ్డెదరాలె. మోపులు గట్టాలె. వాములెయ్యాలె. మీకు పనిలేదని ఎవరన్నరు" సముదాయింపుగా రెడ్డన్నాడు.

"తోటలల్ల గడ్డి మోకాల్లోతు పెరిగింది. అది పీకాలంటే మనుషులే దొరుకత లేదాయె" చలపతిరావందుకున్నాడు.

"పెంటతోలుడు అట్లనే వున్నది" గోపిరెడ్డన్నాడు.

"అసలు కోతలు కోస్తెనె గదా! మాకిన్ని తిండిగొంజలొచ్చేది. అసలిడిసిపెట్టి కొసరు పనిచెయ్యమంటరేంది. ఇన్నాల్లు లేంది ఈ మిషనిప్పుడెందుకు తెచ్చింండ్రు. సాగరుకాల్వలలొచ్చిన సంది మేంకోస్తలేమా! నాటేసేది మేము, కలుపు తీసేది మేము. తీరా తయారయినంక మిషను దెచ్చింండ్రు" కౌసల్య ఘాటుగా అడిగింది.

రైతులు అవాక్కయ్యారు. ఏదో మిషను చూసిపోతరనుకుంటే ఇట్లంటున్నరేంది అనుకున్నారు.

కూలీలంతా నిలబడే వున్నారు. కొంతమంది నోట్లో పండ్లపుల్లలలాగే వున్నాయి.

"ఏమయినా దొరవారు మిషను ఈ వూరినుండి పోయిందాక మేము మిగతా పనులు చేయం. మాతో కోతలు కోయించుకున్నోళ్ళకే గడ్డి కడుతాం. వాములేస్తాం. మిగతా పనులు చేస్తాం. ఇక మీ యిష్టం" యాదగిరి ఖరాఖండిగా చెప్పాడు.

కూలీలంతా అక్కడి నుండి వెళ్ళిపోయారు. రైతులంతా వాళ్ళుపోయేదిక్కే చూస్తుండిపోయారు.

"నాలుగురోజులు ఇంట్లో పొయ్యి రాజకపోతే మావస్తారు. సమ్మె చేస్తరట సమ్మె. ఉడత ఊపులకు యాపలు కదులుతాయా చూద్దాం. వీళ్ళు రాకుంటే వీళ్ళ జేజెమ్మలను తీసుకొద్దాం. వీళ్ళకు భయపడి ఊరుకుంటమా! రేవతి కార్తె వచ్చింది. గాలో దూలో. మొన్ననే భువనగిరి దగ్గర రాళ్ళు పడ్డయంట. ఇన్నాల్లు జేసిన కష్టం నేలపాలవుతుంది. పదండి మిషను తీసుకుని పొలాలకు పోదాం" రఘుపతిరెడ్డి లేచాడు. ఆ వెంట రైతులంతా లేచారు.

చిన్న రైతులు పశువులున్న రైతులకిది నచ్చలేదు. మిషనుతో కోసిన గడ్డి తుంటలు తుంటలయిపోతుంది. మళ్ళీ ఎదరాలన్నా కూలీలతోటే పని.

కొబ్బరికాయ కొట్టి పసుపుకుంకమ జల్లి మిషను వూరెంట వున్న పొలల్లోకి దించాడు డ్రైవర్ అమర్‌సింగ్. ఎర్రగా పంటపండిన పొలాలు. ఎటు చూసినా పొలాలే. ఓ పదిహేను రోజుల్లో పొలాలన్ని మిషను కోసివేసింది. కూలీల కోతకన్నా పంటదిగుబడి పెరిగిందని ఖర్చులు తగ్గాయని రైతులు తెగమురిసిపోయారు. కోసినవి కోసినట్లే మిల్లర్లు ఎత్తుకుపోవడం తెల్లారె వరకు డబ్బులు జేబుల్లోకి రావడం వింతగా తోచింది.

చిన్నరైతులు ఎకరం, రెండెకరాలు, పాడిపశువులున్న రైతులు మాత్రం కూలీలతోనే కోయించుకున్నారు. వాళ్ళ గడ్డివాములు వేశారు. వడ్లన్నీ ఇంటికి తోలారు కూలీలు.

పెద్ద రైతులు మిషన్‌తో కోయించుకున్న వాళ్ళ పొలాల్లో గడ్డి తుంటలు తుంటలయి కుప్పలు కుప్పలుగా పడివుంది. రఘుపతిరెడ్డి, చలపతిరావు, గోపిరెడ్డి కూలీల దగ్గరకు వెళ్ళారు. బతిమిలాడారు. బంగపడ్డారు. ఎక్కువ కూలీ ఇస్తామన్నారు. కల్లు, సారా పోయిస్తామన్నారు. అయినా కూలీలు ససేమిరా అన్నారు. మిషన్ ఈవూరి నుండి పోతేనే వస్తామన్నారు. పక్కవూరి కూలీల దగ్గరకు వెళ్ళారు. వాళ్ళు కూడా రామంటే రామన్నారు.

కూలీల ఐకమత్యం ఏమాత్రం చెడలేదు. తమతో కోతలు కోయించుకున్న రైతులకు అన్ని పనులు చేసిపెట్టారు. ఇండ్లుకట్టుడు పనికి, ఇటికె బట్టీలకు, బొగ్గుబట్టీల కూలికి పోతున్నారు. పని దొరకకుంటే నల్లగొండ అడ్డమీదికి పొయ్యివస్తున్నారు. ముసలోల్లు మాత్రమే ఇంటి దగ్గర పిల్లల పట్టుకుని వుంటున్నారు.

పొలాలు తొందరగా కోయించుకున్న సంబరం ఎంతోసేపు నిలువలేదు. అకాల వర్షం పడి పొలాలలోని గడ్డంతా తడిసి నేలపాలయింది. చెదలుపట్టి పోయింది. పశువులు మేతకు అల్లాడిపోయాయి. వాటి బాధ చూడలేక కూలీలతో కోయించుకున్న రైతుల దగ్గర నుండి తలా ఐదారు వేలు బెట్టి గడ్డి కొనుక్కొచ్చారు.

పెంటకుప్పలల్లో పెంట ఎక్కడ వేసింది అక్కడే వుండిపోయింది. పెంట తోలాలంటే కూలీలు లేరు. బత్తాయి తోటలన్నీ గడ్డి మయమయ్యాయి. గడ్డి పెరిగి దోమకాటువచ్చి చెట్లకింద



Text.pmd 4 2/28/2009, 6:15 PM

# తోలు ఒలిచేది ఓటర్లే

**సరికొండ నరసింహరాజు**

ఎన్ని వాగ్దానాల ఫీట్లు చేసినా
ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేది వాళ్ళే!
తేనెపూసి కత్తులు నూరినా
మొసలి కన్నీరు కార్చినా వాళ్ళే!
అరచేతిలో వైకుంఠం చూపినా
అక్షరాల పీక నొక్కినా ...వాళ్ళే!
ప్రకటించని ఎమర్జన్సీ పెట్టినా
మధ్యంతర ఎన్నికలు జరిపినా.. వాళ్ళే!
అనురాగం ముసుగేసి అనురాగం పాడినా
అణవణువు తల్లిని తాకట్టు పెట్టినా వాళ్ళే!
మట్టి తిన్నా మట్టి కరిచినా వాళ్ళే!
పల్లకిపై ఊరేగినా
పాడెపై ఊరేగించినా వాళ్ళే!
కలాలకు సంకెళ్ళు వేయడం
కులాల కుంపట్లు రాజేయడం
విభజించి పాలించడం
తెల్ల దొరల పాలనను కొనసాగించేది వాళ్ళే
పగలు వాళ్ళే–రాత్రి వాళ్ళే
అన్నీ వాళ్ళే – అంతా వాళ్ళే
'వాళ్ళ' తోళ్ళు ఒలిచేది మాత్రం ఓటర్లే!!



# రైతు లోకం

**నాగిశెట్టి**



పోల్చి చెప్పడానికి
ఇక పందికొక్కుల్లేవ్
చూరులెంట తిరిగే
చుంచెలుకల్లా తయారయ్యాయి
ముద్దు ముద్దుగా తిరిగే
పిచ్చుకలు
కనుమరుగయ్యాయి
పంచలో వడ్ల కంకుల
గుత్తెను వ్రేలాడదీసే
నాథుడులేక
ఓ పిల్లి
ఎడతెరపి లేకుండా
ఏడుస్తూనే వుంది
పాలకుండే లేని
చుట్ట కుదురు వైపే
ఆశగా చూస్తూ
చిక్కని కుడితి తాగి
నవనవలాడాల్సిన బర్రెలు
బక్క చిక్కిపోయి
ఊసురోమంటున్నాయి
చెట్టే కుప్పకూలితే
చుట్టూ అల్లుకున్న బంధాలు
ఇంకేం మిగులుతాయి?
అన్నదాత ఆత్మహత్య దిశగా
అడుగులు వేస్తుంటే
చల్లని మజ్జిగ కుండలతో
దాహార్తిని తీర్చే
పల్లె చలివేంద్రాలు
ఇక తళ తళ మెరిసే ఎండమావులే

కుప్పలు కుప్పలుగా రాలిపడ్డాయి. ఏ పనికి కూలీలు రావడం లేదు. దిక్కు తోచని స్థితిలో కుడితిలో పడ్డ ఎలుకలా తయారయింది రైతుల పరిస్థితి.

వర్షాలు ముందుగానే పడ్డాయి. పైన కర్నాటక, మహారాష్ట్రలో వర్షాలు పడి శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండిపోయాయి. జూన్ చివరలో కాల్వలకు నీళ్ళు వదిలారు. రైతుల ముఖాలు సంతోషంతో వెలిగిపోయాయి. ముందుగా నాట్లు వేస్తే చీడపీడల బాధలేక పంట దిగుబడి బాగా వస్తుందని వాళ్ళ ఆశ.

పొలాలన్నీ ట్రాక్టర్లు పెట్టి మెత్తగా దున్నారు. నార్లు పోశారు. నార్లు ఏతకు వచ్చాయి. నాటుకు సిద్ధం చేసి పెట్టుకున్నారు. అసలు సమస్య ఇప్పుడే మొదలయింది. కూలీలు సమ్మె బాట వీడటం లేదు. ఏదో ఓ పరిష్కారం కుదరకపోతే ఈ యేడు వ్యవసాయం మానుకోవాల్సి వస్తుందని రైతుల భయం. రైతులంతా ఆలోచనలో పడ్డారు.



అందరు మూకుమ్మడిగా రఘుపతిరెడ్డి ఇంటికి వెళ్ళారు. ఏదో విధంగా కూలీలతో పరిష్కారం కుదుర్చుకుంటేనే మంచిదని చెప్పారు. హార్వెస్టరు అమ్మివేస్తే మంచిదని చెప్పారు.

రఘుపతిరెడ్డి కూడా ఆలోచనలో పడ్డాడు. అందరికంటే ఎక్కువ నష్టపోయేది తనే. యాభయి ఎకరాల పొలం. యాభై ఎకరాల తోట, కూలీలతో పెట్టుకుంటే ఆగమయిపోదూ. అందుకే హార్వెస్టర్ అమ్మేయాలనే నిర్ణయానికొచ్చాడు. ఇదే విషయం రైతులకు చెప్పాడు. అందరూ సంతోషించారు.

ఓ శుభోదయాన రైతులు, కూలీలు రఘుపతిరెడ్డి ఇంటి ముందు సమావేశమయ్యారు. మధ్యలో కుర్చీలో రెడ్డి కూర్చున్నాడు.

"ఇదిగో చూడండి. మీ అవసరం మాకుంది. మా అవసరం మీకుంది. ఇద్దరం కలిసిపోతేనే వ్యవసాయాలు నడుస్తాయి. ఎడ్లబండి గిల్లలాగ రెండు కలిసి పనిచేస్తేనే బండి ముందుకు నడుస్తుంది. ఏది మొరాయించినా బండి ముందుకు పోదు. అలాగే మేము కల్సుంటేనే పనులవుతాయి. మీమీద మాకేలాంటి కోపం లేదు. ఏదో పనితొందరగా అవుతుందని మిషను తెచ్చాను. ఈ మిషను అమ్మేస్తున్నాను. చలపతిరావు బావ కొన్నాడు. రేపొచ్చి తీసుకెళతాడు" అంత పొద్దున్నే తన ముఖానికి పట్టిన చెమటను తువ్వాలుతో తుడ్చుకున్నాడు రెడ్డి. రెడ్డేనా ఈ మాటలు మాట్లాడింది, ఇది కలా నిజమా? కూలీలు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"నిజంగా దొరవారు హార్వెస్టర్ మా బావకు అమ్మేశాడు. ఇందాక మా బావ ఫోన్‌చేసి నాకు చెప్పాడు" చలపతిరావు అన్నాడు.

"హాయి హాయి" కూలీలంతా చప్పట్లు కొట్టారు. ఈలలు వేశారు.

"దొరవారు మీమీద మాకేలాంటి కోపం లేదు. కోపమంతా మా పొట్టగొట్టిన ఆ వరికోత మిషను మీదే. ఆ దెయ్యం వదిలిందిగా ఎప్పటిలాగే మీ పనులకు మేం వస్తాం" యాదగిరి నిదానంగా అన్నాడు.

"ఈ రోజు మేమంతా పొలాల్లోకి నాట్లకు వస్తున్నాం" శకుంతల అన్నది.

"రైతుల ముఖాలు వికసించాయి. కూలీలు సంతోషించారు. అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. కూలీలంతా నాట్లకొరకు పొలాల్లో దిగారు. వాళ్ళ వెనుక రైతులు, ఆ వెనుక శాంతి సామరస్య సూచకంగా తెల్లని కొంగల గుంపులు పొలాల్లో బారులు తీరాయి

●



Text.pmd 5 2/28/2009, 6:15 PM

## పిసినారి



అతడికి
తినడానిక్కూడా
మనసొప్పదు
లేదని కాదు
తినొద్దనీ కాదు
కూడ బెట్టడం మీదున్న గురితో
కూడుకు దూరమంటాడు!
చాయ్ తాగడు
ఒక మాటా పేలడు
సంబరాల కన్న
సంపాదన ముఖ్యమంటాడు!
రేపటి గూర్చిన ఊహల్తో
వర్తమానాన్ని నిస్సారం చేసుకుంటాడు!

వంట చల్లారిన
కాయలు మరి మాగిన
అంతా సప్ప సప్పనే...!
సమయమైన
సంతోషమైన
గడపదాటితే గల్లంతే!
తాజాగా నిరంతర మజాగా
రేపటిలోకి
అడుగు పెట్టడమే
నిజంగా కూడబెట్టడం...!
పిసినారి హృదయమెప్పుడు
పాసిపోయిన అన్నమే...!

**ఏలేశ్వరం వెంకటేశ్**

## అందం!

**కాళహస్తి వెంకటశేషగిరి రావు**



కనుబొమ్మలు
కత్తిరిస్తే చూపులకు
అందం
ఎలా వస్తుంది
పెదవులకు
రంగు పూస్తే
నవ్వులకు హంగు
ఎలా చేకూరుతుంది
తనువుకు
రంగులద్ది
అలంకరిస్తే
అంతరంగం
అందంగా
ఎలా అలరిస్తుంది
అంతరించే పైపై మెరుగులకంటే
మనసు అందంగా ఉండాలి!

## కుల విస్ఫోటనలు

**యాసలపు సూర్యారావు**



కులం కుంపట్లు
రాజు కుంటున్నాయి
త్యాగాలు గిట్టని
కుహనా రాజకీయ శక్తులు
కుల సమీకరణాల
నెగళ్ళను రాజేస్తున్నాయి
పెట్టుబడికి కట్టుబడ్డ
మానవ మెదళ్ళు
అసమానతల అంతరాలపై
అందమయిన వాగ్ధానాల తివాసీని కప్పి
దారిద్ర్యానికి పేదరికానికి
రంగుటద్దాలు తొడిగి
మోసపోయిన వాళ్లను
మళ్ళీ ఎలా మోసగించవచ్చో
రాజకీయ కుల మేళాల
మాయాజాలంతో ముందుకొస్తున్నారు
త్యాగదనులకు సైతం కులం బురదను
పులమటంలో ఘనా పోటీలు
రాజకీయ ప్రయోజనం కోసం
తల్లిని సైతం
తాకట్టు పెట్టే తుచ్ఛులు
ఇప్పుడు కులం గొడుగుల
కిందకు దూరుతున్నారు
ఏ ప్రస్థానానికో ఈ నీచ సంస్కృతి
మనుషులైన వారికి అర్థం కాక మానదు
గ్లోబలీకరించబడుతున్న దేశాన్ని
అంతరించుకుపోతున్న
మానవ సంబంధాలను
పరాయికరించబడుతున్న
జాతి సంస్కృతి, సంపదలను
డాలరీకరించబడుతున్న
ఆర్థిక సంబంధాల తీరును
అనుమాత్రం కూడా
అర్థం చేసుకోలేని
జడత్వపు జీవులకు
ఈ దేశం ఏమయిపోతే ఏం?
గద్దెనెక్కిన వాడు తమ కులం వాడైతే చాలు
సకల సమస్యలకు అదే పరిష్కారమన్నట్లు
సంబరపడి పోతారు
రాష్ట్రంలోని రాజకీయ నిరుద్యోగులకు
సరికొత్త పునరావాసం కుల సమీకరణలు
రేపు గద్దెనెక్కిన వాడు తమ కులం వాడైతే
ఏదో ఒక 'లబ్ధి' పొందక పోతానా
అని పొందు కోసం కులం పొత్తులు
భిన్నత్వంలో ఏకత్వానికి
బాటలు ఈ కొత్త రూటులు
జాతి సమైఖ్యతకి
ఇవి ఆరని చిచ్చులు అవుతాయి.

## పశ్చాత్తాపం కల్గితే

**దోర్నాదుల సుబ్బమ్మ**



రాజులా మనిషి ఊహించుకొన్నప్పుడే
రాజకీయం మృగరాజౌతుంది
మరణంలో ముంచే ముందు పాతర్ల
ఏర్పాటు చేసి
స్వర్గంలో వున్నాననుకొంటూ
మందు తాగుతావ్....
ఆ దుఃఖానికి
ఆ గాయాలకు మందులుండవు
ఆ దుర్మార్గానికి నువ్వే ఆహుతి ఔతావు
బిడ్డల్ని కన్న తల్లులకి
బతుకుని పంచుకొన్న భార్యా పిల్లలకి
జవాబు చెప్పలేని తనం...నీదేం బతుకు....
నువ్వే కుళ్ళి కుళ్ళి మట్టిలో కలిసిపోతావు
మనిషిని తినడం మరిగిన రాజకీయం
దానికోరలతో పీక్కుతినేందుకు
కాచుకొనుంటుంది.
చిక్కిన వాళ్లను ఆహుతి తీస్కుంటుంది.
వెక్కిరించే చరిత్రను చేతికిస్తుంది!
ఇంతజేసినా... పశ్చాత్తాపం కల్గితే....
ఆకాశం తల్లి చుక్కల పిల్లల్ని
అక్కున చేర్చుకొంటుంది...!
ఏ కులపోణ్ణయినా దేశమాత
డొక్కన చేర్చుకొంటుంది!
మనిషికీ మానవత్వానికి నిర్వచనం ఇస్తుంది!
మనిషి మనిషిగా జీవించడమే
ముఖ్యమంటుంది!
అమ్ముడు పోనంత వరకే
నిన్ను బిడ్డగా భావిస్తుంది!



Text.pmd 6 2/28/2009, 6:15 PM

విశ్లేషణ

# మహాభారతానికి ఆధునిక నవలారూపం 'పర్వ'

■ డా॥ తుర్లపాటి రాజేశ్వరి

***మహాభారత కథలో వాస్తవాలను కనుగొనే ప్రయత్నం ఎంతోమంది పురాతత్త్వ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, సాహితీవేత్తలు చేశారు. మహాభారతంలో పేర్కొన్న అనేక ప్రదేశాలు, హస్తినాపురం, ఇంద్రప్రస్థం పట్టణాలను బి.బి.లాల్ గుర్తించారు. 'పురాణా ఖిల్లా'ను తవ్వించి ఆప్రాంతం ఇంద్రప్రస్థమని నిర్ధారించారు. 'కురుక్షేత్ర'లోనూ సమీప ప్రాంతాలలో ఆకాలం నాటి రంగులద్దిన పింగాళీ పాత్రల అవశేషాలు లభ్యమయ్యాయి.***



పర్వ నవలా రచయిత ఎస్.ఎల్. భైరప్ప

"**ధ**ర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని
కవి వృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికులితిహాసమనియుఁ
బరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్ఛ
యంబని మహిఁ గొనియాడుచుండ
వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశ రాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁజేసె భారతంబు"

ఇది మహాభారత ప్రసక్తిని గూర్చి నన్నయ ఆదిపర్వం ప్రథమాశ్వాసంలో చెప్పిన పద్యం. ఇందులో 'విశ్వజనీనమై' అన్నమాట గమనించదగింది. సంస్కృతంలో వేదవ్యాసుడు రచించిన మహాభారతం ఒక కాలానికి, ఒక ప్రదేశానికి పరిమితం కాకుండా సర్వ కాలాల్లో, సర్వ దేశాలలోనూ నివసించే మానవుల హృదయోద్వేగాల అక్షరరూపమని అభివ్యక్తీకరించడం విశేషం. ఈ 'విశ్వజనీనత' లక్షణం వల్లనే వివిధ భారతీయ భాషల్లోకి అనూదితమై స్వతంత్ర కావ్యంలాగా ఆయా భాషా శిల్పుల హస్తాలలో రూపుదిద్దుకుని భారతీయాత్మని సంవేదనాభరితమొనర్చింది. మొదట్లో 'జయ' గా పిలువబడిన ఈ కావ్యం తరువాత భారత వంశీకుల గాధలతో కూడి 'శతసహస్రిసంహితగా(1100 శ్లోకాలతో) బృహత్ గ్రంథమైంది. మహాభారతంలోని కొన్ని ప్రసిద్ధమైన నీతి శ్లోకాలు క్రీ॥పూ॥ 2వ శతాబ్దిలో గ్రీకురాయబారి పేర్కొన్నట్లు తెలుస్తోంది.మహా భారతంలో పాత్రలను గురించి పరామర్శ క్రీ॥ పూ॥ 5వ శతాబ్దినుంచి ప్రముఖ వ్యాకరణ కారుల, రాజకీయతత్వ శాస్త్రజ్ఞుల కవుల, నాటక రచయితల రచనల్లో కనిపిస్తోంది. ఈ జయగాథా శ్లోకాలు సముద్రాల కావల ఉన్న 'కాంబోడియా'లో 6వ శతాబ్దిలోనే దేవాలయాల్లో పాడి విన్పించేవారట! 7వ శతాబ్దిలో మంగోలియాలో టర్కులు ఇందులో ఒళ్ళు గగుర్పొడిచే సన్నివేశాలున్న హిడింబ వధ వంటి గాథలు వారి భాషలోనే చదువుకున్నారట! జావాలో ప్రజలకి 11వ శతాబ్దినాటికే మహాభారతానువాదం లభ్యం కావటం ఖండ ఖండాంతరాలలో దీనికి గల ప్రఖ్యాతిని తెలియజేస్తోంది. "వింటే భారతం వినాలి.... తింటే గారెలు తినాలి" అనే నానుడి ఒక్కటి చాలు కవిత్రయ భారతం ఎంతగా జన హృదయాలలోకి చొచ్చుకుపోయిందో తెలుసుకోవటానికి! నవరసాలు పండిన మహాభారతంలోని రసరమ్య జీవనానుభవాలని కన్నడ రచయిత ఎస్.ఎల్. భైరప్ప 'పర్వ' నవలగా తీర్చిదిద్దారు. తెలుగులోకి ఈ నవలని పేరుకి తగినట్లుగా మెదడుకి 'మేత' జిహ్వాకి 'మృష్టాన్న భోజనం' సిద్ధం చేసినట్లుగా ప్రొ॥ గంగిశెట్టి లక్ష్మీనారాయణ అందించారు.

మహాభారత కథలో వాస్తవాలను కనుగొనే ప్రయత్నం ఎంతోమంది పురాతత్త్వ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, సాహితీవేత్తలు చేశారు. మహాభారతంలో పేర్కొన్న అనేక ప్రదేశాలు, హస్తినాపురం, ఇంద్రప్రస్థం పట్టణాలను బి.బి.లాల్ గుర్తించారు. 'పురాణా ఖిల్లా'ను తవ్వించి ఆప్రాంతం ఇంద్రప్రస్థమని నిర్ధారించారు. 'కురుక్షేత్ర'లోనూ సమీప ప్రాంతాలలో ఆకాలం నాటి రంగులద్దిన పింగాళీ పాత్రల అవశేషాలు లభ్యమయ్యాయి. కురు, పాంచాల దేశాలలో, గంగాతీర డెల్టా ప్రాంతాలలో వ్యవసాయం బాగా నాడు విస్తరించినట్లు తెలుస్తోందని తవ్వకాలు సాగించిన పురాతత్త్వవేత్తలు అభిప్రాయపడుతున్నారు. మహాభారతానికి సంబంధించిన కథలు ఉత్తర భారతదేశంలో అనేకం వ్యాప్తిలో వున్నాయి. ఈ సందర్భంగా భారతీయ కుటుంబ వ్యవస్థ పరిణామం గూర్చి ప్రొ॥ ఇరావతీ కార్వే రాసిన వ్యాసంలో విషయాలు చదివితే మహాభారతంలో కుటుంబ వ్యవస్థా స్వరూపం అర్థం చేసుకోవటం సుగమమవుతుంది.

'Among people living in the foot hills of the Himalayas, in the region of Jaunsar and Bewar, The Prevalent pattern is that of the joint patriarchal family. These people call themsleves ksatriyas, profess the Hindu religion, and worship Hundu gods. They are mentioned in the Maha Bharata as the Khasas. The joint family is made up all brothers and their children



Text.pmd 7 2/28/2009, 6:15 PM

living together. The eldest brother is the head of the family, holds the family lands, is responsibile for feeding and clothing the family and expects and gets obedience from all. The wife of the eldest brother becomes automatically the wife of all the other brothers. The land belongs to all, but is held by the eldest and is never divided….”

– హిమాలయ పర్వతం దిగువ భాగంలో, జౌసార్, బేవార్‌కి మధ్య ప్రాంతలో ఉమ్మడి పితృస్వామిక కుటుంబ వ్యవస్థ ఉన్నది. వీరు క్షత్రియులమని చెప్పుకుంటారు. హిందూ దైవాలను పూజిస్తారు. మహాభారతంలో వీరు 'ఖాసులు'గా పేర్కొనబడ్డారు. ఉమ్మడి కుటుంబంలో సోదరులు, వారి పిల్లలూ అందరూ కలిసి ఒకే దగ్గర ఉంటారు. కుటుంబంలో పెద్దన్న– కుటుంబ పెద్దగా వ్యవహరింపబడతాడు. కుటుంబానికి సంక్రమించిన భూమి అతడి అధీనంలో ఉంటుంది. కుటుంబంలో అందరికీ అన్న వస్త్రాలు సమకూర్చాల్సిన బాధ్యత అతడిదే. అందరూ తనకు విధేయులుగా ఉండాలని అతడు కోరుకుంటాడు. పెద్దన్న భార్య తక్కిన సోదరులకూ భార్య అవుతుంది. భూమి అందరిదీ. కానీ పెద్దవాడి ఆధీనంలో ఉంటుంది. పంపకాలు జరగవు. అంటే ముక్కలయ్యే ప్రశ్నలేదు...”



నవలా రచయిత బైరప్ప స్వయంగా మహాభారతగాధలో పేర్కొన్న ప్రదేశాలు, సమీప ప్రాంతాలూ పర్యటించి, అధ్యయనం చేశారు. నాటి వ్యవస్థ స్వరూపాన్ని ఆకళించుకునే నవలారచనకు పూనుకున్నారు. మానవుడు చంద్రమండలపై కాలూని విజయపతాకను ఎగురవేశాక, అంతరిక్షంలో పరిశోధనాగార నిర్మాణానికి సైతం ఉద్యమిస్తున్న తరుణంలో, మహాభారతం చదువుతున్న పఠిత మదిలో అనేక సందేహాలు మొలకెత్తుత్తాయి. అయితే పర్వ నవలలో ఆ ప్రశ్నలన్నిటికి సంతృప్తికరమైన సమాధానాలు లభిస్తాయి. తత్కాలీన వాతావరణ సృజనలో, పాత్ర చిత్రణలో, పరిశోధక సృజనాత్మక నవలాకారునిగా రచయిత కృషి అనితర సాధ్యంగా తోస్తుంది.

Renewellek, Austin warren తమ Theory of literature గ్రంథంలో సాహిత్య లక్షణాన్ని ఈ విధంగా చెప్పారు.

“Literature must always be interesting: if must always have a structure and an aesthetic purpose. A total coherence and effect” (page 212)

–సాహిత్యమెప్పుడూ ఆసక్తి కలిగించేటట్లు ఉండాలి. చక్కని నిర్మాణం కళా ప్రయోజనం, సంపూర్ణమైన పొందిక, ఫల పర్యవసానం ఉండాలి.

పై విమర్శకులు చెప్పిన లక్షణాలను సొంతం చేసుకున్న 'పర్వ' యుద్ధ సన్నాహక సంరంభంతో ప్రారంభమౌతుంది. భారత కథలో కురువంశరాజుల వివాహాలు, పాండవుల పుట్టుక, ధర్మరాజాదులు పెరిగి పెద్దవటం, ద్రౌపది వివాహం, నిండు సభలో ద్రౌపది పరాభవం, అరణ్య అజ్ఞాతవాసాలు అన్నీ ముగిసిపోయాయన్న మాట! కానీ వాస్తవానికి కథ సందర్భాలన్నీ పాత్రల ఆలోచనా స్రవంతిలో ఆవిష్కరించబడ్డాయి. మహాభారతాన్ని విమర్శకులు కర్ణుడితల భారతమని చెప్పటం సాధారణం. అలాగే 'శల్య సారథ్యం' మనే మాట జనాలనోళ్ళలో ప్రసిద్ధమైంది. కురుక్షేత్ర సంగ్రామంలో కీలకమైన కర్ణార్జునుల యుద్ధ ఘట్టంలో, కర్ణుడికి రథసారథిగా శల్యుడు పోషించిన పాత్ర ఎక్కువైనదే. యుద్ధభూమిలో వీరుడైన కర్ణుని మానసికంగా ఈటెల్లాంటి మాటలతో శతథావేధిస్తాడు శల్యుడు. అనేక సందర్భాలలో మనిషి జయాపజయాలలో మనసు నిర్వహించే పాత్ర కాదనలేం. శల్యుడు ఆవిధంగా హృదయశల్యం కావించే మాటలతో కర్ణుడి మరణానికి దోహదం చేశాడు. నకుల సహాదేవుల మేనమామగా, పాండవ పక్షపాతిగా రక్త సంబంధంలో గాఢతని నిరూపించాడు. కథా ప్రారంభం పాండవ విజయాన్ని సూచించేటట్లుగా సాగింది. మద్రదేశ భౌగోళిక వర్ణన, ప్రజల జీవన విధానం కథాసన్నివేశంలో నిబిడీకృతమైఉంది.

పాండవ రాయబారి వచ్చి పాండవులు ఉపప్లావ్యంలో ఉన్నారని, తమ సహాయం కావాలని కోరుతున్నారని శల్యుడికి విన్నవిస్తాడు. శల్యుడి కుమారుడు రుక్మరథుడి మనస్సు గెలుచుకునే విధంగా నేర్పుగా మాట్లాడుతాడు. శల్యుడి వెంటనే తన సహకారాన్ని, ఆమోదాన్ని పాండవరాయబారికి తెలియజేస్తాడు. ఈ విధమైన సంభాషణా చాతుర్యం వలన శల్యుడు, రుక్మరథుడు, పాండవ రాయబారి, తదితర పాత్రలు మనముందు ప్రత్యక్షమౌతాయి.

నవల ముందుకి సాగుతున్న కొద్దీ భారతీయులకు సుపరితమైన పాత్రలన్నీ తమతమ బాహ్య , అంతరికరణాల వ్యక్తీకరణ, చేష్టలద్వారా తమని పరిచయం చేసుకుంటారు. పాంచాలిది కోపోద్రిక్తరుద్ధ కంఠస్వరమైతే, దుర్యోధనుడిది అహంకారపూరితగర్జన. కుంతిది వేదనారవం! గాంధారిది ప్రతిఘటనతో కూడిన ధిక్కారవైఖరి. రచయిత ఏ పాత్రనీ వర్ణించడు! ధర్మరాజు, భీమార్జునులు, నకులసహాదేవులు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు, భీష్ముడు, ధృతరాష్ట్రుడు, తమని తాము ఆవిష్కరించుకుంటూ ముందుకి సాగుతారు. మహాభారతంలో పాండవులకి, కుంతీద్రౌపదులకి, సర్వవేళలా అండగా నిలబడే – ఈ జయగాధకి సారధియైన యాదవ కృష్ణమహారాజు సజీవంగా సాక్షాత్కరిస్తాడు.

పాండురాజుకి శాపాలు, కుంతికి వరాలు– పాండవుల పుట్టుక ఇవి మహాభారతం చదువరికి ప్రశ్నలు రేకెత్తించేవే. ఈ ప్రశ్నలకి సమాధానాలన్నీ కుంతీగాధతో ముడిపడి ఉన్నాయి. నవలాకారుడు కుంతి అంతరంగాన్ని విప్పి – ఒకదాని తర్వాత ఒకటి పలికిస్తున్నపుడు పఠిత సంశయాలన్నీ మటుమాయమౌతాయి. కురురాజ్యంలో పాండురాజు పట్టమహిషిగా అడుగు పెట్టిన కుంతి జీవితం నిత్యం సంఘర్షణామయం. రాజ్యాన్ని పోగొట్టుకొని అరణ్యాలలో పన్నెండేళ్ళు, మారువేషాలతో విరాటరాజు కొలువులో సంవత్సరకాలం పూర్తి చేసిన కుమారుల రాజమాత కాని రాజమాత కుంతి. ఈమె ఆలోచనాస్రవంతిలో ఎన్నో గతకాలపు స్మృతులు ఆవిష్కరింపబడతాయి. పాండురాజుకి శాపం. అతడి నరాల బలహీనత, భార్యలను సంతృప్తిపరచలేని, తండ్రికాలేని దుస్థితి, హిమాలయ పర్వత శ్రేణులలో మేలైన ఔషధాలు లభ్యమౌతాయని



Text.pmd 8 2/28/2009, 6:15 PM

అందమైన పరిసరాలు తనలో ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తాయనే నమ్మికతో పత్నీ సహితుడై హిమాలయ పర్వత ప్రాంతాలకి వస్తాడు. కాలక్రమంగా తాను మందులు వాడినా జబ్బు కుదరటం లేదని గ్రహిస్తాడు. సనాతన ధర్మ ఆచార ప్రకారం నియోగం ద్వారా బిడ్డలను పొందాలని నిర్ణయించుకుంటాడు. హిమాలయ పర్వతం ఎగువ ప్రాంతాలలో నివసించేవారిని 'దేవగణం' అని పిలిచేవారు. ఆ దేవలోకంలో ధర్మాధికారి, సేనాధిపతి, దేవగణాల ప్రభువు ద్వారా కుంతి: ధర్ముడు, భీముడు, అర్జునుడు ముగ్గురి పిల్లలకి జన్మనిస్తుంది. ఇదే పద్ధతిలో మాద్రికి కూడా దేవగణం వారి వైద్యుల ద్వారా ఇరువురు కుమారులు నకుల, సహదేవులు జన్మిస్తారు. ఆర్యులకి మూలపురుషులైన ఈ దేవగణం వారికి స్త్రీ పురుష సంపర్కాలతో నియమాలంతగా లేవు. కానీ వైదిక సంస్కృతి చివరి దశలో అంటే కథాకాలానికి క్షత్రియులలో కురుపాంచాల దేశాలలో భార్యగా వచ్చే యువతి కన్యగా ఉండాలనే నియమం మొదలైంది. అలాగే ఒక స్త్రీకి ఒక పురుషుడు– అన్న ఆచారమూ ప్రారంభమైంది. దుర్వాసఋషి వల్ల గర్భవతి అయిన కుంతి ఈ నియమం వల్లనే తన మొదటి బిడ్డను వదులుకోవలసి వచ్చింది. లోకం దృష్టిలో కన్యగా, కురువుల ఇంట్లో పట్టపురాణిగా అడుగుపెట్టింది. పాండు రాజు మరణానంతరం పిల్లలతో హస్తినాపురం తిరిగి వచ్చింది. నియోగమనే పద్ధతి ప్రకారం పుట్టిన ధర్మరాజాదులు నాటి ధర్మం ప్రకారం రాజ్యార్హత ఉన్నవారే. కుంతి చాలా కుశాగ్రబుద్ధి కలది. ఆమె తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ఆమె తెలివి తేటలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. స్వయం వరంలో గెలుచుకున్న ద్రౌపదితో అర్జునుడు ఇంట్లోకి ప్రవేశించగానే కుంతి నాడు రాజుకుటుంబాలలో లేని ఒక అసాధారణ నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. తన పుత్రులు రాజ్యసుఖాలు పొందాలని,ఐక్యతగా ఉండాలన్నదే ఆమె ఏకైక లక్ష్యం. వారు కలిసి కట్టుగా ఉండాలంటే ద్రౌపది అందరికీ భార్యగా ఉండాలని భావిస్తుంది. ఇది ఆమె మనసులో మాట. ఈ విషయాన్ని ఆకర్షణీయంగా ద్రౌపదికి బోధించింది. బహుపతీ పద్ధతి నాడు హిమాలయ పర్వతాల దిగువ ప్రాంతాలలో ఉన్నదని డా॥ ఇరావతీకార్వే తన పరిశోధనల్లో వెల్లడించారు. బహుపతీ పద్ధతి హిమాలయాలలోని గడ్వాల్ భాగంలో 20వ శతాబ్దిలో కూడా కొనసాగుతూ వస్తోందని నవలారచయిత ఎస్.ఎల్. భైరప్ప తన పర్యటనలో తెలుసుకున్నారు.

ధృతరాష్ట్రుని పట్టపురాణిగా, దుర్యోధనాదులకు తల్లిగా, అంధత్వంతో భర్త చూడలేని లోకాన్ని తాను కూడా చూడరాదనే భావనతో కళ్లకు పట్టీకట్టుకున్న మహాపతివత్రగా, గంభీరంగా దర్శనిమిచ్చే గాంధారి– తన అంతరంగాన్ని నవలాంతంలో కృష్ణుడికి విశదం చేస్తుంది. నిస్సహాయురాలైన రాజకన్య నిరసన తెలియజేసిన విధం మనలని కూడా ఆవేదనాభరితులని చేస్తుంది. గుడ్డివాడిని పెళ్ళాడనని, భర్తగా గుడ్డివాడిని చూడలేనని, కోపంతో ఆక్రోశంతో రగిలిపోతూ మేలి వస్త్రాన్ని చించి, కళ్ళకి పట్టీగా కట్టుకున్న కన్నెపిల్ల గాంధారి ఆకృతి దృశ్య మానమౌతుంది. ఇలా చేస్తే తండ్రి తన మీద దయచూపి, వివాహ ప్రయత్నాన్ని ఆపుతాడేమో అన్న ఆశ కూడా ఆమెలో ఉండి ఉండొచ్చు. తనను లెక్క చేయకుండా తండ్రి తలపెట్టిన వివాహానికి ఆమె తన వ్యతిరేకతను తెలియజేసిన తీరు వలన జీవితాంతం ఆమె కళ్ళుండీ గుడ్డిదానిలా జీవించవలసి వచ్చింది. హస్తినావలి చేరాక ఆమె తన కళ్ళపట్టీని తీసెయ్యాలనుకుంది. కానీ అప్పటికీ చుట్టూ ఉన్న జనాలు ఆమెను దేవిగా, మహాపతివ్రతగా పొగడ్డం ప్రారంభించారు. పొగడ్తలకి పొంగి పోవటం వల్ల ఏం చేయాలో దిక్కుతోచని స్థితి. కన్న బిడ్డలని కూడా చూడలేని దుస్థితి. ఈ మానసిక సంఘర్షణతోనే గాంధారి జీవితమంతా గడిచిపోయింది. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ నిస్సహాయతకు గాంధారి ఉదాహరణ. ఏదీ ఏమైనా ఆమె అభీష్టానికి వ్యతిరేకంగా జరిగిన వివాహానికి ఆమె ప్రతిఘటన వ్యక్తీకరించిన వైనం యుగయుగాల స్త్రీల అంతరంగవేదనకు అద్దం పడుతుంది.

వ్యాసభారతంలో గంగా – శంతనులు వైవాహిక జీవనం కూడా పఠితలో సందేహాలను రేకెత్తిస్తుంది. ఏడుసార్లు గంగ తనకు పుట్టిన బిడ్డలను గంగలో పడేసి మళ్ళీ నవ్వు ముఖంతో ఎప్పట్లా శంతనుడితో కలిసి ఉంటుంది. శంతనుడు పుత్రదుఃఖాన్ని తనలోనే అణచివేసుకొని ఉంటాడు. అయితే ఎనమిదోసారి శంతనుడు నోరు విప్పుతాడు. అప్పుడు గంగ తన చేతలకి వివరణ ఇస్తుంది. ఏ కాలంలోనైనా ఒక జన్మనిచ్చిన తల్లి ఇలా చేయటం సాధ్యమా? అనే ప్రశ్నలకి 'పర్వ'లో సమాధానాలు లభిస్తాయి. 'పర్వ'లో గంగ కొండకులం స్త్రీ. శంతనుడితో వివాహానికి ముందు గంగ ఇలా చెబుతుంది. "మాలో ఆడబడుచుకు పుట్టే పిల్లలందరూ ఆమె తల్లి ఇంటికి చెందుతారు. మీలో అలా కాదు. పిల్లలేమున్నా ఆమె భర్త ఆస్తి, నేను నీతో పాటు వస్తాను. అయితే కులాన్ని తప్పి నడుచుకోలేను. నాకూ నీకూ కలిగే పిల్లలను పుట్టిన తక్షణం మా అమ్మగారింటికి పంపివేయాలి. దీనికి ఒప్పుకుంటావా? ఈ మాటలకి శంతనుడు అంగీకరిస్తాడు. అయితే ఎనిమిదోసారి రాజు గంగమాటలకి ఒప్పుకోలేదు. దానితో గంగ ఆగ్రహించి, అంతఃపురం వీడి వెళ్ళిపోతుంది. భీష్ముడి ఆలోచనలతో హిమాలయపర్వత ప్రాంతాలలో "ఒకజాతి అంతేనట" స్త్రీ పిల్లల్ని కని పుట్టింటికిస్తూ ఉంటుందట!" (పుట 433)

ఇటువంటి వాస్తవ స్థితి గతులను పరిశీలించి, పరిశోధించి నవలా నిర్మాణం చేసిన రచయిత ఒక కుంతి, గాంధారి, గంగాశంతనుల జీవితాలను వ్యాఖ్యానించే సన్నివేశాలే గాక, వ్యాస భారతంలో తార్కిక వివేచనకు అందకుండా, అద్భుత రసావిష్కరణ గావించే సన్నివేశాలను అతిసాధారణంగా మానవ హృదయ స్పందనకు సన్నిహితంగా మలిచారు. కామ, క్రోధ, లోభ, మోహ, మధ మాత్సర్యాలకు వశులైన మానవుల బహుముఖాలు, వారి ఆశలు, ఆకాంక్షలు కన్పిస్తాయి. ఉదాహరణకి వ్యాస భారతంలో దుశ్శాసనుడు ద్రౌపదిని నిండు సభలో పరాభవించటం. వస్త్రాపహరణ సన్నివేశం. దుశ్శాసనుడు ద్రౌపది చీర లాగుతుంటే ఈ దుశ్చర్యని అడ్డగించమని సభలో చిన్నా పెద్దలందరినీ పరి పరి విధాల వేడుకున్న ద్రౌపది చివరకు భగవంతుడిని ప్రార్థిస్తూ స్పృహ తప్పుతోంది. ఇంతలో దుశ్శాసనుడు చీర లాగగానే అద్భుతంగా మరొ కొత్త వస్త్రం ద్రౌపది శరీరాన్ని కప్పిఉంచుతుంది. దుశ్శాసనుడు ఆమె చీరలు లాగలేక, లాగలేక అలసిపోతాడు. విప్పిన చీరలు గుట్టలుగా కన్పిస్తూ వుంటాయి. సభలో అందరూ ఆశ్యర్యచకితులౌతారు. పెద్దలు కన్నీరు మున్నీరుగా విలపిస్తారు. 'పర్వ'లో ఈ సన్నివేశం వేరుగా వుంది. దుశ్శాసనుడు ద్రౌపది కొప్పు పట్టుకుంటాడు. ఆమె కొంగు లాగుతాడు. వంటి మీద చేయి వేస్తాడు. బలవంతంగా సభకి తీసుకెడతాడు. ద్రౌపది ధైర్యంగా తన అన్న శౌర్యాన్ని, కృష్ణుని బలపరాక్రమాలను సభలో చెప్పి



Text.pmd 9 2/28/2009, 6:15 PM

# బతకనిస్తే...

కదిరె కృష్ణ



కన్నీరెక్కడుంది?
నెత్తురే గదా కారుతుంది
మనసేడ ఖాళీగా ఉంది
బాధల జలధి గదా ఇప్పుడది
వాన ఎల్సినంక అకాశమంత ప్రశాంతంగా
పెను తుఫాను తర్వాత ఎడారంత విశాలంగా
కడుపుకుండలో పాకురు పట్టిన కష్టాల కషాయం
మిత్రుల పాదాల ముందు గీకి పోసింతర్వాత
హృదయమంత తేలికగా...
నన్నెప్పుడుండనిచ్చావు?
ఎర్రమట్టితో స్నానం బోసి
సున్నం నీళ్ళతో కాటుక బెట్టి
పద్నాల్గు సుక్కల ముగ్గు దిష్టిపూసల్గుచ్చి
గుండెలో వేలాడదీస్కున్న గార్భాల బిడ్డ ఆ వొంగుడు గుడిసెను
సెజ్ దొరగాడు సెర్సి సంపినట్టు
మాదిగ బాయి పొలం నెర్రెలు బాసినట్టు
నడినేతిరి స్మెశానం ఆనాధ గుండెల్లో మంటలు రేగుతున్నట్టు
గుండెలోతుల్లో ఎన్ని సంవద్రాలు ఉప్పొంగుతున్నయో సూస్తవా?
పుట్నెకాంచి సచ్చిందాకా స్మసానమైనోన్ని
అసలు బత్కుతున్నదెక్కడ?
రోజూ సస్తూనే సావుడప్పు వాయిస్తున్న
నన్ను గూడ బత్కనిస్తే బాగుండుననుకున్నప్పుడెల్లా
ఎదంతా సిగురిస్తుంది
తన్వంతా సింగిడీలు మొలకెత్తుతై
కోరికల నెవళ్ళు పురిప్పి హృదయ వేదిక మీన
సిర్తల రావాండమాడ్తై
వొట్టి తుంక లేంచినట్టు
కమ్మటి ఆసనలతోటి వొల్లు సొంతం గుప్పుమంటది
ఎక్కడ మీటినా గుర్రాలు ఉర్కులాడ్తయ్
యింతెల్లెమే కంటిల నల్లగుడ్డు సటుక్కున మాయమైంది
గ్రీష్మతాపం ఆకుల చెంపలు ఎడాపెడా ఆయించినట్టు
వొడగాలులకు చెట్లు మొఖాలు మాడ్సుకున్నట్టు
అప్పుల వేడికి నా బత్కు ముఖం
వొసంతమంతా నువ్వు లాక్కున్నంక
బతుకంతా శూన్యమే
నా బత్కంతా కల్లోల కాశ్మీరమే
సిత్కి సీము గార్తున్న గాయమే
పుండు పుండైనా దేహంలో
పురుగు ముట్టని మాంసం ముద్దల కోసం
ఎత్కులాటే జీవమైంది
కులం సూదుల్తోటి నిలువెల్లా పొక్కల్పొక్కల్గా
పొడుస్తుంటే
నెత్తురెక్కడుంది
వొగరే గదా కారుతుంది!

---

దుర్యోధనాదులను బెదిరిస్తుంది. భీముడులేచి దుశ్శాసుని రొమ్ముచీల్చి రక్తం తాగకుంటే నేను భీముణ్ణి కాదని భీషణ ప్రతిజ్ఞ చేస్తాడు. సభలో అందరూ భయపడతారు. ఈ పరిణామాలకి లోపల గదులలో నుంచి గాంధారి సభలో ప్రవేశించి ధృతరాష్ట్రుడిని తనతో తీసుకెళుతుంది. సభా భవనంలో వాగ్వాదాలు సాగుతూనే వుంటాయి. ధృతరాష్ట్రుడు మరలా సభలోకి వచ్చి ద్రౌపదిని సముదాయిస్తాడు. ఆమెకి వరాలిస్తానని, జరిగినదంతా మరచిపోమ్మని చెబుతాడు. మీరు 'ఇప్పుడే ఇంద్రప్రస్థానానికి ప్రయాణం కండి' అని అంటాడు. ఏదో అనబోతున్న దుర్యోధనుని 'నువ్వు నోరుమూసుకొని పడివుండు" అని గద్దిస్తాడు. గాంధారి సలహాతో ధృతరాష్ట్రుడు కొంత దూరదృష్టితో వ్యవహరించినట్లు మనకు బోధపడుతుంది. ఈ మొత్తం వ్యవహారమంతా ఉమ్మడి కుటుంబాలలో సంభవించే అవాంఛనీయ కలహంలాగా మనకు తోస్తుంది. మరొక ఉదాహరణగా కృష్ణుని రాయబార ఘట్టాన్ని స్వీకరించవచ్చు. ఆ సభలో కృష్ణుడు తన విశ్వరూపాన్ని పరమేశ్వర తత్త్వాన్ని ప్రదర్శించినట్లు వ్యాసభారతంలో ఉంటుంది. అంధుడైన ధృతరాష్ట్రునికి కృష్ణుని దయా విశేషం వల్ల చూపు వస్తుంది. అతడు కృష్ణుని విశ్వరూపాన్ని చూడగలుతాడు. అయితే 'పర్వ'లో ఈ సన్నివేశాలుండవు. రాయబారిగా వచ్చిన కృష్ణుని హితోపదేశమే ఉంటుంది. దీనిపై కురుముఖ్యులు స్పందనలుంటాయి. తనమీద దాడి జరుగుతుందని ముందే ఊహించిన కృష్ణుడు తెలివిగా సభాభవనం నుంచి తప్పించుకుంటాడు. ఇదే మాదిరిగా ఇతర సన్నివేశాలలో కూడా మంచీ, చెడుల మధ్య సంఘర్షణే వివరించ బడుతుంది. అతిమానుషశక్తుల ప్రమేయం ఎక్కడా ఉండదు.

కథకి రంగస్థలమైన హిమాలయ పర్వత భూములు, కొండలు, నదీనదాలు, జలపాతాలు, వాటి మర్మరధ్వనులు, నగరాలు, గ్రామాలు, భవనాలు, పూరిండ్లు, ఆహార విహారాలు, ఆచార వ్యవహారాలు, అందాలు, అలంకారాలు, ఒకటేమిటి! ఇలా కొన్ని వేల సంవత్సరాల నేటి భారత భూభాగాన్ని, వైదిక సంస్కృతిని పర్వ దృశ్యమానం చేస్తుంది. పాఠకుడికి 'పర్వ' పరిపూర్ణమైన సంతృప్తి కరమైన అనుభవాన్ని అందిస్తుంది. నవలా నిర్మాణంలో రచయిత ఒక 'pattern'ని అవలింభించటమే దీనికి కారణం. 'pattern' పదాన్ని Annold kettle ఈ విధంగా నిర్వచించాడు– "pattern is the quality in a book which gives it wholeness and meaning makes reading of it a complete and satisfying experience"

– సౌష్టవ నిర్మాణం గ్రంథానికి యోగ్యత కలిగిస్తుంది. గ్రంథాన్ని సంపూర్ణమూ, అర్థవంతమూ చేస్తుంది. చదవటం పూర్తి చేశాక పఠితకు పరిపూర్ణమైన అనుభూతిని ప్రసాదిస్తుంది.

ఉత్తర భారతదేశంలో ఊరూరా సంచారజాతులు ఈ ఇతిహాస వీర జయగాథని పాడుతూ తిరిగేవారట! తదనంతర కాలాల్లో కావ్యంగా రూపొందిన మహాభారతాన్ని కన్నడంలో ఆధునిక జీవజాలంతో, నవ్యశిల్ప ధోరణులతో నవలగా తీర్చిదిద్దిన సుప్రసిద్ధ కన్నడ నవలా రచయిత శ్రీ.ఎస్.ఎల్. భైరప్ప అభినందనీయులు. 730 పుటలలో తెలుగు నుడికారపు ఇంపుసొంపులతో, రాయలసీమ మాండలికాలతో ఈ నవలానువాదం హృద్యంగా సాగింది. మూల రచన కన్నడానికి ఈ తెలుగు అనువాదం బంగారానికి పరిమళం అద్దినట్లుగా రూపు దిద్దుకుంది. 'పర్వ' అనువాదానికి అనువాద రచయిత ప్రొ॥ గంగిశెట్టి లక్ష్మీనారాయణకు కేంద్రసాహిత్య ఎకాడెమీ పురస్కృతి నందించి తన్ను తాను గౌరవించుకుంది.

●



Text.pmd 10 2/28/2009, 6:15 PM

**కవిత**

# మట్టిమహత్తు

**కె. ఆనందాచారి**



ఇక్కడి గీతానికి లయ
ఆరోహణే
ఇక్కడి గొంతుక ధ్వని
ప్రభంజనమే
ఈ నేల మొలకెత్తిన చేతులు
పిడికిళ్లెత్తి నినదిస్తయి
త్యాగాల రక్తాలు నింపుకున్న నేల
మంటల రాగాలనెత్తిన నేల
ఆధిపత్య ఆకృత్యాలపై
నిప్పులు చెరగడం తప్ప
నిమ్మకు నీరెత్తడం  తెలీని నేల

ఇక్కడి మట్టికి వెరపులేదు
ఇక్కడి అడుగుకు జడుపులేదు
వీరులకు పురుడుపోసిన నేలిది
పోరుకు శిరస్సు నెత్తిన  నేలది

ఒక్కసారి ఈ మట్టిని చేతబట్టి
గుండెకు హత్తుకొని చూడు
సామాన్యుల అసామాన్య  సంగతులెన్నో
చరిత్రపుటలై విప్పుకుంటాయి



మట్టికి శక్తి లేదనుకోకు
మట్టి మనుషుల నిత్య సామూహిక
చలనాల చర్యల్లో నేల ప్రాణ శక్తయి
నిలిచింది కాదా!

మట్టి మౌనాన్ని హేళన చేయకు
మౌనాలన్నీ మహా విస్ఫోటనాలై లేస్తవి!
మట్టి మహత్తును మననం చేయాల్సిన సమయమిది
మట్టి మనుషుల్ని ఒక్కటి చేయాల్సిన తరుణమిది

ఈ మట్టిని గురించే పాడాలిప్పుడు
ఈ మట్టిని చెరపట్టే దుష్టత్వంపై
ధ్వజమెత్తాలిప్పుడు

నా పాటకు ఈ మట్టే వస్తువు
అన్యాయాలపై తిరుగుబాటు రూపాన్ని
అద్దుకుంటాను అలంకారంగా

ఇప్పుడు రాజులేడు నైజాము లేడు
కోటలేదు ఫిరంగితూటా లేదు
కళ్లెదుట శత్రువు కదిలికే లేదు
కానీ
నేల నేలంతా వాడి ముళ్ల తీగ వ్యూహం
విస్తరిస్తూనే వుంది
మట్టి రెక్కలు పిండిన చెమట చుక్కల్లోంచి
విచ్చుకున్న సంపద ఫలాలపై
వాడి డేగకన్ను రెప్ప విప్పుకునే వుంది
వాడి కుట్రలు తెలుసుకొనే తీరికలేనితనం లోకి
తెలియని మాయలపొరల్లోకి
నెట్టబడ్డ నువ్వు
ఎన్ని ఇక్కట్ల కత్తులు విసరబడుతున్నా
నిత్యకార్యశీలిని నువ్వు
వాడొక ఆక్రమణవాది
సమస్త వస్తుప్రపంచం సృష్టికర్త నువ్వు
నిన్నే ఒక వస్తువును చేస్తాడు వాడు
పచ్చనిపంట పొలాలపై
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై
మానవ హక్కులపై
వాడి  వికృత ఉక్కుపాదం మోపుతున్న దృశ్యం
అదృశ్యంగానే కొనసాగుతోంది.
ఇక్కడి నేల నీరు గాలి
గీతం, సంగీతం, అక్షరం, అస్త్రం, శస్త్రం
సమస్తం
ఒక్కొక్కటీ, అన్నింటినీ కలిపి
వాడు వంపుకొని తెంపుకొని పోతున్నాడు
నిన్ను అమ్మకానికి
నడి మార్కెట్టులో పెట్టి, తాను
కొనుగోలుదారుడై
లాభాల వేటలో సరిహద్దుల కంచెలేవీ
నిలువరించలేవని వాడు విర్రవీగుతున్నాడు
నిశబ్దంగా నిన్ను చుట్టుముడుతున్నాడు
వాడ్ని పసికట్టాలి  నువ్వు
ఇక మళ్లీ
వడిసెలు విసిరేందుకు లే!



Text.pmd 11 2/28/2009, 6:15 PM

## అనువాదం

# కొలకలూరి ఇనాక్ గారి ఇంగ్లీషు కావ్యానికి

### అద్దేపల్లి తెలుగు అనువాదం




■ అంపశయ్య నవీన్

**ఇ**టీవలి కాలంలో తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల పాఠకులుకు అందించాలన్న లక్ష్యంతో అనువాదాలు విరివిగా జరుగుతున్నాయి. అమెరికాలో ఉంటున్న వెల్చేరు నారాయణరావు తెలుగు సాహిత్యంలో క్లాసిక్స్‌గా ప్రసిద్ధి పొందిన అనేక గ్రంథాలను ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురిస్తున్నారు. ఇటీవలనే డా॥ ఎల్.ఎస్.ఆర్ ప్రసాద్ పోతన భాగవతాన్ని ఇంగ్లీషులోకి అనువదించారు. ఆయనే భగవద్గీతను కూడా ఇంగ్లీషులోకి అనువదించారు. అలాగే ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువదించబడుతున్న గ్రంథాల సంఖ్య కూడా పెరుగుతున్నది.

కవిగా, కథకుడిగా, నవలాకారుడుగా, నాటకకర్తగా, విమర్శకుడిగా లబ్ధ ప్రతిష్టుడైన ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు ఇంగ్లీషులో (Voice of Silence) అన్న పేరుతో రచించిన కావ్యాన్ని 'నిశ్శబ్దస్వరం' పేరుతో ప్రముఖ కవి, విమర్శకుడు అద్దేపల్లి రామమోహనరావు ఇటీవలనే తెలుగులోకి అనువదించారు.

ఒక భాషనుండి మరో భాషలోకి, ముఖ్యంగా కవిత్వాన్ని సంతృప్తి కరంగా అనువాదం చెయ్యడమనేది చాలా కష్టసాధ్యమైన విషయం. అనువాదకుడికి మూలభాషమీద, లక్ష్య భాష మీద మంచి పట్టు ఉండాలి. ఈ రెండు భాషలు మాట్లాడే ప్రజలకు సంబంధించిన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక జీవనం మొదలైన అంశాలను గూర్చిన అవగాహన ఉండాలి. పదానికి పదం అనువాదం చెయ్యడం కాకుండా లక్ష్యభాషను మాట్లాడే వాళ్ళ సంస్కృతిని బట్టి వాళ్ళ కర్థం కావడం కోసం అనువాదకుడు కొంత స్వేచ్ఛను తీసుకోవలసి ఉంటుంది. చదువుతున్న వాళ్లకు ఇది అనువాదం అని అనిపించకుండా అనువదించటంలోనే అనువాదకుడి ప్రతిభ వ్యక్తమౌతుంది. నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగడలు అనువదించిన ఆంధ్ర మహాభారతాన్ని చదువుతోంటే 'ఇది సంస్కృతంలోంచి అనువాదం చెయ్యబడింది' అని పాఠకులకు అనిపించదు. మక్కికి మక్కి కాకుండా అనువాదకుడు తన స్వయం ప్రతిభతో లక్ష్య భాషకు అనువైన రీతిలో సాఫీగా సాగిపోయేలా అనువాదం చెయ్యవలసి వుంటుంది. అందుకే ఇవ్వాళ్ళ అనువాదం అనే మాట మరుగున పడిపోయి 'అనుసృజన' అనే మాట వ్యాప్తిలోకొచ్చింది.

కొలకలూరి ఇనాక్ ఇంగ్లీషులో రచించిన Voice of Silence అన్న కావ్యంలో 'ప్రేమ' అన్నది మానవుడి జీవితానికి ఎంతో ఆవశ్యకమో కవి ఎంతో హృద్యంగా చెప్పాడు. 'ప్రేమ', మౌనం ఇవి రెండూ ఈ కావ్యానికి అంతసూత్రాలుగా కనిపిస్తాయి. స్వయంగా తనూ ప్రతిభావంతుడైన కవి కావడం వల్ల అద్దేపల్లి, ఇనాక్ రచించిన ఈ కావ్యంలోని అంతసూత్రాన్ని పట్టుకోగల్గాడు. పాఠకులకు ఇది ఇంగ్లీషు కవితకు అనువాదం అన్న భావం ఎక్కడా కల్గకుండా చాలా చక్కని తెలుగులోకి అద్దేపల్లి, ఇనాక్ ఇంగ్లీషు కావ్యాన్ని అనువదించగల్గాడు.

ఇనాక్ రచించిన 'They love' అన్న కవితలోని ఈ చరణాలను:

'Why do the arists create
the art is varied colours
shapes, shades and dimensions?
why does the sky protect
the earth bear
and the fire burn
they love
they love
they love'

అద్దేపల్లి ఇలా అనువదించాడు:

*'అనేక వర్ణాల్లో, రూపాల్లో*
*వివిధ ఛాయల్లో*
*విభిన్న కోణాల్లో*
*కళాకారులు ఎందుకు కళను సృష్టిస్తారు?*
*ఆకాశం ఎందుకు కాపాడుతోంది*
*భూమి ఎందుకు మోస్తోంది*
*ఎందుకు అగ్ని మండుతోంది*
*వాళ్ళు ప్రేమిస్తున్నారు*
*వాళ్ళు ప్రేమిస్తున్నారు.*
*వాళ్ళందరూ ప్రేమిస్తున్నారు'*

'Love Upholds the earth
the humanity and the life
love is almighty' అన్న చరణాల్ని

*భూమినీ/మానవజాతినీ/ జీవితాన్ని/ ప్రేమ పదిలంగా పట్టుకుంటుంది/ప్రేమంటే పరమాత్మమే'* అని అద్దేపల్లి అనువదించాడు.

'love is almighty' అని ఇనాక్ అన్నాడు కాబట్టి ప్రేమంటే సర్వశక్తి వంతుడైన పరమాత్మమే అంటే ఇంకా బావుండేదేమో.



Text.pmd 12 2/28/2009, 6:15 PM

‘Encircling Beauty'  అన్న కవితలోని ఈ చరణాల్ని

'The butterfly rests on a sofa of flowers
the child stands gasping
and looks at the soul fo the garden
which smells like mother’s milk
the butterfly becomes silent
sits on a cluster of flowers
and fans its body
with its colour full wings'   అనే చరణాల్ని అద్దేపల్లి అనువదించిన తీరు బావుంది:

‘ సీతాకోక చిలుక
పూల సోపామీద విశ్రాంతి తీసుకుంటుంది.
తల్లి పాలలా పరమళించే
తోట అంతరంగలోకి చూస్తూ
పిల్ల బరువుగా ఊపిరితీసుకుంటూ నిలబడుతుంది.
సీతాకోక చిలుక మౌనంగా
ఒక పూలగుత్తి మీద కూర్చుంటుంది.
తన రంగు రంగుల రెక్కలతో
దాని ఒంటిని విసురుతూ ఉంటుంది’

Cluater of flowers అనే మాటను ‘పూలగుత్తి’ అనడం బాగుంది.

New Horizon అనే కవితలోని సందేశం ప్రేమతో ఈర్ష్యా అసూయను జయించ వచ్చునని, ఈ క్రింది చరణాలను చూడండి.

'Envy conquered the eyes
they turned blood red
jelousy defeated the sight
and the vision was blurred
He could not see the heart
that followed him for generations
with service and surrender'

*‘అతని కళ్లను ఈర్ష్య జయించింది
అవి నెత్తురులా ఎర్రబడ్డై
అతని దృష్టిని అసూయ ఓడించింది.
అది మసకబారి పోయింది.
సేవభావంతో లొంగిపోయి
తరతరాలుగా అతని వెంట వస్తున్న
హృదయాన్ని గమనించలేకపోయాడు’*

'The union of his body and heart
electrocuted the dens of devilish designs
He buried the envy ane jelousy
deep inside lighted his eyes
and he saw the dawn of a new horigon'

‘అతని మనశ్శరీరాల కలయిక/రాక్షస వ్యూహాల గుహలన్నిటినీ
విద్యుద్దహనం చేసింది/అతడు కన్నీళ్ళ లోతుల్లో
ఈర్ష్యాసూయల్ని పాతిపెట్టాడు/అతని దృష్టి కళ్ళని
వెలిగించింది/భూమ్యాకాశాలు కలిసేచోట
అతడొక కొత్త వేకువను దర్శించాడు’

Electrocuted అన్న మాటను ‘విద్యుద్దహనం’గా అనువదించటం చాలా బావుంది. కానీ అతని దృష్టి కళ్ళని వెలిగించింది అన్నప్పుడు స్పష్టతలోపించింది. “ఈ మార్పు అతని కళ్ళని వెలిగించింది” అంటే బావుండేదేమో.

ఈర్ష్యాసూయల్ని పాతి పెట్టాడు కాబట్టి అతని కళ్ళు వెలిగిపోయాయి..... ఈర్ష్యాసూయలతో నిండిపోయినప్పుడు అతని కళ్ళు మసకబారాయి. ఈర్ష్యాసూయల్ని పాతిపెట్టడం అనే మార్పు అతనిలో జరిగింది. కాబట్టి అతని కళ్ళు వెలిగిపోయాయి అని ఇక్కడ కవి చెప్పదల్చుకున్నాడు.

‘ఈర్ష్యాసూయల్ని పాతిపెట్టాడు. అతని దృష్టి కళ్ళని వెలిగించింది. అన్నప్పుడు పై చరణానికి, దాని తర్వాతి చరణానికి అన్వయం కుదరటం లేదు.

'It is a Mirrer' అనే కవితో మంచి పుస్తకాన్ని అద్దం అంటాడు కవి. పుస్తకంలో మన అంతరంగాన్ని, చదువుకోవచ్చునని చెబుతూ– 'She pours out her inner self to me
with great enthusiasm
I have clandestine experience
with her inner beauty
she revealed it only to me' అంటాడు.

ఈ చరణాలను అద్దేపల్లి

*‘అది (అద్దం) గొప్ప ఉత్సాహంతో/తన అంతరాత్మని నా ముందు ఒలకబోస్తుంది/నేనొక అతి రహస్యమైన అనుభూతిని పొందాను ఆమె నాకు మాత్రమే ఆ అవకాశం కల్గించింది’* అని అనువదించాడు.

ఇక్కడ 'pours out ' అని మాటను ఒలకబొస్తుంది అని కాకుండా ‘కుమ్మరిస్తుంది’ అంటే బావుండేది. అలాగే ‘Clandestine’ అనే మాటను రహస్యమైన అని కాకుండా ‘నిగూఢమైన’ అంటే ఇంకా బావుండేదేమో. ఇంగ్లీషు మూలంలో కూడా ‘Clandestine’ అనేమాట బాగాలేదు. ఎందుకంటే ఆ మాటను నెగిటివ్ అర్థంలో – గూడుపుఠాని అనే అర్థంలో వాడ్తారు.

‘Stars’  అన్న కవితలోని ఈ పంక్తుల్ని

‘The Stars are flowers
scattered by the playing child
to lend fragrance to the dark clouds
they are the grains/dispered by the hand of destiny/for the birds of the sky to ear them'

*‘నల్ల మబ్బులకు / సుగంధాల్ని పంచడానికి
ఆటలాడుకునే పసిపిల్లలు /వెదజల్లిన పూలే నక్షత్రాలు*



Text.pmd 13 2/28/2009, 6:15 PM

మత్తులో వున్న
మోసానికి గురి
మత్తులో లేకుం
మీసం మీద చె

## ప్రతి స్పందన

**మహమ్మద్‌ఖాన్**

నానుండి తప్పిపోయిన
కవితలు
ఎదుట పడి, నాలో క్రొత్త భావాలు
రేపుతాయి
ఆ క్షణం
నన్ను నేను పోగొట్టుకుంటాన
ప్రపంచాన్ని మైమరపిస్తూ
తనవెంట
త్రిప్పుకుంటూ తిరిగే
అందమైన ప్రకృతే, కవిత్వం.
విషాదమే, కవిత్వాన్ని బలంగ
ఫ్రేరేపించేది
విరహభాషే ఎదను
సున్నితంగా రగిల్చేది
పారదర్శక నీటిపై విసిరిన
రాతి అలజడిలా
కాలం చేసిన గాయాలు నన్ను
ఇంకనూ బాధిస్తూనే వున్నాయి



## చల్లగాలి నానీలు

**చల్లగాలి బాబురావు**

పార్లమెంటు మార్కెట్టులో
ప్రశ్నలన్నీ వేలం
అయినోళ్ళకు
అమౌంట్లుతో గాలం

పొట్టకూటికి
యమ యాతన
గుళ్ళు గోపురాల కోసం
ఆరాటం

చట్టసభల్లో
నేతలై శాసిస్తారు
ఆశించిన వన్నిటినీ
ఆస్తుల్లా మేస్తారు

నిజాలు
అబద్ధాలు
బ్రతుకు నేర్చిన వాడికి
నిచ్చెనలు

జి.వో. లెన్నో
పేదోడి తలకి
తైల సంస్కారమేది
కంటి తుడుపే అన్నీ

రెక్కాడందే
డొక్కాడదు రోజూ
చుక్కలేందే
ముక్కాల్లిందేపనికి



మెరిసేది
తలచేది
మరవలేనిది
మనిషిలోని మానవత్వం

కత్తిమొన మీద కదా
జీవితం
గాయపడకుండా
నేర్చుకో జీవించడం

ఉలిస్పర్శ
తగిలితే కదా!
రాయి మనస్సు
కరిగేది!

పగటి కల
సగటు మనిషిది
రాత్రి కల
రోజూ ముసాబయ్యేది

రాజీలేని ఎదకి
రోజూ యుద్ధమే
రాజీవున్న హృదికి
అంబర చుంబరమే

---

*ఆకాశపక్షులు తినడానికి/ విధాతహస్తం విరజిమ్మిన*
*బియ్యపు గింజలే నక్షత్రాలు'* అన్న అద్దేపల్లి అనువాదం బావుంది. అయితే 'Playing' అనే మాటకు 'ఆటలాడుకునే' అన్న అర్థం ఉందా అని అద్దేపల్లి ఆలోచించాల్సింది. ఆటలాడుకునే అని కాకుండా 'అల్లరిపిల్లలు' అంటే అర్థం సరిపోయేదేమో!

ఇనాక్ గారి ఈ ఇంగ్లీషు కావ్యంలోని కవితల్లో కెల్లా 'Love is a Wounded Heart' అన్న కవిత తలమానికమైంది. ఒక దళితుడు జీసస్ క్రీస్తుతో తన గోడును వినిపించుకుంటున్నట్టుగా సాగిన ఈ కవిత పాఠకుల హృదయాల్ని ద్రవింపచేస్తుంది. ఈ కవితలోని ఈ పంక్తుల్ని చూడండి:

'Your crucifixion/is for a day
mine is for life/crucifying every day
I am a race/I am disgraced
Iam a dalit/You don't know
what a dalit is/I sympathise with your agony
but you can't with me/Iam bleeding
Iam a wounded heart/To Love
Your must have a heart/which dreams the
glory of man/the bliss of heaven
and the blessing fo gods' బాధతో నిండిన ఈ

పంక్తుల్ని అద్దేపల్లి ఇలా అనువదించాడు.

'నీకు సిలువ వేసింది/ఒక్కరోజుకే
నాది జీవితాంతం/ప్రతి రోజూ నేను సిలువ వేయబడ్డాను
నాదొక జాతి/నేను తక్కువగా చూడబడ్డాను
నేనొక దళితున్ని/దళితుడంటే యేమిటో నీకు తెలీదు
నేను నీ బాధకు/సానుభూతి చూపిస్తాను.
కాని నువ్వు నాకు చూపించలేవు/నేను నెత్తురోడుతున్నాను
నేనొక గాయపడిన హృదయాన్ని/ప్రేమించడానికి
నీకొక హృదయం ఉండాలి/అది మనిషి ఔన్నత్యాన్నీ
స్వర్గానందాన్ని/దేవుళ్ళ దీవెనల్ని/కలలు గనాలి
ప్రేమించడానికి/నీకొక బలమైన హృదయం ఉండాలి.

ప్రతీకార వాంఛతో రగిలిపోవడం కాకుండా దళితుడు హృదయాన్ని ప్రేమతో నింపడం ఈ కవితలో ఇనాక్ సాధించిన గొప్ప విజయం. ఓ దళితుడు జీసస్ క్రీస్టును సంబోధిస్తూ తన బాధను చెప్పుకోవడం అనే భావం చాలా గొప్పగా వుంది. ఈ కవితను అద్దేపల్లి తెలుగులోకి అనువదించిన తీరు కూడా బావుంది. అయితే ఏ రచన కూడా పరిపూర్ణం కాదు. కొన్ని లోపాలు ఉంటూనే ఉంటాయి. అద్దేపల్లి తన అనువాదాన్ని మరోసారి చదువుకుంటే అక్కడక్కడా కొన్ని మార్పులు చెయ్యవచ్చు. వచనాన్ని అనువదించటం పెద్ద కష్టం కాకపోవచ్చు, కానీ కవిత్వాన్ని అనువదించటం కష్టసాధ్యమైన విషయం. ఇనాక్ ఇంగ్లీషులో రచించిన కవితల్ని అద్దేపల్లి చాలా సులభమైన శైలిలో ఎక్కడా అనువాదం అనిపించకుండా చక్కని ధారతో అనుసృజన చేసినందుకు ఆయనను అభినందిస్తున్నాను. మలికూర్పులో అక్కడక్కడా కొన్ని పదాల్ని మారిస్తే ఈ అనువాదం ఇంకా బావుంటుంది. ●

# రిచ్ డాడ్- పూర్ సన్

◆ కథ



ఈరోజుల్లో కూడా ఇంతమంది అంతసేపు టిక్కెట్లకోసం క్యూలో నిలబడి మరీ, నెక్లెస్ రోడ్డులోని పుస్తక ప్రదర్శనకి వస్తున్నారంటే- హైదరాబాదు మరీ అంతగా చెడిపోలేదని సాగర్‌కి అనిపించింది. ఒక్కొక్క స్టాలునూ చూస్తూ పోతూంటే, జ్ఞాన సముద్రంలో మునిగి తేలుతున్నట్లుగా ఉందతనికి. కెరటాల మధ్యలో సముద్ర జీవుల్లా, పుస్తకాల మధ్యలో సందర్శకులు తారసిల్లుతూ ఉన్నారు. అందులో ప్రముఖులు, పరిచయస్తులు, స్నేహితులు, ఆగంతకులు... ఇలా ఎందరెందరో పుస్తక ప్రియులున్నారు.

## ■ యాళ్ళ అచ్యుతరామయ్య

**సా**గర్ పక్కనున్న ఒక స్టాల్ నుండి మరో స్టాల్‌కు వెడుతూ, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ మధ్యలో నిలబడివున్న ఓ మధ్యవయస్కుణ్ణి చూసి 'ఇతనూ... డిగ్రీలో నా క్లాస్‌మేట్ అరుణ్‌కుమార్ కదూ!' అని అనుకుంటూ అతన్ని తేరిపార చూసేడు. 'యస్... అనుమానం లేదు. అరుణ్ కుమారే! కాస్త ఒళ్ళు చేసేడంతే! అయిదారేళ్ళ తర్వాత ఇప్పుడే కదా చూట్టం! పలకరించాలా, వద్దా?... అతనితో నాకేం శత్రుత్వం లేదే! కానీ... స్థలం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని, మోసం చేసేడని, నా క్లాసుమేట్సే ఇద్దరు ముగ్గురు మొత్తుకున్నారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇబ్బడి ముబ్బడిగా సంపాదించేడని తెలిసింది. డబ్బే ప్రపంచంగా బతికే ఇలాంటి వాడికి దూరంగా ఉంటేనే మంచిది...' అనుకుంటూ వెనుతిరగబోయాడు.

మొబైల్లో సంభాషణ ముగించిన అరుణ్‌కుమార్ ఇటు తిరిగి "హేయ్... సాగర్! ఏంట్రా, ఎలా ఉన్నావ్? ఎన్నాళ్ళకి కలుసుకొన్నాం!" అంటూ దగ్గరకు వచ్చి షేక్ హేండిచ్చాడు.

"ఓఁ... నువ్వా అరుణ్! బావున్నావా?" అంటూ సాగర్ అతన్ని దగ్గరకు తీసుకున్నాడు. వింతగా- దూరం మరింతగా పెరిగినట్లనిపించింది. అరుణ్ శరీరం నుండి గుప్పుమని వచ్చిన పెర్‌ఫ్యూమ్, అతని ఒంటిపైన అతి ఖరీదైన డ్రెస్సు, మెడలో, చేతులకూ బంగారు చెయిన్లూ చూస్తుంటే, చిన్ననాటి స్నేహితుడైనా, అతని చుట్టూ ఏదో అపరిచిత వాతావరణం కమ్ముకుని వుంది.

"సాగర్... నీ గెటప్‌లో ఏమాత్రం తేడా రాలేదురా. నీలా ఆకలి కవిత్వం రాసే తెలుగు కవులందరూ ఇలానే ఉంటారేమో!..." అంటూ మొదలెట్టిన అరుణ్‌కుమార్ – పెళ్ళెప్పుడు? పిల్లలెంతమంది? ఏం ఉద్యోగం? ఎంత జీతం? సొంతిల్లు కట్టేవా? ఏ మాత్రం వెనకేసావ్?... లాంటి రొటీన్ ప్రశ్నలతో విసుగెత్తించేడు.

అన్నిటికీ సాగర్ ముక్తసరిగా సమాధానం చెప్పేసరికి అరుణ్ కుమార్ కాస్త నిరుత్సాహ పడ్డాడు.

ఇద్దరూ ఎగ్జిబిషన్ బయటనున్న కేంటీన్ వైపు నడిచి, ఓ ఖాళీ టేబుల్ చూసుకుని కూర్చున్నారు. అరుణ్‌కుమార్ వెళ్ళి వేడి, వేడి మిర్చి బజ్జీలను తీసుకుని వచ్చేడు.

"అవున్రా సాగర్... నా గురించి తెలుసుకోవాలని లేదా నీకు?"

"నా గురించి నేనే ఇంకా పూర్తిగా తెలుసుకోలేదు. ఒకరి గురించి తెలుసుకోవడమంటే, ఆస్తిపాస్తుల గురించి తెలుసుకోవడం కాదు కదా! ... కానీ ఒకందుకు నాకు సంతోషంగా ఉందిరా. డిగ్రీ పరీక్షల సమయంలో క్లాసు పుస్తకాలు చదవడానికే బద్ధకించే నీవు... పుస్తకాలపై ఆసక్తి ఇన్నాళ్ళకన్నా చూపించడం అంటే – గ్రేట్ ఎచీవ్‌మెంట్!..."

"చాలా పొరపాటుపడ్డావురా! బిర్లా మందిర్‌లో కనిపించిన వాళ్ళంతా భక్తులెలా కారో, అలానే... నేనూ. పుస్తకాలపై ప్రేమతో ఏం రాలేదిక్కడికి. మా అబ్బాయిని బలవంతంగా బి.కామ్.లో చేర్పించి, సైమల్‌టేనియస్‌గా సి.ఎ.క్కూడా కట్టిస్తున్నాను. అయినా కూడా వాడికి డబ్బుకి సంబంధించిన జ్ఞానం శూన్యం. నీ లాంటి పుస్తకాల పురుగొకడు ఏమన్నాడంటే- మా వాడితో రాబర్ట్ కియోసాకి రాసిన 'రిచ్‌డాడ్, పూర్ డాడ్' చదివిస్తే, ఆ తర్వాత మరింకేం చదవకుండా, ఏకంగా డబ్బు సంపాదించడమే పనిగా పెట్టుకుంటాడని సలహా ఇచ్చేడు... ఆ ఒక్క బుక్కే కొన్నాను" అంటూ ఫోల్డర్ బేగ్‌లోంచి, పుస్తకాన్ని బయటకి తీసేడు.

సాగర్ చిన్నగా నవ్వి "నువ్వెలాంటి పుస్తకాలు చదువుతున్నావో తెలిస్తే, నువ్వెలాంటి వాడివో అర్థమైపోతుంది" అన్నాడు.

అరుణ్ కుమార్ కాస్త ఇబ్బందిగా నవ్వి "నువ్వేం పుస్తకాలు కొన్నావో చూడొచ్చా?" అన్నాడు.

సాగర్ భుజానికి వేలాడుతున్న గుడ్డ సంచిలోంచి పుస్తకాలను బయటకి తీసి, టేబుల్ పైన పెట్టాడు.

అరుణ్ కుమార్ ఒక్కొక్క పుస్తకాన్ని తీసుకుని, వాటి టైటిల్స్‌ను చదవడం ప్రారంభించేడు. "ఒక దళారీ పశ్చాత్తాపం...సాదత్ హసన్ మంటో కథలు... ప్రపంచీకరణ- ప్రజల ప్రత్యామ్నాయాలు... ముస్లింవాద తాత్వికత... రిజర్వేషన్లు- సామాజిక న్యాయం... స్త్రీవాద వివాదాలు... తెలంగాణ నుంచి



Text.pmd 15 2/28/2009, 6:15 PM

తెలంగాణ దాక– ఏంట్రా ఇవీ?! మనుషులు చదివే పుస్తకాలేవీ నీవు చదవవురా! నువ్వు మారవురా బాబూ".

"నేనూ అదే అనుకుంటున్నా"

"ఓకేరా... ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. పద– మా ఇంటికి పోయి మాట్లాడుకుందాం"

"మనసులు కలవనపుడు మనుషులు కలవడం వలన ఏం ప్రయోజనం!" అంటూ సాగర్ నవ్వేడు.

"మా ఆవిడకీ, మా అబ్బాయికీ నీ గురించి ఎప్పుడూ చెబుతూ ఉంటాను. మా ఇల్లిక్కడకి దగ్గరే... ఓ కప్పు కాఫీ తాగేకా, ఓ గంటలోపుగా మళ్ళీ నిన్నిక్కడే దింపుతా" అన్నాడు అరుణ్ కుమార్.

మరీ బెట్టు చేయడం బావుండదని, సాగర్ అతని వెంట నడిచేడు. రోడ్డుకి అవతల వైపు నున్న పార్కింగ్ స్థలంలోకి వెళ్ళేడు. అరుణ్ కుమార్ పేంట్ జేబులోంచి కారు కీస్ తీసి, ఓ బటన్ని ప్రెస్ చేసేడు. ఎదురుగా వున్న పడవంత కారుకున్న పచ్చలైట్లు వెలిగి ఆరిపోయాయి.



అరుణ్ కుమార్ డ్రయవరు సీటులో కూర్చుని, ఎడం ప్రక్కనున్న డోర్‌ను తెరిచి, సాగర్‌ను కూర్చోమని సైగ చేసేడు. సాగర్ సీటులో ఇబ్బందిగా కూర్చున్నాడు. తనకింద ఎవరో నలిగిపోతున్నట్లుగా అనిపించింది.

పది నిముషాల్లో కారు ఓ పెద్ద బంగళా ముందు ఆగింది. గన్‌మేన్ సాల్యూట్ చేసి, గేటు తెరిచేడు. సాగర్‌కి ఎంతో అసౌకర్యంగా ఉంది. 'గ్రేట్ డిక్టేటర్' సిన్మాలో చార్లీ చాప్లిన్ పొరపాటున శత్రుశిబిరంలో కలిసిపోయి, ఉక్కిరి బిక్కిరైనట్లుగా ఉంది కదా తన పరిస్థితి అనుకున్నాడు. అనవసరంగా మొహమాటపడ్డానే అని బాధపడ్డాడు.

అరుణ్ కుమార్ ఓ పెద్ద హాలులో సాగర్‌ని కూర్చోబెట్టి, లోనికి వెళ్ళి భార్యతోనూ, కొడుకుతోనూ వచ్చాడు. పరిచయాలయ్యాకా, అరుణ్ కుమార్ భార్య కాఫీ తీసుకొని వస్తానని లోనికి వెళ్ళింది.

అరుణ్ కుమార్ కొడుకు ఆదిత్య ఎదురుగా ఉన్న సోఫాలో ఇబ్బందిగా కూర్చున్నాడు.

అరుణ్ కుమార్ కొడుకు వంక చూసి "సాగరంకుల్ డిగ్రీ డిస్టింక్షన్‌లో పాసయ్యాడు. నేనేమో అత్తెసరు మార్కులతో పాసయ్యాను. ప్రస్తుతం సాగరంకుల్ ఓ ప్రయివేటు స్కూల్లో టీచరుగా చేస్తూ, ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్నాడు. నేనెలా వున్నానన్నది నువ్వు చూస్తూనే వున్నావు. కాబట్టి... నీకెలాంటి జీవితం కావాలో నిర్ణయించుకో! చదువులో కష్టపడ్డవాడు పైకి రాలేడు. జీవితంలో కష్టపడితే, నాలా పైకి వస్తారు" అన్నాడు.

అరుణ్ కుమార్ తనని బలవంతంగా ఇంటికి ఎందుకు తీసుకుని వచ్చేడో సాగర్‌కి ఇప్పుడర్థమైంది.

ఆదిత్య చిరాగ్గా మొహం పెట్టి "డాడీ... మనిద్దరి ఆర్గ్యుమెంట్లూ ఎప్పటికీ తేలవు కానీ... మీరు 'కష్టపడ్డం" అన్న మాటను మిస్–యూజ్ చేస్తున్నారేమోనని నా డౌట్!" అన్నాడు.

"ఆదిత్యా... ప్రాక్టికల్‌గా మా ఇద్దరి జీవితాలూ స్పష్టంగా కనిపిస్తున్నా– సక్సెస్ సీక్రెట్ నీకర్థం కావడం లేదా?" అన్నాడు అరుణ్ కుమార్ విసుగ్గా.

ఆదిత్య మొహం ఎర్రబడింది. ".. అర్థం కానిది మీకూ! సక్సెస్ అంటే డబ్బు సంపాదించడమేనా? మాఫియా గ్యాంగ్ కూడా సంపాదిస్తున్నారు. 'కష్టపడి' డబ్బు సంపాదించడమనేది పెద్ద అబద్ధం. కష్టపడుతున్నవాళ్ళు తిండికి మొహం వాయడం, సోమరిపోతులు కోటీశ్వరులు కావడం చూస్తూనే ఉన్నాం కదా! మొన్నటికి మొన్న... తనకి 6,500 ఎకరాల భూమి వుందని సత్యం రామలింగరాజే స్వయంగా ఒప్పుకున్నాడు. అన్–అఫీషియల్‌గా అతనికి 17,400 ఎకరాల భూమి వుందని పేపర్లలో వచ్చింది. ఇప్పుడు బయటపడ్డ కుంభకోణం చూస్తే, అతనెంతగా 'కష్ట' పడ్డాడో అర్థమవడం లేదా? ... మీరేమంటారంకుల్?" అంటూ సాగర్ వంక చూసేడు.

"సాగర్ చిన్నగా నవ్వి "ఏమంటానూ... నువ్వో ప్రహ్లాదుడివంటాను!" అన్నాడు.

అరుణ్ కుమార్ మొహం చిట్లించి "ఏంట్రా ... నేనో హిరణ్యకశిపుడినంటావా?" అన్నాడు.

సాగర్ గట్టిగా నవ్వేసి "ఏదో తమాషాకి అన్నాలే!" అన్నాడు.

డోర్ బెల్ మోగడంతో అరుణ్ కుమార్ "యస్.. కమిన్" అన్నాడు.

గన్‌మేన్ సాల్యూట్ చేసి "సార్ ... మన పని మనిషి వీరమ్మ ఏడ్చుకుంటూ వచ్చింది సార్. దొంగతనం చేసేడని చెప్పి వాళ్ళాయన్ని పోలీసులు ఎత్తికెళ్ళేరంట సార్. సాయం చేయమని అయ్యగార్ని అడుగుతానని వచ్చింది సార్. పంపమంటారా, సార్" అన్నాడు.

అరుణ్ కుమార్ మొఖమంతా చిరాకుగా పెట్టి "వాడు మొదటినుండీ దొంగ వెధవే! ఇలాంటి దొంగముండా కొడుకులందర్నీ వెనకేసుకొస్తే..."

ఆదిత్య తండ్రి మాటకు అడ్డుతగిలి "అప్పుడు మీరొక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారు" అన్నాడు.

"ఆదిత్యా ... నువ్వు వయసును మించి మాట్లాడుతున్నావ్. లిమిట్లో వుండటం నేర్చుకో!" అన్నాడు అరుణ్ కుమార్.

ఆదిత్య తండ్రి వంక వింతగా చూసి "డాడీ ... నువ్వు దొంగతనాలు చెయ్యవన్నా, వీరమ్మ మొగుడు దొంగతనాలు చేస్తాడన్నా... నాకెందుకో నమ్మకం కలగదు" అన్నాడు.

అరుణ్ కుమార్ ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్క లేకుండా పోయింది. సాగర్ ఆ పిల్లాడ్ని కళ్ళతోనే అభినందించాడు.

అరుణ్ కుమార్ బ్యాగులో నుండి కియోసాకి బుక్ తీసి "డబ్బు సంపాదించడానికి ఎన్ని తెలివితేటలుండాలో తెలియాలంటే... ఇవి చదువు" అంటూ ఆదిత్యకి అందించేడు.

ఆదిత్య ఆ బుక్ బ్యాక్ కవర్‌పైనున్న వివరాలను చదివేసి, ప్రక్కన పెట్టేసాడు.

సాగర్ పెదవులపై చిరునవ్వు మెరిసింది. 'ఈ యువకుడికి ఇప్పుడివ్వాల్సిన పుస్తకం– దాస్ కాపిటల్. అంతే కానీ – రిచ్ డాడ్, పూర్ డాడ్ కాదు. అయినా నా పిచ్చి కానీ రిచ్ డాడ్‌కి పూర్ సన్ ఎలా పుడతాడూ? యుక్తవయస్సులో రక్తంలో పొంగే ఆవేశం వలన ఈ మాత్రం నిజాలను నిబ్బరంగా మాట్లాడగలుగుతున్నాడు కానీ– ఒక్కసారి డబ్బు రుచి మరిగితే ఎలా మారతాడో? బుద్ధుడు పుట్టిన వెంటనే జ్యోతిష్కులు– ఇతను భోగి అయినా అవుతాడు, లేదా యోగి అయినా అవుతాడని అన్నారట!– ఆదిత్య భవిష్యత్తులో ఏమైనా అవడానికి అవకాశాలున్నాయి.... నేనిప్పుడు ఆలోచించాల్సింది వీళ్ళిద్దరి గురించి కాదు... గేటు బయట ఆశగా ఎదురుచూస్తున్న వీరమ్మలాంటి వాళ్ళగురించి ..' అని సాగర్ మనసులోనే అనుకుంటూ, తండ్రీ కొడుకులిద్దరికీ బై చెప్పి, బయటకి నడిచేడు.

అతని శరీరం నుండి మనిషి వాసన గుబాళిస్తోంది.

●



Text.pmd 16 2/28/2009, 6:15 PM

గల్పిక

# మాయాబజార్



పుప్పాల కృష్ణమూర్తి

**“వీ**రు మా వారు. ఆఫీసు వదలగానే, ఈసురోమని ఇంటికొస్తారు. ఫైల్సు ముందేసుకుని లెక్కల్లో కూరుకుపోతుంటారు. ఆఫీసు పని లేనినాడు, ఫ్రెండ్స్‌తో పేకాడుకుంటూ గడిపేస్తుంటారు. ఒక అచ్చటా ఉండదు. ముచ్చటా ఉండదు. ఓ షాపింగనడు. సినిమాకు తీసుకెళ్ళడు. యింకాస్త టైం దొరికితే టి.వి.లో దూరి, తల బైటపెట్టడు. ఇంట్లో సరుకులు, బట్టలు, పిల్లల అవసరాలు, ఆయనగారి అవసరాలు, మా అత్తగారి మందులు అన్నీ నేనే చూసుకోవాలి”

“వీడు మా పెద్దోడు. ఇంజనీరింగ్ రెండో ఏడు చదువుతుండు. వీడికి క్రికెట్ పిచ్చి. కాలేజీ నుంచి రాగానే ఫ్రెండ్స్‌నేసుకుని గ్రౌండ్‌కెళతాడు. రెండు కప్పులు కూడా తెచ్చాడనుకో. నాకు ఇంటి పనుల్లో కాని, బైటపనుల్లో కాని, కాస్తన్నా సాయం చేయడు. పోనీ, స్పోకెన్ ఇంగ్లీషుకన్నా వెళ్ళి, లాంగ్వేజి ఇంప్రూవ్ చేసుకోరా అంటే, చేసుకోడు. పక్కింటి పార్వతి కొడుకు లండన్ వెళ్ళి, లక్షలు లక్షలు సంపాదించి పడేస్తుండు. కోటి రూపాయలు పెట్టి బిల్డింగ్ కొన్నారు. నువ్వూ వెళ్ళరాదురా అంటే వినడు.”

“ఇది మా చిన్నది. ఇంటర్ చదూతోంది. దీనికి షోకులెక్కువ. వారానికోసారన్నా బ్యూటీ పార్లర్‌కెళ్తుంది. ఫ్రెండ్స్‌తో హస్కెక్కువ. ఎంసెట్‌కు ఇప్పట్నించే ప్రిపేర్ కావే అంటే నా మాట వినదు. దాన్నేవన్నా అంటే వాళ్ళ డాడీ ఊర్కోడు.”

“ఇంక ఈవిడ మా అత్తగారు. ఉన్న ఆస్తంతా ఇద్దరు బిడ్డలకు, వాళ్ళాయన వైద్యానికి తగలేసి, వట్టి చేతులతో మా ఇంట్లో చేరింది. వేళకు అన్నీ అమర్చాలి. కనీసం నెలకోసారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి. తిండికీ, సీరియల్స్‌కు మాత్రం చక్కటి టైం పాటిస్తది. ఇంత చేసినా, చేశామన్న ఊరా–పేరా....?. బిడ్డ రాగానే బోరుమని ఏడ్చేస్తుంది. నేనేదో హింస పెడుతున్నట్లు. ఆమె రమ్మనడమే ఆలస్యం. చకచకా బట్టలు సర్దుకుని చెప్పా పెట్టకుండా చెక్కేస్తుంది. ఎంతైనా బిడ్డమీద ప్రేమే వేరు.”

“ఇది మొన్ననే కొన్న ఫ్రిజ్. మెక్సికన్ రెడ్. అంతా ఇదే వాడుతున్నారని షాపువాడు కూడా చెప్పాడు. పక్కింటి లక్ష్మి గారికి కూడా ఇదే బాగా నచ్చింది. ఐదొందలు తక్కువకే ఇచ్చాడు. పైగా ఇన్‌స్టాల్‌మెంట్ సౌకర్యం కూడా ఉంది. ఎంత చక్కగా పనిచేస్తుందో? వెన్నకొనే  పనుండడం లేదు....”

“ఇదేమో నెలరోజుల కింద కొన్న ఎల్.జి.టి.వి. పిక్చర్ క్లారిటీ, సౌండ్ అదీ ఎంత బాగుందో.. మా .టి.వి. చూశాకే పక్కింటి పంతులు గారు అచ్చం ఇలాంటిదే తెచ్చాడు. 200 చానల్స్ వస్తున్నాయి.. మా తమ్ముడి క్లాసుమేటే షాపతను. సగం డబ్బులే కట్టి తెచ్చాను. మిగతావి తోచినప్పుడు ఇస్తుంటాను. నాలుగు నెలల్లో తీర్చేయొచ్చు పెద్ద కష్టమేం కాదనుకో”

“ఇది రెండేళ్ళ కింద కొన్న వాషింగ్ మెషిన్. వీడియోకాన్ కంపెనీ. ఎంత బాగా......” చెప్పుకుపోతోంది సగటు ఇల్లాలు తన ఇంటికొచ్చిన మరో ఇల్లాలితో. ●



Text.pmd 17 2/28/2009, 6:15 PM

# స్వయం హననం

వి.ఆర్. తూములూరి



పాతేసుకుంటున్నా
నన్ను నేనే
నిట్ట నిలువుగా
నిలువు లోతులో
స్వయం హననంలో
చల్లారని సంక్షోభంలో

నా స్వర్గంలో హహకారాలేమిటి?
నా దుర్గం బీటలు వారడమేమిటి?
నా తరంగం, ఉత్తుంగ తురంగం
సకలలోక మానవ మానస వీణా
సంరంభం హఠాత్తుగా మూగబోవడమేమిటి?
తంత్రులు తెగి విలవిల్లాడట మేమిటి?

ఎన్నికలలు కన్నాను నేను
ఎన్నెన్ని ఆశలు నిలుపుకున్నాను నేను
అబేద్య దుర్గంలో
అరిషడ్వర్గంలో
ఆకాశపు టంచుల్లో
అవకాశాల లోగిట్లో
రెక్కలు విప్పి విహరించాలని
ఎంతగా తపించాను నేను

కనుల ముందే కలలు కల్లలవ్వడమేమి?
ప్రశాంత జీవన సంద్రం కల్లో మవ్వడ మేమి?
ఓఘమై, అమోఘమై
ప్రళయకాల మేఘమై గర్జించే దాష్టీకం
దిగులు బుగులులో చిక్కడమేమి?
దారి తెలియక దిక్కులు చూడడమేమి?

నన్ను నమ్మిన వాళ్ళు
నాతో నడిచిన వాళ్ళు
నా కలల దారులంట
తమ బతుకును పరచిన వాళ్లు
ఎంత మురిసి పోయారని
ఆనందపు జరిలో
మరెంత తడిసిపోయారని
నడిసంద్రపు నావ తీరం చేరలేదెందుకని?
ఉవ్వెత్తున ఎగసిన కెరటం
కుప్పకూలిందెందుకని?
అమృతమై, సంజీవనియై
సకల అవ్యవస్థలకు పరిష్కారంగా
భాసించిన ప్రపంచీకరణ
నివురు గప్పిన నిప్పులా మారిందెందుకని?
ఆనందాన్ని ఆవిరిగా మార్చిందెందుకని?

ఒరవడైన నా దేశం
వెల్లువెత్తిన నా ప్రజ
కాంతులీనిన వర్తమానంలో
మెరసి ఎగసిన ఆశల పల్లకిలో
ఊహల ఉయ్యాలలూగుతున్న వేళ
భవిత్యపు రాగాలు పల్లవిస్తున్న చోట

కూలిన స్వర్గం
కదలిన దుర్గం
ఊడిన ఉద్యోగం
చేజారిన భవితవ్యం

కోటి కాంతుల కంటి దీపాలు
మినుకు మినుకు మంటున్న వేళ
ఉరకలెత్తిన ప్రగతి రథం
ఊసురుమంటూ ఊరుకున్న వేళ
పాతేసుకుంటున్నా
నన్ను నేనే
నిట్ట నిలువుగా
నిలువు లోతులో
స్వయం హననంలో
చల్లారని సంక్షోభంలో

# రెక్కలు

బొల్లిముంత వెంకటరమణారావు

కలలు
కంట్లో నలుసులు
ఎర్రబడి
తడిచిన కన్నీరు

రాత్రి
మిగిల్చిన అబద్ధం!

కాలం వొరిపిడికి
జీవచ్ఛవమై
జీవించడం
అసంతృప్తి

ఎదురు చూపుల
ఎడారి శూన్యం



ఆస్తికి
అంతస్తుకు
పట్టిన చెదపురుగులు
బంధువులు

వదలని
దరిద్రం!

భూమి
దుప్పటి కింద
మేలకువలేని
నిద్ర

మొలకెత్తిన విత్తు
శవం!



Text.pmd 18 2/28/2009, 6:15 PM

**పరిశీలన**

# నానీలు-సమకాలీన జీవన చిత్రణ

**■ యస్.ఆర్. పృథ్వీ**

> **కవితా నిర్మాణం విషయానికి వస్తే, మాత్రాచ్ఛందస్సుగాని, గణ నియమాలుగాని లేని, స్వేచ్ఛారూపం కేవలం 20 ఉండి 25 అక్షరాల నియమంతో, నాలుగు పాదాలుగా నడకసాగాలి. అంతే. డా॥ సంగనభట్ల నరసయ్య గారు, 'నానీలు – రూపనిర్మాణ శిల్పం' అనే వ్యాసంలో ఇలా అంటారు. '25 అక్షరాల గరిష్ట స్థాయివల్ల కవికి, తన భావన విస్తృతంగా ప్రతిఫలించడానికి అక్కరకు వస్తుంది.**

తెలుగు సాహిత్యం, వచన కవిత్వంతో సామాజికపరం కావడం. ప్రభావితమవ్వడం అతిశయోక్తి కాదు. అది తన స్థానాన్ని పదిలపర్చుకొంటూనే, విభిన్న ప్రక్రియలుగా కవుల చేతులలో రూపు దిద్దుకొని, తన పరిధిని విస్తృతపర్చుకోవడ మనేది గమనించాల్సిన విషయం. అలా, ఒక కొత్త ప్రక్రియగా రూపు దిద్దుకున్న వాటిలో 'మినీ కవిత'కి విశేషమైన స్థానం లభించింది. ఆ తర్వాత అంతటి ప్రాచుర్యాన్ని పొందిన ప్రక్రియ 'నానీ' గత పది సంవత్సరాలుగా ఈ ప్రక్రియలో వందల సంఖ్యలో కవులు తమకలాన్ని నానీల బాటలో నడిపించడటమనేది విశేషం. అతి తక్కువ కాలంలో ఇంతటి గొప్ప స్థానాన్ని ఆక్రమించుకున్న నానీల నేపథ్యం గురించి ఒక్కమాట చెప్పుకోవాలి.

నానీలు, డా॥ ఎన్. గోపిగారి కలంనుండి మొట్ట మొదట సృష్టించబడిన విషయం లోక విదితమే. 1997లో వీటిపుట్టుక యాదృచ్ఛికమని ఆ సమయంలో ఆయన సంవేదనాత్మక భావోద్విగ్న స్థితిలో వున్నానని ఆయనే ప్రకటించుకున్నారు. ఈ ప్రక్రియ ఇంతటి ప్రాచుర్యం పొందడానికి గల కారణం– నానీ కవిగా నేను అనుకునేది "వేమన పద్యాల్లో భావోద్వేగమైన ఆకర్షణశక్తిని కలిగి వుండటం ఒకటి. మినీ కవితా రూపంతో మెరుపు లక్షణాన్ని కలిగి వుండటం మరొకటి."

కవితా నిర్మాణం విషయానికి వస్తే, మాత్రాచ్ఛందస్సుగాని, గణ నియమాలుగాని లేని, స్వేచ్ఛారూపం కేవలం 20 నుండి 25 అక్షరాల నియమంతో, నాలుగు పాదాలుగా నడకసాగాలి. అంతే. డా॥ సంగనభట్ల నరసయ్య గారు, 'నానీలు – రూపనిర్మాణ శిల్పం' అనే వ్యాసంలో ఇలా అంటారు. '25 అక్షరాల గరిష్ట స్థాయివల్ల కవికి, తన భావన విస్తృతంగా ప్రతిఫలించడానికి అక్కరకు వస్తుంది. భావ వ్యక్తీకరణలో క్లుప్తత అక్షర సంఖ్యకు: వాక్యశైలీ విన్యాసం పాదవిభజనక సంబంధించిన విభాగాలుగా, నానీల్లో గుర్తించాలి. చెప్పాలనుకున్న భావాన్ని గరిష్ట స్థాయిలో సంక్షిప్తీకరించడమన్నదే నానీ నియమంగా కవిని నడుపుతుంది". ప్రాస ప్రభావం నానీకి కొంత బలాన్ని, పాఠకుడికి ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నది వాస్తవం.

అసలు విషయానికివస్తే సమాజం భ్రష్టుపట్టిపోయింది. స్వార్థం మనిషిని తన గుప్పిట్లోకి తీసుకొని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దగా చేసి, ఎప్పుడు ఎలా అవసరమవుతుందో, ఆ విధంగా మలుస్తోంది. రూపంలో అందం కొట్టొచ్చినట్టు కనిపిస్తాది. వేమన చెప్పిన మేడి పండు మాదిరి. ఇదంతా పచ్చినిజం. ఇక సమకాలీనత అనేది మనిషికి, సమాజానికి సంబంధించిన అంశం. దీని పరిధి అత్యంత విస్తృతమైంది. సమాజంలో ఏ కోణాన్నైనా కవి స్పృశించవచ్చు. వాస్తవాల్ని తెరమీదికి లాక్కు రావచ్చు. తన కవిత్వంద్వారా కుళ్ళును నిరసించవచ్చు. అవాస్తవాల నుదుట చురకలూ పెట్టవచ్చు. నేటి సమాజంలో మనిషి బ్రతుకు, సంస్కృతి విలువలు ఎలా ఛిద్రమౌతున్నాయో అనేక మంది కవులు నానీల ద్వారా ప్రతిబింబింపచేసారు.

"సచివాలయం/వెయ్యి కాళ్ళ జెర్రి/
కాళ్ళన్నీ కదులుతాయి/నడకసాగదు"

ఇది, నానీల సృష్టికర్త డా॥ఎన్. గోపిగారి కవిత. ఈ నానీ ఒక వాస్తవ సన్నివేశానికి రూపం. నాల్గవ పాదంలో అధిక్షేపణగుణం కనిపిస్తాది. నడకసాగాలి అంటే డబ్బో, దర్పమో అవసరం సుమీ అన్న విషయాన్ని స్ఫురింపజేస్తోంది.

"భద్రం కోసం/బ్యాంకు ఎకౌంట్లు/
బోర్డు తిప్పాక/బోరుమంటున్నారు"

ఇది, కీ॥ శే॥ తుమ్మిడి నాగభూషణం గారి కవిత. ఎన్ని ప్రైవేటు బ్యాంకులు బోర్డుల తిప్పాయో, సగటు మనుషుల జీవితాల్ని, ఎంతటి విషాదం పెను తుఫానై తాకిందో మనకి తెలియని విషయం కాదు. సగటు జీవితాల్లో నిలిచిపోయిన కన్నీటి మడుగుల్ని చూసిన కవి పడిన ఆవేదన ఈ నానీలో కనిపిస్తాది.

"మూడు ముళ్ళు/ఏడడుగులు/
సంఖ్యా ప్రధానం కాదు/సమన్వయం ముఖ్యం."

ఇది. కె.జె. రమేష్ గారి నాని. సమన్వయ లోపం వల్ల వివాహబంధం తడి ఆరకుండానే, ఎవరికి వారై కోర్టు ముంగిళ్ళల్లో ఈగల్లా ఎగురుతున్న సంఖ్య రాను రాను పెరుగుతోంది. అవగాహన పెరగడం వల్ల, చిన్ని చిన్ని విషయాలు కూడా చట్ట పరిధిలోకి తెచ్చి ఆలోచన చేయడం జీవితంలోని యవ్వనదశ కూలిపోవడం వంటి పరిణామాలకి దారితీస్తోంది. కవి 4వ పాదంలో చెప్పిన సమన్వయమే పరిష్కార సూత్రం. ముఖ్యం అనే అక్షరాలలో ఆదేశం వుంది.

"జరీ అంచుల్లో/ఆకలి మంటలు/
మగ్గం గోతులు/సిద్ధంగా వున్న సమాధులు"

ఇది పృథ్వీ కవిత. నేతగాళ్ళ బ్రతుకు చిత్రానికి నిలువుటద్దం ఈ నానీ. నేతగాళ్ళ నైపుణ్యం గురించి చెబుతూనే, ఇల్లు గడవక ఆత్మహత్యలు చేసుకుంటున్న నేపథ్యం ఇందులో కనిపిస్తాది. ఈ రోజు, ప్రతిరాజకీయ పార్టీ కొత్తగా వెలిసిన వాటితో సహా, నేతగాళ్ళ భుజాల మీద చేయి వేసి హామీల వర్షం కురిపిస్తున్నారంటే, వాళ్ళ ఓట్ల అవసరం ఎంత వుందో గమనించాలి.



Text.pmd 19 2/28/2009, 6:15 PM

"సమాజపు మేడిపండు/చిదిమి చూడు/
పొట్ట నిండా/కులం పురుగులు"

ఇది, కొత్తపల్లి ఉదయబాబు కవిత. రాజకీయం వృత్తిగా మారాక, కులం మనిషిని ప్రభావితంచేస్తోంది. మనిషి గుర్తింపు కోసం ఏర్పడిన కులం, రాజకీయంతో సంగమించాక మనిషిని శాసిస్తోంది. బ్రతుకుని నిర్ణయిస్తోంది. తరచి చూస్తే, కులం అండతో అనేక మంది సమాజపు విలువల్ని కాలరాస్తున్న దాఖలాలు కనిపిస్తాయి. అందుకే, కవి కులాన్ని పురుగుతో పోల్చాడు. మనిషిని విడిచి, కులాన్ని పోషించే కాలాన్ని చూస్తామా అన్న భ్రమ కలుగుతోంది.

"పొలంలో పంట రాసులు/రైతన్నలవే/
కాసులు మాత్రం/దళార్లవి"

ఇది సంబారి గారి కవిత. ప్రస్తుత రాజ్యం దళార్లది. పండించే వాడికి గిట్టుబాటు ధర పలకదు. కొనేవాడికి ధర అందుబాటులో వుండదు. ఈ తేడాకి నిలువుటద్దమే దళారి. పొలంలో వున్న పంటంతా రైతుదే అంటున్నాడు కవి. కాని, లాభపడేది మూడవ వాడు "దళారి" ఇది నిత్య సత్యమైన విషయం. పాఠకుల మనసుని పట్టే విధంగా ఈ కవితని చెప్పాడు కవి.

"శ్రామిక వర్గం/పాతాళంలోకి/
పెట్టుబడి వర్గం/ వినువీధుల్లోకి"

ఇది పృథ్వి కవిత. అనాదిగా సమాజంలో చూస్తున్న ధనిక, పేద వర్గాల్లాంటిదే పెట్టుబడిదారి వర్గం,శ్రామిక వర్గం అనేవి. చెమటోడ్చి ఎంతచేసినా, పరిమితికి మించని ఆదాయంతో, ఎక్కడవున్నావు అంటే, అక్కడే వున్నాను. అనే వర్గం శ్రామికులది. శ్రామికులు చేసే ఉత్పత్తితో దినదినాభివృద్ధి చెందుతున్న వర్గం పెట్టుబడి దారుడిది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వం కూడా ప్రైవేటు కంపెనీలకే పట్టం కడుతున్న విషయం మనకి తెలిసిందే.

"ఏమిటా
కుర్రాడిబాధ
సన్ని పాత జ్వరమా?
పేరు ప్రేమ"

ఇది. జి. సత్యనారాయణ (జి.స.నా.రా) గారి కవిత. యువతని పట్టి పీడిస్తున్న మాయదారి రోగం ఇది. పూర్వ కాలంలో 'సన్నిపాత జ్వరం' అని వుండేది. ఇప్పుడు రకరకాల పేర్లు వచ్చాయి. ఆ జ్వరం వస్తే. ఒక పట్టాన తగ్గదనే వారు. చదువుకోండిరా అని కాలేజీలకి పంపిస్తుంటే, అసలు చదువుకి వడ్డీలా ఈ ప్రేమని తగిలించుకొంటున్నారు. స్వేచ్ఛ, సినిమాల ప్రభావం ఈ పరిణామాలకి ముఖ్యమైన కారణాలు, ప్రేమల పేరుతో జరుగుతున్న అనేక అవాంఛనీయ సంఘటనల పరిణామమే ఈ కవితకి మూలకారణాలు.

"మా ఊరంతా
నా కుటుంబమే
పట్నంలోనే
పక్కవాడు పరాయి"

ఇది శ్రీమతి నాంపల్లి సుజాత గారి కవిత. పల్లెకి, పట్నానికీ వున్న వ్యత్యాసాన్ని చాలా సున్నితంగా చెప్పారామె ఈ నానీలో. ఒకప్పుడు పల్లె కాదు. పట్నంలో కూడా ఇరుగు, పొరుగు కలిసి మెలిసి ఉండే వారు. కాలం అలాగునే వుంది. మనిషి కాలాన్ని మించి పరుగు పెట్టే స్థితే. ఈ పరిస్థితికి మూలం. ఎవరి స్వార్థం వాళ్ళదిగా రోజులు గడుస్తున్నాయి. పక్కవాడిని గురించి ఆలోచించేందుకు మనసు సుముఖత వ్యక్తంచేయడం లేదు.

"నాటి రాజకీయం
పాడియావు
నేటి రాజకీయం
ఊసర వెల్లి"

ఇది కొత్తపల్లి మణి త్రినాధ రాజుగారి కవిత. రోజు రోజుకి కుళ్ళిపోతున్న రాజకీయ వ్యవస్థను పాఠకుల ముందు నిలపాలనే తపనే ఈ కవిత. పాడి ఆవు, గడ్డి తిని పాలిచ్చే జంతువు. ఊసరవెల్లి అవసరాన్ని బట్టి రంగు మార్చే జంతువు. వద్దనుకున్నా రోజూ కనిపించే రాజకీయ పరిణామాన్ని ఈ కవిత స్ఫురింపజేస్తోంది.

"తుమ్మాలన్నా
దగ్గాలన్న
శ్వేత సౌధ
అనుమతి పత్రం అవశ్యం"

ఇది వల్లభాపురం జనార్దనగారి కవిత. ప్రపంచీకరణ పేరుతో, అనేక దేశాలతో పాటు, మన దేశం కూడా అమెరికా కబంధ హస్తాలలో చిక్కుకు పోయింది. వాడి అనుమతి లేనిదే ఇక్కడి ప్రభుత్వం ఏమి చేయలేని స్థితి. ఒకప్పుడు బ్రిటిష్ వాళ్ళకి ప్రత్యక్ష బానిసలం. ఇప్పుడు చేస్తున్నది పరోక్ష బానిసత్వం.

"ఉగ్రవాదం కళ్ళల్లో
నగర చిత్రాలు
ప్రజల కళ్ళల్లో
భయం భూతాలు"

ఇది చల్లగాలి బాబూరావు కవిత. ఇది ముంబైలో జరిగిన మారణహోమాన్ని గుర్తు చేస్తోంది. ఉగ్రవాదులు, వాళ్ళకే తెలియని ఒక మత్తుకి గుర్రై, నగరాల్ని టార్గెట్ చేస్తూ, అమాయక ప్రజల జీవితాన్ని మాంసపు ముద్దలుగా చేసి, నెత్తురుతో తడిసిన నేలను చూసి ఆనందిస్తున్నారు. ప్రజలు భయంతో వెర్రి చూపులు చూస్తోంటే, రాజకీయ పార్టీలు లబ్ధికోసం ఆరాటపడటం అనేది ప్రస్తుతం మనం చూస్తున్న చిత్రం. మానవత ప్రకాశించాలనుకోవటం ప్రజల దౌర్భాగ్యం కాబోలు. ముంబై ప్రేలుళ్ళు చిత్రాన్ని ఈ నానీలు కవి చూపించాడు.

ఇలా, సమకాలీన జీవితాలకి సంబంధించి అనేక మంది కవులు, వందలాది నానీలను సృష్టించారు. కవికి తప్పనిసరిగా సమాజం మీద దృష్టి వుంటుంది. పరికిస్తూ వుంటాడు. వైవిధ్యాలను గమనిస్తూ వుంటాడు. వాస్తవాల్ని వెలికి తీసే ప్రయత్నంలో తన కలాన్ని కత్తిగా మారుస్తాడు. సమాజంలో మంచి నిలవాలని ఆశిస్తాడు. దానికోసం తపిస్తాడు. అలాంటి తపనలోంచి వచ్చిన కవితలే ఈ నానీలు.

●

# భారతీయ నవల చారిత్రక మూలాలు

■ డా॥ టి.జి. కృష్ణారావు

**వేదాలు వచన వాఙ్మయంతో కూడినవనేగాక లిఖిత వాఙ్మయరూపమైనవని కూడా తెలుస్తోంది. తెలుగు సంస్కృతం కన్న అర్వాచీనమేగాక, ఆ భాషలో వచన వాఙ్మయం కూడా ఇలీవలి కాలందే. సారస్వతంగా భావించలేకపోయినా మన శాసనాలలో కొన్ని వచన రూపంలోనే వున్నాయనేది గమనార్హం. అయితే తెలుగులో వచనం ఎంత ప్రాచీనమైనదేనా వచన కావ్యాలు అవతరించడం చాల కాలం వరకు జరగలేదు.**

**అ**భివ్యక్తి భాషకి ప్రధాన ప్రయోజనం. ఏభాషలోనైనా వాగ్రూపం తొలుత వచన రూపంలోనే ప్రచలితమౌతుంది. కాని భాషకి సాహిత్య గౌరవాన్నిచ్చి వారసత్వ సంపదగా అందించేసరికి అది పద్య రూపాన్నే ధరించి గోచరమౌతున్నది. ప్రసిద్ధ ఆంగ్ల సాహిత్య చరిత్ర కారుడైన జార్జి సెయింట్స్ బరీ ఈ విషయాన్నిలా వివరించాడు.

"In all languages poetry as literature comes before prose, the immortal jest of moliene owing its pipquancy to exactly this that propse is more obviously natural to man in coversation, he never, till after considerable experience seems to understand that it is fit to be made a medium of recorded though on formal writing. But it would appear that it was in anglo saxon pretty early. Professor Earle speaks of "obscure but well -evdenced remains of the fifth and sixth centuries, "but as so enthusiastic and authority does not himself dwell much on theses…."(Ashort History of Englishliterature, P 19)

ఏంగ్లో శాక్జన్ భాషలో 5,6 శతాబ్ధాల్లోనే గ్రంథస్థమైన వచనం కనబడుతున్నదని చెప్పినా, భారతదేశంలో అంతకన్న ప్రాచీన కాలంలోనే వచనం నిబద్ధమైందని దాశరథి రంగాచార్య భావించారు.

"వేద చతుష్టయి కాక మరొక విభజనను 'వేదత్రయి', అని కూడా అంటారు. ఇది పద్య, గద్య గేయ విభజన వేదాలు పద్యాల్లో దర్శించినవీ, గేయంలో దర్శించినవీ ఉన్నాయి. అలాంటి విభజనను 'వేదత్రయి' అంటారు"

అయితే వేద వచనానికి శ్రుతి శుభగత్వం వుంది. వేదవాఙ్మయమంతా లిఖిత వాఙ్మయంగా గాక 'శ్రుతం'గానే అధ్యయన, అధ్యాపనాలు పొందినదనే వాదాన్ని కూడా రంగాచార్య పరాస్తం చేస్తున్నారు. వేదానికి 'శృతి' అనే పేరు కూడా వుంది. శృతి అంటే విన్నది అని అర్థం. విన్నది కాబట్టి వేదం తొలుత అక్షరబద్ధం కాలేదనీ అప్పటికి అక్షరం లేదని పాశ్చాత్యుల అభిప్రాయం, వాదం, నినాదం.

"వేదం అపౌరుషేయం, ఋషి ద్రష్ట, స్మర్త అగును. ఋషి, తాను తొలుత విన్నాడు. విన్నది వ్రాసినాడు. అందువలన అది "శృతి" అయింది. అంతేగాని లిపి లేక కాదు… లిపిలేనిది వాటిని వ్రాయనిది అనంతములైన వేదాలను భద్రపరచడం అసాధ్యం!"

రంగాచార్యగారి మాటలవల్ల వేదాలు వచన వాఙ్మయంతో కూడినవనేగాక లిఖిత వాఙ్మయరూపమైనవని కూడా తెలుస్తోంది. తెలుగు సంస్కృతం కన్న అర్వాచీనమేగాక, ఆ భాషలో వచన వాఙ్మయం కూడా ఇటీవలి కాలందే. సారస్వతంగా భావించలేకపోయినా మన శాసనాలలో కొన్ని వచన రూపంలోనే వున్నాయనేది గమనార్హం. అయితే తెలుగులో వచనం ఎంత ప్రాచీనమైనదేనా వచన కావ్యాలు అవతరించడం చాలా కాలం వరకు జరగలేదు. సంస్కృతంలో వచన కావ్యాలు ప్రాచీనకాలం నుండి వున్నప్పటికీ వాటిని 'నవల'లుగా భావించడానికి వీల్లేదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు సంస్కృత గద్యాన్ని గురించిన అలంకారిక విషయాలన్నిటినీ వివరించి చివరికి "కావున పాశ్చాత్యుల నావెలున కించుమించుగా సరియైనది కథయనియే చెప్పవలసి యుండును. ఇక్కా రణమునఁగాదంబర్యాదులు నవలలేయని తలంపఁగూడదు" అని అంటూనే" వానిని బోలుటకు ప్రయత్నించునవి లేక వానికి సమీపములైనవియని చెప్పికొనవచ్చును" అని రాశారు.

ఆంగ్ల భాషలో నవల అవతరించడానికి ముందు గద్యవాఙ్మయం అనేక పరిణామదశల్ని దాటిందని మనం గమనించక తప్పదు. ఛాసర్ (1340- 1391) ను ఆంగ్ల గద్య వాఙ్మయంలో ఒక దశకు ప్రతినిధిగా చెప్పొచ్చు. అతన్ని గూర్చి ఆంగ్ల సాహిత్య చరిత్రకారుడైన సైయింట్స్ బరీ ఇలా రాశారు.

'Chaucer the poet, wyclif the controversialist. Trevisa the chronicler… All were translaters in less or greater degree, but all also were originals of English prose writing'

వచన వాఙ్మయరచనలో ప్రత్యేకతను సాధించిన వారిలో ఛాసర్‌ను పేర్కొనడమేగాక 'బోయిథియస్' అనే రచనలో అతని శైలిని గూర్చి ఇలా వివరించారు.

"But the most valuable point of the Beothius as an exercise for the pioneer in a new prose in the fact of the "matters",…. Accordingly some of the metre passsges in Chaucer's version, though quite legitimate and sound prose, a rhythematical as well as verbal dignity, which English prose was hardly to know again…"

ఆంగ్ల సాహిత్యంలో ఛాసర్ సాధించిన ఈ లయబద్ధమైన వచనం మన వృత్త గ్రంధితో సరిపోల్చవచ్చు. వేంకటేశ్వర వచనాల వంటి సాహిత్యం దీనితో సరిపోలుతుంది. అటు సంస్కృత భాషకి గాని, ఇటు ఆంధ్రభాషకు గానీ ఇటువంటి వచనంలో గ్రంథాలు రాయడం కొత్తకాదు. వచన పరిణామానికి సంబంధించిన ఈ పర్యాలోచనమంతా 'నవలా' ప్రక్రియ ఉపక్రమం గురించి తెలుసుకోవడానికి ఆవశ్యక మౌతోంది. దీనికి కారణం నవలను ప్రధానంగా వచన రచనా ప్రక్రియగా ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా పేర్కొంటోంది.

"Novel, a written prose fiction. The term in English is very loosely used and is being constantly modified to include new experiments in fictional writing. The word first came into common use in English in the 18th century, gradually superseding the term 'romance', however, included work not in Prose, whereas the word novel has never been applied (except of a very few specific" novels in verse") to any but prose writting, though the style and texture of the prose has varied from the plain and "factual" to the complex and "poetic". If there is good ground for emphasizing a written prose as the accepted medium of the novelist, the fictional nature of the novel raises more complex problems, for, particularly in the early novel, the dividing line between fact and fiction is not always clear"

దీనివల్ల ఏ కల్పితవచన రచనైనా 'నవల అనవచ్చుననీ, కొత్త రచనల్ని ఈ ప్రక్రియలో ఇముడ్చుకోడానికి వీలుగా 'నవల' అనే మాటకి విస్తృతార్థాన్ని కల్గిస్తున్నారనీ తెలుస్తోంది. కాల్పనిక కావ్యం అంటే వచనం కానిదనీ, నవలంటే వచనం మాత్రమేననీ చెప్తూనే సకృత్తుగా పద్య నవలలున్నాయని అంటున్నారు. ఈ నిర్వచనాలు మన 'కాదంబరిని' 'నవల' అనడానికి ఆమోద యోగ్యాలుగానే వున్నాయి. నవలాశైలి విషయంలో కూడా వాస్తవిక ధోరణి నుండి కవితాత్మక శైలి వరకూ ఉన్న వెసులుబాటు వల్ల బాణుడి కాదంబరిపై శైలి కారణంగా నవల కాదనడానికి వీలుకాదు. నవలకు వస్తుపరంగా వాస్తవికత ప్రధానలక్షణమని భావిస్తారు కొందరు. కాని 'కాదంబరి' తన కథా కాలంనాటి విషయాలనే వాస్తవికంగా ప్రతిబింబిస్తుందన్నది గమనార్హం. మరాఠీ భాషలో నవలను 'కాదంబరి' అంటున్నారంటే 'కాదంబరి'కి నవల లక్షణాలు ఎంతగా పట్టాయో స్పష్టమౌతుంది.

ఆంగ్ల నవల పుట్టడానికి ప్రాచీన గ్రీకు రోమన్ కథల నుండి స్పానిష్ పికారెస్క్ కథలు, వరకూ పునాదులగా ఏర్పడ్డాయని భావిస్తున్నారు. అలాగే సంస్కృత సాహిత్యంలోని అనంతమూ, అపూర్వమూ, వైవిధ్యభరితమూ అయిన కథాసాహిత్యం సంస్కృత నవలకు పునాదిగా భావించవచ్చు. తెలుగు నవల పుట్టుటకు ముందు వచ్చిన ఛార్‌దర్విష్ కథలు, తాతాచార్యుల కథలు మొదలైనవి తెలుగు నవలకు భూమికగా ఏర్పడ్డాయి. తెలుగు వచన రచనలో గణనీయమైన పరిణతికి ఒక ప్రక్క కాశీయాత్ర చరిత్ర, దక్కను కవుల చరిత్ర మొదలైనగ్రంథాలు, వేరొక ప్రక్క, క్రైస్తవ తత్తులూ కారణభూతమయ్యాయి. తత్ఫలితంగా ఒక ప్రత్యేక ప్రక్రియగా 'నవల' అనేది తెలుగులో ఆవిర్భవించింది. ఆంగ్ల భాషలో నవల పుట్టుకను విశ్లేషించిన వారు, నవల అవతరించిన విధానాన్ని అంచెలంచెలుగా అంచనా వేయడం కష్టంగా భావించి ఆ ప్రయత్నమే మానుకున్నారని సాహిత్య చరిత్ర కారుడైన John saintsbury అన్నాడు.

"It is so difficult to markout the precise stages by which the modern novel came into being, that the wisest critics abstained from attempting it"

తన 'టిప్పుసుల్తాన్' అనే నవలానువాదానికి పీఠిక రాస్తూ అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు ఇంగ్లీషు నవలల పుట్టుకను గురించి ఇలా రాశారు.

"ఈ నవలారచన ప్రథమమునం దిటలీ దేశంలో జనించి Bocaccio అను కవి యొక్క లేఖినిచే వర్ధిల్లెను. 16వ శతాబ్దమును నింగ్లాండులో Bocaccio, Bandello, Cinthio మొదలగు నిటాలియను కవుల నవలల నాంగ్లీకరింపఁ బ్రారంభించిరి".

1313-75 మధ్య కాలంలో ఇటాలియన్ గద్య రచనకు జనకుడుగా పేరొందిన బొకాక్షియో దీర్ఘమైన నవలారచనకు పూనుకున్నాడు. అతడు రాసిన 'ఫిలోకోలో' స్వీయ చరిత్రాత్మకమైన నవల. 'ఆమెటో' అనే మరో నవల గద్య పద్యాత్మకమైంది. 'ఫియామెట్టా' అనే వేరొక నవల భగ్న ప్రేమికుడి మనస్తత్వ విశ్లేషణతో సాగుతుంది.

పరిశీలించగా తెలుగు నవల సంగతి ఎలా వున్నా ఇంగ్లీషు భాషలో నవల పుట్టుక ఇటాలియన్ నవలల అనువాదంతోనే ప్రారంభమైందని తెలుస్తోంది. అంతేకాక నవలా ప్రక్రియ పూర్తి గద్య ప్రక్రియగాకాక తొలిరోజుల్లో గద్యపద్యాత్మకంగా చంపూకావ్యంలాగా కూడా సాగిన రచనగా భావించవచ్చు. కాకపోతే చంపూ కావ్యంలో పద్యరచన ఎక్కువగానూ వచనం తక్కువగానూ వుంటే నవలలో ఆ లక్షణం వ్యత్యస్థమయిందనుకోవచ్చు. పద్యం మీద మోజు, వచనం రాయాలనే తపనా పరస్పరం పోటీ పడ్డ ఈ పరిస్థితిని అక్కిరాజువారు గుర్తించారు.

"ఇంగ్లాడులో నా కలమున నవలా రూపమైన గద్యరచనకుఁ, బద్యరచనకు నొక విధమైన పోరాటము సంభవించినదని చెప్పవచ్చును. మొదటఁ పండిత బృందముచే నవలలు గౌరవింపబడలేదు. 1579వ సం॥న లిల్లీ (lilly) యనునతడు యూఫ్లూని (eqphues) అను నవలను ప్రకటించినప్పుడు పండితమ్మన్యులందరూ దానిని జూచి తలలూచిరి"

అయితే ఈ నవల జానపద జీవనమూ, వీరుల సాహసగాథలూ నేపథ్యంగా జన్మించిన నవల మాత్రమే. దీని మొదటి భాగం 1579లోనూ, రెండో భాగం 1580లోనూ వచ్చాయి. ఈ పుస్తకాన్ని గురించి జార్జి సెయింట్స్ బరీ ఇలా రాశారు.



Text.pmd 22 2/28/2009, 6:15 PM

"The influence of the book has been sometimes a little exaggerated, and some times more than a little pooh-poohed, while from a period tolerably early in the seventeenth century to the middle of the eighteenth century it was forgotten, and from the middle of the eighteenth to the middle of the nineteenth misrepresented"

ఈ గ్రంథం పాఠక విమర్శలో ఆటుపోట్లకు గురైనా గాని, కనీసం ఒక ఇరవై ఏళ్ళ పాటయినా తన ప్రభావాన్ని నిలుపుకుందని చెప్పక తప్పదు. ఈ నవల ఒక రెండు జంటల మధ్యనున్న ప్రేమకు సంబంధించిన ప్రేమ లేఖల సమాహారమేగాని అంతకన్నా మించిన కథా సంవిధానమంటూ లేదు.

**శామ్యూల్ రిచర్డ్‌సన్ తొలి రచన 'పమేలా' 1740లో వెలువడింది. ఈ నవల లేఖలతో సాగుతుంది. నవలానాయిక పమేలా నిమ్న వర్గానికి చెందిన స్త్రీ. తన యజమానిని వివాహం చేసుకొని అతన్ని మంచి మార్గంలో పెడుతుంది.**

వీటిపై తిరుగు బాటుగా రాజరికాన్ని వ్యతిరేకిస్తూ జానపద శృంగార సాహసగాథల్ని వ్యంగ్యంగా హేళన చేస్తూ సర్‌వాంటెజ్ రచించిన 'డాన్ క్విక్‌సెట్' 1605-15 సంవత్సరాల మధ్య కాలంలో వెలువడింది. ఈ స్పానిష్ నవల కూడా ఇంగ్లీషు నవలా రచనపై ప్రభావం చూపింది. ఈ నవలను పికారెస్క్ (picaresque) నవలలనే ప్రత్యేక శాఖగా పేరుపొందాయి. అంటే మోసగాళ్లకూ దేశదిమ్మర్లకీ సంబంధించిన నవలలని చెప్పవచ్చు. ఇంగ్లీషులో థామస్ నషే (Thomas nashe) రాసిన 'ది అన్‌ఫార్చునేట్ ట్రావలర్' (1594), ఈ కోవకి చెందినదే నిమ్నవర్గాల జీవితాలకి సంబంధించిన ఇతి వృత్తాలు స్వీకరించి, రాజరిక వ్యవస్థని దూరం చేసిన రచయితల్లో మరొకరు డే ఫో డెఫో, నషేలకు మధ్య కాలంలో జాన్ బనియన్ రచించిన పిలిగ్రిమ్స్ ప్రోగెస్ (1628)లు వెలువడింది. అన్యాపదేశ రచన (allygory) కు బన్‌యన్ ఆద్యుడని చెప్పవచ్చు. దీన్ని మతపరమైన నవలగా కూడా సంభావించవచ్చు. ఈ విషయాన్ని గురించి జార్జ్‌సెంట్స్ బరీ ఇలా అన్నారు.

"A religious novel is still a novel, and though allegory is an old form of fiction, and the novel proper a comparatively new one, we must not rule out allegories as such from the latter class"

మతపరంగా దీనికి వుండే ప్రాచుర్యం వల్ల ఇంగ్లీషు భాషా ప్రభావంతో ఈ గ్రంథం వివిధ భాషల్లో అనువాదంగానో, అనుసరణం గానో భారతీయ సాహిత్యంలో చోటు చేసుకుంది.

డేనియల్ డెఫో రచించిన పికారెస్క్ నవల రాబిన్ సక్రూసో (1719)నే ఇంగ్లీషులో మొదటి నవలగా కొందరు భావిస్తారు. వృత్తి రీత్యా డెఫో వర్తకుడు. డే పో గురించి దాశరథి రంగాచార్య ఇలా రాశారు.

"ఇంగ్లీషులో తొలి నవల ఆవిష్కరణకు కారకుడైన డెఫో పండితుడూ కాదు, ప్రవృత్తి రీత్యా రచయితా కాదని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. అతను వ్యాపారి. వర్తకం చేసేవాడు.కళ అంటే ఏమిటో అతనికి తెలియదు. అయితే ఆనాటి సామాజిక దుస్థితులకు స్పందించి "రాబిన్‌సన్ క్రూసో" అనే నవల రాశాడు. అది ప్రపంచ ప్రఖ్యాతం అయింది. ఆనాటి సమాజాన్ని చూచి రాసిన రాబిన్‌సన్ క్రూసో ఆదిమకాలపు జీవితాన్ని వర్ణిస్తాడు. ఇదీ అందులోని ఇతివృత్తం. నవలాకారుడు పండిత ప్రకాండుడు కానక్కరలేదు. సామాజిక స్థితిగతులను చూసి స్పందించగల హృదయం గలవాడు కావాలి"

రంగాచార్యగారి దృక్పథంతో పరిశీలిస్తే, ఆంగ్ల నవల సామాజిక పరిస్థితులలోని మార్పులకనుగుణంగా ఉత్పన్నమైన నూతన ప్రక్రియగా మనకు స్పష్టమౌతుంది.

అన్యాపదేశంగా మత విషయాలను చెప్పడం పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్‌లో బన్‌యన్ ధ్యేయంగాకా, అన్యాపదేశంగా సామాజిక విమర్శ చేయడం జానథన్ స్విఫ్ట్‌కు అలవాటు. అతడు రాసిన ది గెలివర్స్ ట్రావల్స్ (1729) వ్యంగ్యవైభవంతో సాగిన సామాజిక విమర్శ. రాజకీయ పార్టీలైన విగ్గలకు టోరీలకు మధ్య సాగుతున్న సమరంలో, మానవ ప్రవృత్తుల్ని వ్యంగ్యంగా విమర్శిస్తూ జనాల వ్యంగ్య చిత్రాల్ని కళ్ళెదుట రూపు కట్టించడం స్విఫ్ట్ నవల ప్రత్యేకత.

నవలకు పునాదులు బన్‌యన్, డెపో మొదలైన వారి రచనల్లో గోచరిస్తున్నా 18వ శతాబ్దిలోని తొలి రెండు దశాబ్దుల్లో దానికి పూర్తి రూపు రేఖలు ఏర్పడలేదు. అటుతర్వాత నవలలు పుంఖానుపుంఖాలుగా వెలువడినట్లు తెలుస్తోంది.

శామ్యూల్ రిచర్డ్‌సన్ తొలి రచన 'పమేలా' 1740లో వెలువడింది. ఈ నవల లేఖలతో సాగుతుంది. నవలానాయిక పమేలా నిమ్న వర్గానికి చెందిన స్త్రీ. తన యజమానిని వివాహం చేసుకొని అతన్ని మంచి మార్గంలో పెడుతుంది. రిచర్డ్‌సన్ రెండవ నవల క్లారిస్సా అతని రచనల్లో గొప్పదిగా భావిస్తారు. క్లారిస్సా భగ్న ప్రేమతో మరణిస్తుంది. ఆమె మరణానికి ఆమె బంధువు ప్రతీకారం తీర్చుకుంటాడు. ఈ నవలలు నైతికతకి ప్రాధాన్యం ఇస్తూ మధ్య తరగతి జనాల వైయక్తిక జీవనాన్ని ప్రతిఫలిస్తాయి.

మరో నవలా రచయిత హెన్రీ ఫీల్డింగ్ 1742లో తన తొలినవల 'ది హిస్టరీ ఆఫ్ ది ఎడ్‌వెంచర్స్ ఆఫ్ జోసెఫ్ యాండ్రూస్ ఎండ్ హిస్ ఫ్రండ్ మిస్టర్ అబ్రహమ్' అనే దాన్ని రాసాడు. ఈ నవల రిచర్డ్‌సన్ 'పమేలా'కు 'బర్‌లెస్కు' రూపంగా కనబడుతుంది. దీని తరువాత 'మిసెల్లనీస్' అనే పేరుతో మూడు భాగాల నవల రాశాడు. ఇవికాక అనేక 18వ శతాబ్ది నవలలు అలభ్యాలుగా వున్నాయంటూ జార్జి సెయింట్స్ బరీ ఇలా రాశారు.

"The minor novels of the eighteenth century are not generally accessivel save in the original editions. There is indeed one useful and rather full collection 'Harrisons Novelists' but as a whole it is very bulky and duplicates

much that every one has on his shelves in other forms. Richardson has been some times fielding smollett, sterne and miss burney have been often reprinted"

ఆంగ్ల భాషలోనే కాదు ఏ భాషలోనైనా తొలిదశలోని నవలలు అందుబాటులో లేకపోవడం అనుభవంలో వున్న విషయమే. రాజరిక వ్యవస్థ బలహీనమై మధ్యతరగతి బలపడిన కొలదీ తదనుగుణంగా మార్పు చెందిన వస్తువుతో నవలారూపం ఏర్పడింది. రాజరికాన్ని ఎదిరించి సామాజికంగా ప్రాముఖ్యత సంతరించుకున్న మోసగాళ్ళూ దేశదిమ్మరుల కథలు నవలలుగా రూపుదిద్దుకోవడం డాన్‌క్విక్‌సెట్, రాబిన్‌సన్ క్రూసో నవలల్లో కనబడుతుంది. నిమ్నజనుల జీవితం పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్‌లో ద్యోతకమౌతుంది. ఇంగ్లాండులో జనజీవనంలో కల్గిన పెనుమార్పులే ఆంగ్ల నవలా ప్రక్రియకు జనన కారణాలయ్యాయి. తదనుగుణంగా వచనంలో కూడా మార్పు చోటు చేసుకుంది. దాశరథి రంగాచార్య అదే విషయాన్ని ఇలా వివరించారు.

"పారిశ్రామిక విప్లవానికి పూర్వపు సాహిత్యం కొందరి కోసం రాయబడింది. రాజులకూ రాణివాసాలకీ కవిత్వానికీ నాటకాలకూ మాత్రం పరిమితం అయింది. సామాన్య మానవునికి అందులో స్థావరంలేదు. మానవులంతా సమానులేనన్న ఆలోచన విధానంతో, అచ్చుయంత్రం కనుగొనబడటంతో సాహిత్యం సామాన్యులందరికీ చేరింది. చదివేవాడు సామాన్యుడు. ఆలోచించేవాడు సామాన్యుడు. రాసేవాడు సామాన్యుడు కాబట్టి సామాన్యుని గురించి రాయాలనే తపన కొనసాగింది. ఈ తపనలోంచి ఆవిర్భవించిందే 'నవల'.

రాజరిక వ్యవస్థ పద్యకావ్యరచనకూ, నాటకాలకూ దోహదం చేసింది. రచయితలు రాజసభల్ని రంజింప చేస్తూ రాజాశ్రయంతో కవులుగా చలామణిఅయ్యారు. ముద్రణ సౌకర్యంతో గద్యానికి ప్రచారం పెరగడంతో బాటు, గద్యంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పత్రికారచనవల్ల వ్యంగ్యశైలి ఒకటి సామాజిక విమర్శకోసం అవతరించింది. నవలలు వైవిధ్యభరితమైన ఆకర్షణీయమైన శైలిని ప్రోది చేసాయి. లోతుగా పరిశీలిస్తే ఆంగ్ల నవల ఆవిర్భవించడానికి రెండు ప్రధాన కారణాలు గోచరిస్తాయి. ఒకటి సామాజిక పరిణామం రెండోది ప్రత్యేకవచనశైలి ఆవిర్భావం. ఈ విధంగా ఆంగ్ల నవల కాలక్రమంలో ప్రత్యేక ప్రక్రియగా ఆవిర్భవించింది. 'పురాణం పంచలక్షణం' అన్నట్లుగా ఆంగ్ల నవల ఆవిర్భవించి పరిపుష్టమైన తరువాత దానికి అరు లక్షణాలను గుర్తించారు. ఇతివృత్తం, పాత్రచిత్రణ, సంభాషణలు, దేశకాలాలు, శైలి, రచయిత ఉద్దేశించిన జీవనతత్త్వం అనేవి ఆ ఆరు లక్షణాలని హడ్సన్ తన 'ఇంట్రోడక్షన్ టు ది స్టడీ ఆఫ్ లిటరేచర్' అనే గ్రంథంలో రాశారు. [15] తొలి నవలల్లో ఈ ఆరు లక్షణాలూ పరిపూర్ణంగా కానరావు. దానికి కారణం నవలా ప్రక్రియ స్థిరపడ్డ తర్వాతనే ఈ లక్షణాలను విశ్లేషించారు కదా.

భారతదేశానికి సంబంధించి సంస్కృతభాషలో రాజరిక వ్యవస్థ వున్న కాలంలో కావ్యనాటకాలతో బాటు ఆనాటి వ్యవస్థను ప్రతిబింబించే గద్యకావ్యాలు కూడా వున్నాయి. వాటిని సమకాలీన నవలలుగా భావించడం తప్పుకాదు. ఆ విధంగా బాణుని కాదంబరిని 'నవల'గా భావించవచ్చు. దండి రచించిన దశకుమార చరిత్ర కూడా నవలా లక్షణాలు గలదే. దీన్ని గూర్చి మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారిలా రాశారు.

"రాజ వాహనాది దశకుమారుల చిత్రచరిత్రలు కలదియగుటచే దీనికీ పేరు వచ్చినది. కథలు పదిమంది వైనను, అన్నిటికి నైక్యము చక్కగానున్నది... శైలిమృదుమధురము. కొన్నిచోట్ల దీర్ఘ సమాసములున్నను, చిన్న చిన్న వాక్యములే యెక్కువగానున్నవి. కుమారోత్పత్తి, ద్విజోపకృతి, సోమదత్త చరితము, పుష్పోద్భవ చరిత్ర, అవన్తి సుందరీ పరిణయము అనునైదు విషయాలు కలది పూర్వపీఠిక, రాజవాహనాదు లెనమండుగురు కుమారులతోడి యెనిమిదు చ్ఛ్వాసములు ప్రధాన గ్రంథము. రాజ్యప్రాప్తి యుత్తరపీఠిక, అనువిధమున నిది ముత్తెఱఁగుల నున్నది...."

పరిశీలించగా నవలకు కావలసిన వ్యస్త్యైక్యత, సమకాలీనత అనే రెండు లక్షణాలేకాక శైలి కూడా సమకూరిన రచనగా దీన్ని గుర్తించవచ్చు. కాదంబరినిగూర్చి కూడా శాస్త్రిగారిలా రాశారు.

"కాదంబరీ కవిత్వము కఠినమేకాని, కష్టపడి చదివిన వారికి సకల శబ్దార్థ విజ్ఞానముతో రసజ్ఞత కూడా సిద్ధించును. చదివిన కొలదిని, కథయే పాఠకుని ముందుకు ద్రోయుచుండును. ఇందవాంతర కథలెన్నేని కలవుగాని, ప్రధాన కథ కాదంబరీ చంద్రాపీడులకు సంబంధించినది. ఇందలి ప్రధానరసము శృంగారము. తక్కిన రసములు కొన్ని యంగములుగా వర్ణింపఁబడినవి. ఈ కావ్యములోని కల్పనా చమత్కృతియు వర్ణనాచమత్కారము ననన్యాదృశములు. చంద్రాపీడునికి శుకనాసుఁడుగావించిన యుపదేశ మెన్నిసారులు చదివినను విసుగు పుట్టదు. అచ్ఛోద సరోవర్ణనము వంటి వర్ణనము మరలఁ గనంఁబడదు. ఇట్టి మహాకృతి సమాప్తముగా కుండఁగానే బాణుడు దివంగతుఁడు కాఁగా, ఇతని కుమారుడు భూషణబట్టు తండ్రిమార్గం మనుసరించి దీనిని బూరించెను...."

బాణుడు తన కాదంబరిలో భట్టారహరిశ్చంద్రుడొక వచనకావ్యాన్ని రచించినట్లు ప్రస్తావించాడు. కాని అది ఈనాడు అలబ్ధం. ఇవిగాక సుబంధుని వాసవదత్త అనేగ్రంథం వచన కావ్యంగా కనబడుతోంది. బాణుడు 'కవీనా మగళద్దర్పోనూనం వాసవదత్తయా' అని ప్రశంసించినట్లు తెలుస్తోంది. బాణుడు ప్రశంసించింది. సుబలుని వాసవదత్తేనా? అనే సందేహమూ, ఈ ప్రశంస బాణుడిదేనా అనే

**రాజరిక వ్యవస్థ పద్యకావ్యరచనకూ, నాటకాలకూ దోహదం చేసింది. రచయితలు రాజసభల్ని రంజింప చేస్తూ రాజాశ్రయంతో కవులుగా చలామణిఅయ్యారు. ముద్రణ సౌకర్యంతో గద్యానికి ప్రచారం పెరగడంతో బాటు, గద్యంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పత్రికారచనవల్ల వ్యంగ్యశైలి ఒకటి సామాజిక విమర్శకోసం అవతరించింది. నవలలు వైవిధ్యభరితమైన ఆకర్షణీయమైన శైలిని ప్రోది చేసాయి.**



Text.pmd 24 2/28/2009, 6:15 PM

సందేహం పండితుల్లో వున్నాయి. ఈ విషయాలు మనకి అప్రస్తుతాలు, సుబలుని వానవదత్త శృంగార ప్రధానమైందని తెల్పుతూ దాన్ని మల్లాది వారిలా ప్రశంసించారు.

"పూర్వోక్త గద్యప్రబంధముల వలె నిదియు దేశీయులను విదేశీయులను గూడ నాకర్షించినది. దీనికి జగద్ధరుఁడు తత్త్వ దీపినియు, మేధావికుల జాతుఁడగు త్రివిక్రముఁడొక వ్యాఖ్యయు మఱిమొకఁడు కవి సింనూసుధాంశు బిందువును, సర్వ చంద్రుడు టిప్పణమును కాశీరామవాచస్పతి యొకటీకము, నిర్మించిరి. ఆకాలమున వెలసిన పై మూఁడాఖ్యాయికలును పఠనపాఠన వ్యవహారమును వ్యాప్తికెక్కి శ్రావ్యమైన కథలు చేతను జక్కని కల్పన చేతను రసము చేతను గూడ విద్వల్లోక మాకర్షించిన వనుట సత్యము"

ఇది క్లిష్టంగా వుండి నవలలకుండాల్సిన సుగమ లక్షణం కొరవడకుండా వుంటే దీన్నీ నవలే అనొచ్చు.

ధనపాలుడనే జైనకవి రచించిన తిలకమంజరి అనే గద్యకావ్యాన్ని గూర్చి మల్లాదివారిలా తెలిపారు.

"ధనపాలుఁడను జైన కవీంద్రుడు నిర్మించిన తిలకమంజరి చాలావరకుఁ గాదంబరిని బోలిన ప్రౌఢగద్యకావ్యము. ఇందయోధ్యాపుర రాజైన మేఘవాహనునికి మదిరావతియను ధర్మపత్నియందుదయించిన హరివాహనుడు తిలక మంజరియను విద్యాధర కన్యను మోహించుట వారి పరిణయము మొదలగు విషయములు, శృంగార భరితములై వర్ణింపబడినవి...."

శోధలుడనే మరో జైనకవి ఉదయసుందరిక కథ అనే గద్యకావ్యాన్ని రాశాడు. తొలి ఆంగ్ల నవలలనేకం సులభంగా అందుబాటులో లేనట్లే కొన్ని సంస్కృత వచన కావ్యాలు కూడా అలబ్ధాలని తెలుస్తోంది. వరరుచి రచించిన చారుమతి, సోమిలుని శూద్రకకథ శ్రీపాలిత్తుని తరంగవతి మొదలైనవి భోజుని శృంగారప్రకాశంలో ప్రస్తావించబడినా ఈనాడు అలబ్ధాలని తెలుస్తోంది. అలాగే ధనపాలకవి తన తిలకమంజరిలో రుద్రుడనే కవి రచించిన త్రైలోక్యసుందరి కథ అనే గద్యకావ్యాన్ని ప్రస్తావించినా అది కూడా అలభ్యమే.

ప్రాచీన కాలపు ఈ గద్య కావ్యాన్ని నవలలుగా భావించడానికి, అవి ఆధునిక కాలపు మధ్య తరగతి ప్రభావంతో వచ్చినవి కాకపోవడమే ప్రధానమైన అభ్యంతరం. వాటిలో సమకాలీన సమాజం ప్రతిబింబించినా, ఆనాటికి ఆధునిక మధ్య తరగతి ఆవిర్భవించలేదు. ఆంగ్ల ప్రభావంతో ఆధునికకాలంలో కొన్ని ఆధునిక సంస్కృత నవలలు వెలువడ్డాయని ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ఇండియా లిటరేచర్ సూచిస్తోంది.

"During the last and present centuries, sanskrit gadya has been employed to wirte novels of the modern type. This new experiment has been crowned with great success and as a result we have the following works. Mrittikavrishabha katha of Narasimhacharya punekar, Viyoginibala, pallichchavi and makarandika of Upendranath sen, Sarala Haridas siddhanta Vagisha Madanalatika of Chintamani Gole, Kanakalata of Kalyanarama Shastri, Sushila of R. Krishnamachariar, among many others."

ఈ నవలల గురించిగాని, కవుల గురించి గాని, ఎన్‌సైక్లోపీడియాలో అదనంగా ఏ వివరాలూ లేవు.

భారతీయ భాషలన్నిటిలోనూ వచనం చాలా ప్రాచీన కాలం నుండీ వున్నట్లు తెలుస్తోంది. అస్సామీలో శంకరదేవుని అంకియనాట్లలో తొలిసారి సంస్కృత మైథిలీ భాషమిశ్రమమైన బ్రజభాషలో వచనం ప్రారంభమైనట్టు తెలుస్తోంది. అహోమ్‌వంశీయుల కాలంలో బురంజీలతో దేశీయమైన వచనం ప్రారంభమై 'ఒరునొదై' పత్రిక వల్ల కొత్త మెఱుగులు దిద్దుకుంది. బెంగాలీలో 16,18 శతాబ్దాల మధ్య వచనం ఉపయోగంలోకి వచ్చింది. అయినప్పటికీ 19వ శతాబ్ది ఉత్తర్థాంలోనే టేక్‌చంద్‌వల్ల బెంగాలీ వచనానికి జీవం వచ్చింది. ఆధునికత వికసించింది. గుజరాతీ వచనం 15వ శతాబ్ది నుండి ప్రారంభమయ్యింది. అయినా ఆధునిక వచనం 19వ శతాబ్దిలో ఆంగ్ల ప్రభావంతో నర్మద్, దలపత్‌రాయ్ మొదలైన వారి వల్ల ప్రారంభమయ్యింది. హిందీలో 10వ శతాబ్ది నుండీ వచన రచనలున్నప్పటికీ అవన్నీ ప్రాంతీయ మాండలిక భేదాలతో ఏర్పడ్డాయేగాని, ఒక సమహారమైన రూపాన్ని పొందలేదు. ఆంగ్లబాష ప్రభావంతోనే ఆధునిక వచనం ఏర్పడింది. వ్యావహారిక రూపమైన 'ఖడీబోలీ' అక్బరు కాలంలోనే ఏర్పడినా దానిమీద ప్రాంతీయ భాషముద్ర వుండేది. కన్నడభాషలో 5వ శతాబ్దికే వచనం వుంది. 9వ శతాబ్దిలోనే ప్రభవించింది. మళయాళ భాషలో 10వ శతాబ్దినాటికే శాసనాల్లో వచనం వుంది. అయినప్పటికీ 19 వ శతాబ్దంలో బ్రిటీష్ ప్రభావంతో మళయాళ వచనానికి ఆధునికత వచ్చింది.

మరాఠీ భాషలో 11వ శతాబ్దినాటి శిలాశాసనాలలో వచనరచన తొలిసారి గోచరిస్తోంది. 16వ శతాబ్దిలో పర్షియు భాషా ప్రభావం గల వచనం మహమ్మదీయ పరిపాలనా ప్రభావంతో ఏర్పడింది. మహారాష్ట్రుల పాలన కాలంలో రెండు దశాబ్దాల పాటు 'బాఖర్' అనే పేరుతో వచన చరిత్రలు విస్తృతంగా విరచితమైనాయి. పాశ్చాత్య ప్రభావంతోనే ఆధునిక మరాఠీ వచనం ఏర్పడింది. ఒరియా భాష వచనం 1వ శతాబ్దినాటికి సంస్కృత శాసనాల మధ్య అక్కడక్కడా చోటు చేసుకొని 13,14 శతాబ్దాల నాటికి స్వతంత్ర స్థానం సంపాదించింది. దేవాలయ చరిత్రలు 'పంజి' అనే పేరుతో వచనరచనలుగా వ్యాప్తిచెందాయి. వీటి కాలాన్ని 10 నుండి 15వ శతాబ్ది వరకూ మతభేదంతో ఎవరికీ తోచినట్లు వారు పరిగణిస్తున్నారు. సాహిత్య గౌరవం గల వచనరచనలు 16వ శతాబ్ది నుండి కనబడుతున్నా, బ్రిటిషువారి జోక్యం వచ్చాక అచ్చు యంత్రమూ, పత్రికా ప్రచురణా ఒరియా వచనానికి క్రొత్త ప్రమాణాల్ని తీసుకొచ్చాయి. తమిళంలో 17వ శతాబ్ది వరకూ వచన సాహిత్య రచనలు లేవు. కాని అనియతమైన సూత్రబద్ధం కాని రచనగా



Text.pmd 25 2/28/2009, 6:15 PM

# రెక్కల ప్రస్థానం

యం.కె. సుగమ్‌బాబు



నువ్వు
దేనికి పరిమితమైతే
అదే
నీ ప్రతిఫలం

చంద్రవంక
నీకందదు!

అన్నీ పోతాయ్
అనుకుంటాం
కొత్తవి వస్తాయ్
అనుకోం

పాతమీదనే
బెంగ

కన్న తల్లుల
ఆనందాన్నీ
అభిజాత్యాన్నీ
వర్ణించలేం

వారి బిడ్డలు
బంగారు కొండలు

జీవితాన్ని
ఎవరూ శాసించలేరు
స్వీకరిస్తారు
తలొంచి

జీవితం
ఒక శాసనం!

కదిలే మేఘాలు
కురవవు
కురిసే మేఘం
కదలదు

నిరీక్షణే
జీవితం!

ఒకోసారి
అలా జరుగుతుంది
కారణాలు
అర్థం కావు

చీకటి
చీకటే!

నన్నోడించడం
తేలిక్కాదు
నువ్వే
ఓడిపోతావ్

నేను
ఖడ్గధారిని!

---

తొల్‌కాప్పియంలో పేర్కొనబడ్డ విభాగం వ్యాఖ్యానాది రచనల్ని సూచిస్తూ వచనరచనకు నిర్వచనంగా కనిపిస్తోంది. తమిళంలో శిలప్పదికారంలో వచనరచన తొలిసారిగా కన్పిస్తోంది కాని అది అనుప్రాసలతో లయబద్ధంగా సాగే వచనం, 8,9 శతాబ్దాల్లో నక్కిరార, వచనవ్యాఖ్యానాలు కనిపిస్తాయి. 15వ శతాబ్దిలో నాచిరార్కినియార్ రచించిన వచన వ్యాఖ్యానాలున్నాయి. ఇవేగాక వచన శాసనాలు కూడా వున్నాయి. అయినప్పటికీ యూరోపియన్ల ప్రభావంతోనే 17వ శతాబ్దినాటికి గాని ప్రత్యేక సాహిత్యశాఖగా ఆధునిక వచనం రూపుదిద్దుకోవడం ప్రారంభం కాలేదు. పాశ్చాత్య క్రైస్తవ మతబోధకులు దీనికి కారణమయ్యారు. సుబ్రహ్మణ్యభారతి, యు.వి.స్వామినాథయ్యర్ మొదలైనవారు స్వీయచరిత్రలు, జీవిత చరిత్రలు, వ్యాసాలు, యాత్రాచరిత్రలు మొదలైన వివిధ శాఖల్లో ఆధునిక వచన రచన అభివృద్ధి చేశారు. తెలుగులో ధనంజయుని రాతిశాసనంలో 6వ శతాబ్దికే వచనం వుంది. చాళుక్య భీముని కొరవిశాసనం కూడా వచనంలో వుంది. నన్నయ భారతంలో వచనం వుంది. తెలుగు ప్రజావ్యవహారాభాష, శాసనభాష. సాహిత్య భాష అనే మూడు స్థాయిల్లో వుండేదని భావిస్తున్నారు. క్రమంగా 14వ శతాబ్దిలో కృష్ణమాచార్యుల సింహగిరి వచనాలు, 16వ శతాబ్దిలో తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని వెంటేశ్వరవచనాలు, ఏకామ్రనాథుని ప్రతాపచరిత్ర, విరచితమైనాయి ఇవన్నీ అనుప్రాస యమకాదులతో కూడినవే. అదే శతాబ్దిలో సమాంతరంగా రాయవాచకంలాంటి స్థానిక చరిత్రలు వ్యావహారిక వచనంలోసాగాయి. 17,18 శతాబ్దుల్లో గ్రాంథిక వచనరచనలు కొనసాగాయి. క్రమంగా 19వ శతాబ్దిలో చిన్నయసూరి నుండి వీరేశలింగం వరకూ క్రమపరిణామంలో ఆధునిక వచన రచన పాశ్చాత్య ప్రభావంతో స్వీయచరిత్ర, వ్యాసం లాంటి నూత్న ప్రక్రియలతో కొత్తరూపు సంతరించుకుంది. ఉర్దూలో వచనసాహిత్యం 19వ శతాబ్దిలోనే జనించింది. గిల్‌క్రిస్ట్ ఫోర్టు సెయింట్ విలియం కాలేజీలో చదువుకునే వాళ్ల కోసం నీతికథల్ని లేఖకుల్ని పెట్టిరాయించాడు. ఉర్దూలో తొలి వచన రచయిత మీర్ అమ్మన్, 'బాగ్ బహార్' అనే అనువాద రచన చేసాడు. కాబట్టి దీని ఆవిర్భావం 19వ శతాబ్ది చివర్లోనే అన్ని భాషల్లోనూ వచ్చింది. నవలల్లో భాష ఆధునికం గావించబడడమేగాక కాలానుగుణంగా పరిణతమౌతూ వచ్చింది. అయినప్పటికి తొలి రోజుల్లోని సంస్కృత భాషాభూయిష్టమైన రచన నుండి వ్యావహారిక, మాండలిక శైలుల్లోకి క్రమపరిణామం చెందింది. నవలలో ఇతివృత్తం ఆధునికం కావాలనే నియమం చారిత్రక నవలలకీ, పౌరాణిక నవలలకీ వర్తించడం లేదు. తొలి నవలలన్నీ ఈ కోవకీ చెందినవే. భారతీయ భాషలన్నింటిలోనూ నవల అనేది 19వ శతాబ్దిలో ఆధునిక వచనం కారణంగా వచ్చిన స్వతంత్ర ప్రక్రియగాని ఆంగ్లం నుండి అనువాదంగా అనుసరణంగా వచ్చిన ప్రక్రియ కాదని పలువురి అభిప్రాయం. కాకుంటే నవలాప్రక్రియ మీరు రచనా విధానం, ఇతివృత్త స్వీకరణం, మనస్తత్వ చిత్రణం మొదలైన లక్షణాలు పాశ్చాత్యప్రభావంతో వచ్చిన మాటని కాదనలేము. సమకాలీన సమాజ చిత్రణ విషయానికొస్తే, చారిత్రక పౌరాణిక నవలల్లో వాటి స్వీయ నేపథ్యానికి సంబంధించిన సమాజ చిత్రణమే గోచరిస్తుంది. అది తప్పనిసరికూడా డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ వంటివారు తాను రాసిన నవలలలో 'అద్దం' ప్రసక్తి వచ్చినప్పుడు చారిత్రకంగా ఆకాలంలో అద్దాలు వున్నాయో లేవోనని వెనిక్కి తిరిగి పరిశీలన చేసుకున్నానని వివరిస్తున్నారు. కాగా సాంఘిక నవలలురాసి అందులో సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించడానికి ప్రయత్నించిన వారు కొందరే. కందుకూరి వారు తమకు రెండు తరాల ముందు వారి చరిత్రను స్వీకరించినట్లు చెప్పారు. అయినప్పటికీ అందులో ప్రతిబింబించినవి వారి సమకాలీన విషయాలేననేది స్పష్టంగా తెలుస్తూనే వుంటుంది. వాటిని డా॥ అక్కిరాజు వారు అడుగడుగునా గ్రంథంలో సూచించిపెట్టారు. 19వ శతాబ్ది నాటి ఆర్థిక సామాజిక స్థితిగతుల్ని విస్తృతంగా పరిశీలించడం మన ముందున్న కర్తవ్యం. ●



Text.pmd 26 2/28/2009, 6:15 PM

## విశ్లేషణ

# కొ.కు. సాహిత్య విమర్శ

■ డా.యు.ఎ. నరసింహమూర్తి



**సరైన విమర్శ రానిదే సరైన సాహిత్యం రాదు. అందుకే ప్రాచీన విమర్శ పక్షానికి మొగ్గే కొందరిలాగానే కొ.కు కూడా కళాకారుడి కంటే విమర్శకుడికి ఒక విధమైన ఆధిక్యాన్ని కట్టబెట్టారు. అందుకే రచయిత కంటే పై మెట్టున నిలబడడం అసలైన విమర్శకుడి ప్రథమ కర్తవ్యమనీ కొ.కు అనగలిగారు. కళాసృష్టిలో లోపం జరిగినప్పుడు గానీ, కళాస్వాదనలో అసమర్థత ఏర్పడినప్పుడు గానీ ఏర్పడిన గాడిని విమర్శకుడు పూడ్చగలడని కొ.కు ప్రకటించిన ఈ అభిప్రాయం అన్ని రకాల సాహిత్యాలకు, కళలకు వర్తించే సామాన్య లక్షణం కాదు.**

**తె**లుగులో మంచి సాహిత్య విమర్శ తక్కువని కొందరన్నారు. విమర్శించదగిన సాహిత్యమే లేదని కొ.కు. ఒక్కరే అన్నారు. కొ.కు విమర్శలో చిత్తశుద్ధి కనిపిస్తుంది. ఆయన నమ్మకాలు, ఆశయాలు మాత్రమే ఆయన విమర్శకు ప్రమాణాలు. పాతదైనా, కొత్తదైనా ఒక సిద్ధాంతం ముసుగులో విమర్శ చేయడం ఆయన ఎరుగడు. ప్రాచీన విమర్శ, ఆధునిక విమర్శ అని మన విమర్శను రెండు రకాలుగా విభజించి చూసినపుడు అందులో ఏదో ఒక పక్షానికి మొగ్గి రెండవ పక్షాన్ని ఉద్దేశించి పెదవి విరిచేసేవారు కూడా మనకు చాలామంది కనిపిస్తారు. కొ.కు మాత్రం అప్పుడూ ఇప్పుడూ కూడా మనకు ఉత్కృష్ట విమర్శ అంటూ లేదనే అంటారు. నిర్దిష్టమైన విమర్శ ప్రమాణాలు లేకపోవడమే ఇందుకు కారణమని ఆయనకు తోచింది. రచయిత ఎప్పుడూ విమర్శకుడి కంటే మొదటిస్థానంలోనే ఉంటాడు. ప్రాచీన సాహిత్య విమర్శ కొన్ని సందర్భాలలో రచయితను శాసించే స్థానాన్ని అందుకుందని భ్రమపడే తత్వం సాంప్రదాయికులలో పొడచూపింది. నేటి కాలంలో అటువంటి భ్రమకు ఆస్కారమే లేదని కొ.కు అంటారు. ఇటు రచయితకు గానీ, అటు విమర్శకుడికి గానీ ఉపదేశం లక్ష్యంగా ఉండకూడదు. రచయిత జీవన వాస్తవికతకు పునఃసృజన చేస్తాడు. విమర్శకుడు దానిని విశ్లేషించి పాఠకులకు అందిస్తాడు. "విమర్శ యొక్క ఆశయం రచనల మంచిచెడ్డలను సరిగా అంచనా కట్టటమూ, రచనలో నిగూఢంగా ఉండే అందచందాలనూ, లోపాలనూ వ్యక్తం చేయటమూ. ఎవరన్నా ఇంతకంటే ఏమనుకుంటారో నాకు తెలీదు. ఈ బాధ్యతలు నిర్వర్తించినవాడు సద్విమర్శకుడు" అని కొ.కు. వివరించారు. ప్రాచీనుల దృష్టిలో రచయిత, విమర్శకుడు ఇద్దరూ ఒక్కటే. విమర్శ సృజనలో అంతర్భాగం. రచయిత తన దృక్కోణం నుండే వస్తు విమర్శతో పాటు కళాపక్షాన్ని కూడా విమర్శిస్తూ సృజన వ్యాపారాన్ని నిర్వహిస్తాడు. ఆధునిక కాలంలో ఈ దృష్టి మారింది. ఒక రచనను రచయిత దృష్టితో విమర్శించడం కాక సామాజిక దృష్టితో విమర్శించడం మొదలయింది. కొ.కు. దృష్టిలో మంచి-చెడులను నిర్ణయించడమంటే సామాజిక వాస్తవికతా దృష్టితో నిర్ణయించడమే కాగలదు. అలాంటి నిబద్ధత గల విమర్శే సద్విమర్శ అని ఆయన అభిప్రాయం. కళాఖండాలను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకొన్న విమర్శకుడు ఆ విమర్శను చదివేవారి జ్ఞానం ఇనుమడించేలా చేయడానికి ప్రయత్నించాలని ఆయన అంటాడు.

సమాజానికీ, సాహిత్యానికీ ఉన్నట్లే విమర్శకు కూడా వర్గ లక్షణం ఉంటుంది. వర్గదృష్టితో చూచినప్పుడు కొ.కును అభ్యుదయవాద విమర్శకుడని స్పష్టంగా చెప్పాలి. వెనుక చూపు పెంచేది గానీ, కాసేపు మనల్ని మరపించేది గానీ సాహిత్యం కాదన్న మౌలికదృష్టితో ఆయన అభ్యుదయవాద విరుద్ధమైన సాహిత్యాన్ని వ్యతిరేకిస్తారు. సమకాలీన విమర్శకు కొత్త ప్రమాణాలు ఏర్పడాలన్నది ఆయన ఆశయం. సరి అయిన విమర్శతో వడగట్టని సాహిత్యం అరాచక శక్తిగా ప్రబలిపోతుందని గుఱ్ఱాన్ని గుఱ్ఱంగానూ, గాడిదను గాడిదగానూ వేరుపరచి చూపవలసిన సమయం ఆసన్నమైనపుడు ఆ పని సక్రమంగా చేయకపోతే గుఱ్ఱాలు, గాడిదలు ఒకటిగానే చలామణి అవుతాయని విమర్శ అవసరాన్ని గూర్చి, విమర్శకుడి బాధ్యతను గూర్చి కొ.కు హెచ్చరించారు. రచయితలలో దగుల్బాజీలున్నట్లే విమర్శకులలో కూడా దగుల్బాజీలుంటారని, వారిని కూడా విమర్శించవలసిన అవసరం ఉంటుందని కొ.కు గుర్తించారు. సరైన విమర్శ రానిదే సరైన సాహిత్యం రాదు. అందుకే ప్రాచీన విమర్శ పక్షానికి మొగ్గే కొందరిలాగానే కొ.కు కూడా కళాకారుడి కంటే విమర్శకుడికి ఒక విధమైన ఆధిక్యాన్ని కట్టబెట్టారు. అందుకే రచయిత కంటే పై మెట్టున నిలబడడం అసలైన విమర్శకుడి ప్రథమ కర్తవ్యమనీ కొ.కు అనగలిగారు. కళాసృష్టిలో లోపం జరిగినప్పుడు గానీ, కళాస్వాదనలో అసమర్థత ఏర్పడినప్పుడు గానీ ఏర్పడిన గాడిని విమర్శకుడు పూడ్చగలడని కొ.కు ప్రకటించిన ఈ అభిప్రాయం అన్ని రకాల సాహిత్యాలకు, కళలకు వర్తించే సామాన్య లక్షణం కాదు. లిఖిత సాహిత్యంలో కొంతవరకు విమర్శకుడు ప్రదర్శించే ఈ ఆధిక్యత వల్ల ఒక మేరకు ప్రయోజనం కలుగుతుంది. జానపద కళల విషయంలో ఇది వర్తించదు. అందుకే కొ.కు జనసామాన్యానికి



Text.pmd 27 2/28/2009, 6:15 PM

అతీతంగా ఉండే కళారహస్యాలను వెల్లడి చేసే విమర్శ ప్రాభవం ఒక జాతి సాంస్కృతిక ప్రాభవాన్ని నిరూపించేదిగా ఉంటుందని తనను తాను సవరించుకున్నారు. ఉన్నతస్థాయి కళారహస్యాలను వెలికి తీసి అందించే విమర్శ పాటవాన్ని గుర్తించగల స్తోమత కళాభిరుచి కలవారమని చెప్పుకునే వారిలో కూడా ఏ కొద్దిమందికో మాత్రమే ఉంటుంది. అటువంటి గహనమైన కళాసృష్టి చేయగల వారికంటే, ఆ సృష్టి రహస్యాలను వెల్లడించే విమర్శకుల కంటే సర్వసామాన్యమై సద్యః స్ఫురితమయే కళాసౌష్ఠవాన్ని సాధించగల లోకోత్తర సౌందర్య స్రష్టలకే కళాజగత్తులో ప్రథమ స్థానం ఇవ్వక తప్పదు. ప్రాచీన సాహిత్యానికి వ్యాఖ్యాతలైన ప్రతిభాశాలులెందరున్నా వారికి గానీ, కళాకారులు చెప్పని అందాలను కళాసారస్యాలుగా అందించిన కావ్యశాస్త్రకోవిదులకు గానీ కవుల కంటే ఎక్కువ స్థానాన్ని మన మెన్నడూ ఇవ్వలేదు. కాళిదాసు భాసుని భుజాల దగ్గరకు రాలేకపోయాడన్న విమర్శను అంగీకరించేవారున్నా మల్లినాథసూరి కాళిదాసు కంటే గొప్పవాడన్న విమర్శను స్వీకరించడానికి సిద్ధపడేవారుండరు. రచయిత కంటే విమర్శకుడు ఒకటి రెండు మెట్లు ఎత్తుగా ఉండాలని కోరుకునేవారు తప్పనిసరిగా ఏదో ఒక ప్రయోజనాన్ని, సిద్ధాంతపరమైన ప్రయోజనాన్ని ఆశించేవారుగా ఉంటారు. ఇది వాంఛనీయమైన విమర్శ కాదు. పూర్వులు ప్రతిభావంతుడైన విమర్శకుడికి ప్రతిభావంతుడైన రచయితతో సమాన హోదా కల్పించారు. ఈ సంబంధంతో ఒడిదుడుకులు ఏర్పడినప్పుడు సద్విమర్శ సామరస్యాన్ని కోల్పోతుంది.

లోకవృత్త చిత్రణకు పూనుకున్న రచయిత తన రచనా క్రమంలో ఏ విద్యను గూర్చి రాయవలసి వస్తే ఆ విద్య మహిమ అచ్చు పడేలా రాయాలని పూర్వులు భావించారు. ఇది ఆధునిక రచయితలకు కూడా వర్తిస్తుంది. కళాకుశలుడైన రచయిత దానికి తన విద్యా ప్రౌఢిని కూడా జోడించి చేసిన శ్రేష్ఠమైన రచనను విమర్శించవలసి వచ్చినప్పుడు ఆ విమర్శకుడు రచయిత కన్నా రెండాకులు ఎక్కువగా చదివి ఉండాలి అన్న కొ.కు అభిప్రాయం పరంపరగా కొనసాగివస్తున్నదే. కళాకుశలత వేరు, జ్ఞానం వేరు. కొ.కు జ్ఞానం విషయంలోనే సద్విమర్శకుడికి ఆధిపత్యం ఉండాలని తలచారు. విమర్శకుడికి ఈ విధమైన సామర్థ్యం కొరవడినపుడు విమర్శ కేవలం పొగడ్తలతోనూ, తెగడ్తలతోనూ నిండిపోతుంది. "జీవితాన్ని విమర్శించే కవికి ఆర్థిక శాస్త్రమూ, సోషియాలజీ, సైకాలజీ మొదలైన విస్తీర్ణ శాస్త్రాల తాలూకు జ్ఞానం కొంత కొంత అయినా ఉండక తప్పదు. భాషతో సంబంధించిన విషయం. కనక మరొక వంక అతనికి భాషకూ వ్యాకరణానికీ సంబంధించిన జ్ఞానం కూడా ఉండాలి. కళతో సంబంధించిన విషయం కనక కవి కళాభిజ్ఞుడు కూడా అయి ఉండాలి". అన్న కొ.కు విమర్శకుడు అంతకంటే జ్ఞాన సంపన్నుడు కావాలని ఎంచినట్టు స్పష్టపడుతుంది. విమర్శించే శక్తి గల పాఠకుడు తన సాహిత్యాభిరుచిని పెంచుకోవడమే కాక సమాజంలో కూడా సాహిత్య వ్యాప్తికి దోహదం చేస్తాడు. విమర్శపాటవం గల వ్యక్తులు కొందరు కలసి గోష్ఠులు, చర్చలు కొనసాగించడం వల్ల పాఠకులకు, విమర్శకులకు, రచయితలకు జ్ఞానం పెరుగుతుందని, సాహిత్యానికి మేలు జరుగుతుందని కొ.కు అంటారు. సభలు, సన్మానాలు ఆయన తత్వానికి సరిపడవు.

విమర్శకుడు ఒక వైపున రచయితను, వివిధ రచయితలను అర్థం చేసుకోగల వాడై ఉండాలి. మరొకవైపున ఆ రచన యొక్క ఫలం అనుభవించే వారి మనఃప్రవృత్తి అర్థం చేసుకోగలవాడై ఉండాలి అని చెప్పడంలో కొ.కు విమర్శకుడు కేవల జ్ఞానావరణం నుండి బయల్పడి సామాజిక స్థితిగతులను, మానవసంబంధాలను అవగాహన చేసుకోగల మానసికావరణంలోకి ప్రవేశించవలసిన అవసరాన్ని సూచించారు. రచయితలు సాధారణంగా శిల్పం పట్ల, కళ పట్ల అభినివేశాన్ని ప్రదర్శిస్తారు. కానీ రచన పరమార్థం అదికాదు. ఈ రెంటిని మించిన సామాజిక ప్రయోజనం ఒకటి ఉంటుంది. శిల్పాన్నీ, కళను గ్రహించడంలో విమర్శకుడు రచయిత కంటే మెరుగైన స్థితిలో ఉన్నప్పుడు  ఒక రచన పాఠకులను ఆ రెండు శక్తుల వల్ల కలిగే భ్రమలో నిలిపి ఉంచకుండా దాని పరమార్థాన్ని నిర్ణయించగల మార్గాన్ని చూపగలడు. సంస్కారవంతులైన పాఠకులకు, విమర్శకులకు, రచయితలకు కూడా జీవితాన్ని, జీవితం యొక్క అంగాలనూ సూక్ష్మంగా పరిశీలించి విమర్శించడానికి హక్కున్నదని కొ.కు అంటారు. ఈ ముగ్గురి మధ్య ఉండే సంబంధాలు సమర్థంగా, సజావుగా సాగినపుడు సాహిత్యం ప్రయోజనకరమైన మార్గంలో అభివృద్ధి పొందగలదని ఆయన తలచారు. సృజనకు ప్రేరణ, ఆశయం, శిల్పం ముఖ్యం. ఒక రచయిత స్వాభావిక లక్షణాన్ని గానీ, సృజన రూపాన్ని గానీ నిర్ణయించదలచిన విమర్శకుడు ఈ మూడు అంశాలూ రచయితలో ఏ స్థాయిలో, ఏ మార్గంలో ఉన్నాయో ముందుగా గ్రహించాలి. ఈ విధమైన అవగాహన లేకుండా విమర్శ చేయకూడదు, ప్రచురించకూడదు, పరిగణించకూడదు అంటూ కొ.కు విమర్శరంగంలో ప్రచురణరంగం నిర్వహించగల పాత్రను కూడా ఎత్తి చూపించారు. ఈ సందర్భంలో ఏ విమర్శ అయినా ఎటువంటిదో తేల్చుకోవాలంటే దానిని చదవడం కంటే ముఖ్య విషయం ఏమంటే విమర్శించే వ్యక్తికీ, పత్రికలకీ వెనక ఉండే పూర్వ చరిత్ర అన్న కొ.కు అభిప్రాయం చాలా కీలకమైనదిగా కనిపిస్తుంది. అంతేకాదు, మనం వెనకేసుకొచ్చే మనిషి మీద వ్యక్తిగతమైన అభిమానం కూడా ఉండాలి అన్న కొ.కు అభిప్రాయం కూడా విమర్శ సాపేక్షమైనది. విమర్శకులు తాము అభిమానించే లేదా ఆరాధించే వ్యక్తినీ, వ్యవస్థనూ, ఉద్యమాన్నీ లేదా సాహిత్య రూపాన్నీ విమర్శించడానికి పూనుకున్నప్పుడే అభిమాన, దురభిమానాలకు దూరంగా ఉండే విచక్షణనూ, సంయమనాన్ని ప్రదర్శించవలసి ఉంటుంది. పూర్వచరిత్ర వ్యక్తిగత సంబంధాలు కూడా విమర్శకుణ్ణి తప్పుతోవ పట్టించే సందర్భాలు లేకపోలేదు.

విమర్శకుడు విషయము–విధానము, విషయము–వ్యక్తి అనే వాటిలో కేవలం విషయాన్నే లక్ష్యంగా ఎంచుకోవాలని కొ.కు అంటారు. సాహిత్యంలో ప్రయోగవాదం ప్రయోజనకారి కాదని కొ.కు విశ్వాసం. రచయిత ఒక విషయాన్ని చైతన్యస్రవంతి పద్ధతిలో చెప్పాడా! అస్థిత్వవాద ధోరణిలో చెప్పాడా! లేదా ఏ ఇతర వినూత్న సంప్రదాయ పద్ధతిలో చెప్పాడా! అనే జిజ్ఞాస కంటే అతడు ఏ విషయాన్ని ఏ ప్రయోజనం కోరి చెప్పాడు? అన్నదే ఆయనకు ప్రధానం. ఈ దృష్టితోనే ఆయన 'యులిసిస్' వంటి ప్రఖ్యాత రచనలతో పాటు తానారాధించే శ్రీశ్రీ ప్రయోగవాద ధోరణి పట్ల కూడా విముఖతను ప్రదర్శించారు. మన విమర్శకులు విషయం కన్న విధానం ముఖ్యమనుకొనే అపోహను వదిలించుకోవాలని కొ.కు అంటారు. విధానం పట్ల శ్రద్ధ పెట్టిన విమర్శకులు వేరు వర్గంగా విడిపోయి తత్త్వ శాస్త్రం, మనో విజ్ఞాన



Text.pmd 28 2/28/2009, 6:15 PM

శాస్త్రం, సామాజిక–ఆర్థిక శాస్త్రాలలో పారంగతులైనట్టు ఒక విశిష్ట ముద్రను పొందుతారు. ఏ రచనలపై ఏ తాత్త్విక ముద్ర ఉందో విశ్లేషించి వెల్లడించడమే వీరి విమర్శ వ్యాపారం. ఆ విమర్శకుడు దానిని ఉత్తమ సాహిత్య ప్రయోజనంగా ఎంచినా కొ.కు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. విమర్శ చేసేటప్పుడు ప్రత్యర్థిని కాక ప్రత్యర్థి భావాలనే ముఖ్యంగా ఎంచుకుని తీవ్రమైన ఖండనకి తలపడడంలో కొ.కు దిట్ట. ఇందుకు ఆయన 1937లో 'వీణ' లో రాసిన "నవ్య సాహిత్యం–ఒక లేఖ" అన్న రచనను చదవాలి. అసంతృప్తి లేనిదే అభివృద్ధి లేదన్నది కొ.కు సాహిత్య విమర్శ సూత్రాలలో ఒకటి. ఈ అసంతృప్తి అనేది రచయిత పట్ల విమర్శకుడికి ఉండవచ్చును. విమర్శకుడి పట్ల రచయితకూ ఏర్పడవచ్చును. విమర్శకుని అసంతృప్తి తీవ్రము, నిష్కపటము, స్పష్టము, ప్రయోజనాపేక్షితము అయిన సునిశిత విమర్శకు దారితీస్తుంది. కొ.కు తొలిదశలో కొనసాగించిన నిర్భయము నిష్పక్షపాతము అభ్యుదయ భావపూరితము అయిన తీవ్ర విమర్శ ఇందువల్ల పుట్టినవే. సమర్థులైన విమర్శకులు లేరని తోచినప్పుడు ఎవరి రచనలకు వారు వాఖ్యానాలు రాసుకోవటంలో మహాపాతకమేమీ లేదు అన్న అభిప్రాయం కూడా కొ.కులో 1938 నాటికే బలపడింది. తన విమర్శకుల పట్ల ఆయనకు అసంతృప్తి ఏర్పడింది. అందుకే తన కథలను వ్యాఖ్యానించుకుంటూ తన రెండు కథా సంపుటాలకు తానే ముందుమాటను సమకూర్చుకున్నారు. ఇది వ్యాఖ్యానమా? విమర్శా? అన్న చింత ఆయనను బాధించలేదు. వ్యాఖ్యానము విమర్శే అనే విమర్శకుల పక్షానికి అతను చేరారు. అసంతృప్తి అభివృద్ధికి మాత్రమే కాదు, అది పెచ్చు మీరినపుడు కర్మ సన్యాసానికి కూడా కారణమవుతుంది. కొ.కులో విమర్శ పట్ల ఏర్పడిన అసంతృప్తి క్రమంగా ఆత్మ విమర్శకు దారితీసింది. అభ్యుదయ రచయితకు ఆత్మ విమర్శ ఉత్తమోత్తమ సాధనమని, ఆ విమర్శ వల్లనే రచయిత తన లోపాలను తాను దిద్దుకోగలుగుతాడని 1947 నాటికి దృఢంగా విశ్వసించిన కొ.కు ఆ ఆత్మవిమర్శ కారణంగానే ఇంచుమించుగా 1965 నాటికి సృజనాత్మక రచనకు దూరమయ్యారు. తాను ఇంతకాలం చేసిన రచనల వల్ల సమాజానికేమీ ప్రయోజనం చేకూరలేదన్న తీవ్రమైన అసంతృప్తి మాత్రమే ఆయన కలం ముడవడానికి కారణమయింది గానీ ఆయనలోని సృజనశక్తులు అంతరించిపోవడం వల్ల మాత్రం కాదు. ఒక దశలో 1949 నాటికే మన సాహిత్యోద్యమం అంతరించిపోయిందనే అభిప్రాయం అతనికి కలిగింది. అసంతృప్తి వల్లనో, అనుభవం వల్లనో చెప్పలేం గానీ జీవితం, సాహిత్యం సాపేక్షమైనవని, జీవితంలోను, సమాజంలోను ఏర్పడే మంచి పరిణామాలను బలపరచడమే రచయిత చేయగలడు గానీ రావలసిన సత్పరిణామాలకు అతడు చేయగల దోహదం చాలా స్వల్పమని 1969 నాటికి కూడా కొ.కు దృఢంగా విశ్వసిస్తూ వచ్చారు. సమాజానికి, రచయితకూ  మధ్య ఈ దశలో విమర్శకుడు చేయవలసిన పని ఏమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. రచయిత సమాజంలోని అభ్యుదయకరమైన మార్పులను బలహీనపరచడానికి చేసే ప్రతీ ప్రయత్నాన్నీ విమర్శ ఎదిరిస్తుంది. సామాజిక ప్రయోజనకారి అయిన ప్రతి గుణాన్నీ వెలికితీసి అందరికీ తెలియజేస్తుంది. ఇది సద్విమర్శకు ప్రయోజనమని కొ.కు అంటారు. విప్లవాల సంగతి అటుంచి చిన్న చిన్న సంస్కరణలను కూడా సాహిత్యం చెయ్యలేదు. 'జీవితం దిగబెరుతున్నపుడు సాహిత్యం ఎగబెరగదు' అన్న కొ.కు వ్యాఖ్య పరిశీలించదగినది. ఇది కొ.కు జీవించిన సమాజానికే వర్తిస్తుంది గానీ అంతకంటే భిన్నమైన లక్షణాలు గల సమాజాల విషయంలో ఈ దృష్టిని కొంతవరకైనా సరిదిద్దుకోవలసి ఉంటుంది. మనం ఇప్పటికీ కొ.కు నివసించిన సమాజావశేషాలలోనే కాలం పుచ్చుతూన్న కారణంగా ఈ విమర్శను నిర్దిష్టంగా ఔనని సమర్థించలేకపోతున్నాం, కాదని నిరాకరించలేకపోతున్నాం. ●


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**

**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-** **సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-**

**అయిదేళ్లకు : రు. 500 /-** — **పదేళ్లకు : రు. 900/-** — **విడి ప్రతి : రు. 10/-**

**చందా దారులకు విజ్ఞప్తి** **చిరునామా పైన చందా ప్రారంభ మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.**

మేనేజర్

ప్రస్థానం

**1-1-187/1/2,** వివేక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్–**20**

వివరాలకు : **040-27660013,** సెల్: **9490099059 ;** ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in





Text.pmd 29 2/28/2009, 6:15 PM

◆ కథ



# పుట్టిన రోజు

**మూలం : వైకం మహమ్మద్ బషీర్**
**మళయాళీ కథ ఇంగ్లీషు నుండి**
**తెలుగు అనువాదం: డా॥ మానేపల్లి**

**మార్గశిర మాసం అష్టమి- అంటే ఎనిమిదవరోజు- ఇది నా పుట్టిన రోజు. మామూలు రోజుల్లా కాకుండా ఇవ్వాళ బాగా పెందలాడే లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం కూడా ముగించాను. ఖద్దరు చొక్కా తొడుక్కొని- తెల్లని కేన్వాస్ చెప్పులు వేసుకొని నా వాలుకుర్చీలో చేరగిలబడి కూర్చున్నాను, బరువెక్కిన గుండెల్తో. ఇంతలో పొరుగింటి మాధవన్ లేచి- ఇంత పొద్దున్నే నన్ను చూసి, ఆశ్చర్యపోతూ- ఒక చిరునవ్వు విసిరాడు.**

"హల్లో, గుడ్ మార్నింగ్" అన్నాడు ఇంగ్లీషులో

నేనూ గుడ్‌మార్నింగ్ అన్నాను.

"ఇంత పొద్దున్నే లేచావివ్వాళ, ఏదన్నా ప్రయాణమా?"

"అబ్బే లేదు. ఇవ్వాళ నా పుట్టిన రోజు!"

"నీ పుట్టిన రోజా- ఐతే నీకు నా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు!"

''థ్యాంకర్యూ!'' ఈ యావత్తు సంభాషణా ఇంగ్లీషులో సాగింది.

టూత్‌బ్రష్ ఒకటి నోట్లో పెట్టుకుని బాత్‌రూంలోకి వెళ్ళాడు మాధవన్. చుట్టూ కోలాహలంగా ఉంది. సినిమా పాటలు- నవ్వులా- జోకులా- ఇక్కడంతా గుమస్తాలూ- స్టూడెంట్‌లూనూ. అందులో ఒక్కడిక్కూడా ఏ చీకూ చింతాలేదు. నాకు టీనీళ్ళకు ఠికానా లేదు. మధ్యాహ్న భోజనం గేరంటీ. నిన్న హమీద్ బజార్లో కనపడి- రేపు మధ్యాహ్నం భోజనానికి రమ్మన్నాడు. ఊరికెనే. హమీద్ బాగా డబ్బున్నవాడు కనుక భోజనానికి బాధలేదు. అంతవరకూ టీనీళ్ళన్నా లేకుండా ఎలా ఉండేదీ? ఐతే నేనుండే గదిపక్కనే స్టోర్‌రూం. అంటే పక్కిల్లే మాధవన్ వుండేది. నాకు మా యింటి యజమాని- ఒక చిన్నగది- చాలా చిన్నగది అద్దెకి ఇచ్చాడు. నెలకి ఐదురూపాయలు అద్దె. నా టేబిల్ కుర్చీ, మంచం, షెల్ఫ్- వీటితో ఇక కాలు మెదపడానికి ఖాళీ లేనంత ఇరుకు గది. మాధవన్ పనిమనిషి అతనికి టీ చేస్తున్నది. ఆ కాంపౌండ్‌లోని మూడు ఇళ్ళలో అనేక రకాల మంది వుంటున్నారు. అందరిలోనూ నేనంటే యజమానికి అస్సలు పడదు. నేనంటే ఇష్టం లేనివాళ్ళు మరొక ఇద్దరున్నారు. ఒకరు ఆ పక్కనున్న హోటల్ యజమాని. యజమానికి నేనంటే యిష్టం లేకపోవడానికి కారణం- నేనతనికి కొంత సొమ్ము బాకీ వున్నాను. గవర్నమెంటుకి కూడా నేనంటే కిట్టదు. గవర్నమెంటుకి నేను ఏమీ బాకీ లేను. కాని నేను కనిపిస్తేనే దానికస్సలు గిట్టదు. నా పొడ కూడా పడదు. ఇక్కడ నా యిల్లూ, నేనూ, నా తిండీ- ఇవి మాత్రం చెప్పాను. ఇక్కడ చెప్పుకోవలసిన మరికొన్ని సంగతులు కూడా ఉన్నాయి. నేను అర్ధరాత్రి దాటిందాకా నగర సంచారం చేసి ఇల్లు చేరాను. చేతిలో కాగితం, కలం. ఈ రోజు డైరీ రాయవలసి వుంది. ఉదయం నుంచి- ఇప్పటిదాకా. ఇందులో ఒక చిన్న కథకి కావలసిన దినుసు అంతా ఉంది. కాని గదిలో దీపం లేదు- దీపంలో నూనె లేదు. రాయవలసింది చాలా వుంది. ఇక నేను గది విడిచి బయటకి వచ్చాను- చెరువు ఒడ్డున దీపస్తంభం కింద కూచున్నాను రాద్దామని.

ఆకాశంలో మేఘాల్లాగే నా గుండెల్లో పేరుకొన్న ఆలోచనలు కూడా వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవ్వాల్టి రోజున ఏ ప్రత్యేకత లేదు. కానయితే- ఇవ్వాళ నా పుట్టిన రోజు. చేతిలో డబ్బుల్లేవు. అప్పు పుట్టే అవకాశమూ లేదు. ఇక్కడ నాదీ అంటూ ఏమీ లేదు. నేను తొడుక్కున్న దుస్తులు స్నేహితులిచ్చినది. నాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పాడు మాధవన్. దేనికి శుభాకాంక్షలు. నా గుండె బాధతో బరువెక్కి పోయింది.

ఏడయ్యింది, వాలు కుర్చీలో జారపడివున్నాను. ఇవ్వాళయినా కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలి, ఏ పొరపాటు చెయ్యకుండా. అప్పు చెయ్యకూడదు. ఏ చిక్కులూ తెచ్చుకోకూడదు. గత ఏడాదికంటే- ఇప్పుడు ఒక ఏడాది పెద్దవాణ్ణయ్యాను. అయితే, ఇంతకు ఏ తేడా లేదు. గత ఏడాది అంటే ఇరవై ఆరు... కాదు ముప్ఫయిరెండు- లేక నలభై ఏడు?

మనసంతా గందరగళంగా



Text.pmd 30 2/28/2009, 6:15 PM

## మూల రచయిత గురించి

తగళి శివశంకర పిళ్ళై- రెండు శేర్లు, రొయ్యలు- గొప్ప మళయాళీ నవలికలు. ఢిల్లీ సాహిత్య అకాడెమీ- ప్రధాన భారతీయ భాషలలో వాటిని ప్రచురించింది. రొయ్యలు- చెమ్మీన్ పేరుతో సినిమాగా వచ్చింది. ఆ సినిమా రాష్ట్రపతి ప్రశంసా పత్రంతో పాటు, ఎన్నో అవార్డులు సాధించింది. ఇదంతా పూర్వరంగం. ఆ తరవాత మళయాళ సాహిత్యంలో చెప్పుకోదగ్గ గొప్పవ్యక్తి వైకం మహమ్మద్ బషీర్. మాతృభాష మళయాళంలోనే – రసవత్తరమైన రచనలు చేశాడు. 1908 జనవరి 21న జన్మించారు. గాంధీ జాతీయోద్యమం ప్రారంభించేనాటికి బషీర్ హైస్కూలు విద్యార్థి. 1930లో గాంధీ పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం నిర్వహిస్తూ మొదటిసారి జైలుశిక్షకు గురయ్యాడు. విడుదలయి కేరళ విడిచి- ఉత్తర హిందూస్తానం యావత్తూ ఏడేళ్ళపాటు తిరిగాడు. తిరిగి స్వస్థలం చేరుకున్నాడు. జాతీయోద్యమంలో పనిచెయ్యడం మానలేదు. 1947లో బ్రిటీష్‌వారు వైదొలగేనాటికి – ఏడుసార్లు జైలుశిక్ష- అనుభవించాడు.

ఎక్కువగా కథలూ, నవలలూ రాశాడు- దాదాపు 40 సంపుటాలు. 1990లో కేంద్ర సాహిత్య అకాడెమీ ఫెల్లోషిప్ ఇచ్చి గౌరవించింది. ఆయన రచనలు అనేక ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. పాతుమ్మా మేక, చిన్ననాటి చెలి అనే లఘు రచనలు తెలుగులో అనువాదమయ్యాయి(నేషనల్ బుక్‌ట్రస్ట్ ఇండియా ఈ రెండింటినీ ఒక పుస్తకంగా ప్రచురించింది-1990). బషీర్ 1997లో మరణించాడు.

ప్రస్తుత కథ మళయాళీ సాహిత్యంలో ఎంతో మన్ననలు పొందింది. దీన్ని స్వయంగా బషీర్ ఇంగ్లీషులోకి అనువదించాడు. అంటే ఇది మూలం వలె రచయిత కలం నుండి వెలువడిన అధికారిక పాఠమనమాట. ఇదే కథ మరొకరి అనువాదంతో- సాహిత్య అకాడెమీ ప్రచురించిన సమకాలీన కథా సంకలనంలో చేరింది. బషీర్ శైలి అనువాదానికి లొంగదు. వ్యంగం వాస్తవికతా జమిలిగా పెనవేసుకొని ఉంటాయి. 2008 జనవరిలో కేరళలో, తమిళనాడులో, ఆలీఘర్ ముస్లిం యూనివర్శిటీలో- బషీర్ శతజయంతి సభలు జరిగాయి. బషీర్ తెలుగు వారికీ సన్నిహితుడే.

వుంది, అద్దంలో చూసుకున్నాను. ఫరవాలేదు. కాస్త చూడదగ్గ ముఖమే. విశాలమైన నుదురు, నిశ్చలమైన కనులు. వంపు తిరిగిన కత్తిలాగ పల్చని మీసం. అంతా బాగానే వుంది. అదుగో- కాస్త తెల్లపాయ తలమీద. నల్లని తలవెంట్రుకల్లో చెవిపక్క తెల్లజీర. ఒకటి రెండు తెల్ల వెంట్రుకలు. పీకేశాను వాటిని. చిన్న తలనెప్పి ప్రారంభమైంది. టీ పడకపోవడం వల్లా? తొమ్మిదయింది. హోటల్ వాడు నన్ను చూసి తల తిప్పేశాడు. డబ్బులిస్తే గాని టీ యివ్వనన్నాడు. రేపిస్తానన్నాను. నిన్న ఆ మాటే చెప్పావన్నాడు. లేదు ఇవ్వాళ నాకు డబ్బులందుతాయన్నాను. నమ్మలేదు. టీ లేదు.



పదయింది, నోరెండి పోతున్నది. ప్రాణం కటకటలాడుతున్నది. టీ నీళ్ళకి దిక్కులేదు. ఇద్దరు కుర్రాళ్ళొచ్చారు. బొమ్మలు అమ్ముతున్నారు. నన్నొకటి తీసుకోమన్నారు. పావలా ఇవ్వండి చాలన్నారు. వద్దన్నాను. మీ లాంటి వాళ్లు కొనకపోతే- మాకు దినం ఎలాగడుస్తుంది సార్ అన్నారు. నా దగ్గర డబ్బుల్లేవన్నాను. ఈ చొక్కా, వాలుకుర్చీ, కాళ్ళకి వేసుకున్న చెప్పులు- ఇవన్నీ చూసి నన్ను సర్ అన్నారు మర్యాదగా. కాని ఇవేవి నావి కావు. చొక్కా లోపలున్న శరీరం- బహుశా అదీ నాది కాదేమో- ఎన్ని ఊర్లు తిరిగాను- చెడ తిరిగాను- ఎందుకు? తెలీదు- ఈ రక్తం ఈ శరీరం ఈ ఎముకలు- ఈ మొత్తం ఈ దేశానివి- నా అంతా ఈ దేశానిదే- ఇండియాలో చాలా నగరాల్లో చాలా రూపాల్లో చాలా చాలా తిరిగాను. కన్యాకుమారి నుంచీ కాశ్మీర్ వరకూ – కరాచీ నుంచి కలకత్తా వరకూ- దేశం అంతా తిరిగాను. అన్ని చోట్లా స్నేహితులున్నారు. అందరూ గుర్తున్నారు. ఆడవాళ్ళు-మగవాళ్ళు. ఓహ్ – చాలామంది- జ్ఞానం – ఎంత గొప్పది- కాలం పరుగులు తీస్తున్నది- రోజులు గడిచిపోతున్నాయి. నేనెవరు? ఎన్నెన్ని విస్ఫోటనాలు ఈ గుండెల్లో! నేనెవర్ని? నేను ఎవరికయినా తెలుసా? నన్నెవరయినా ప్రేమిస్తున్నారా? నా ప్రేమ ఇండియా మొత్తం వ్యాపించుగాక- నిండుపున్నమి వెన్నెల లాగా నేను- చిన్నప్పుడు మా నాన్న వేలు పట్టుకుని తిరిగాను- మా అమ్మ కొంగుకి వేలాడేను. ఆకలేస్తోందన్నాను- ఇప్పుడు? కాలం ఎంత క్రూరంగా గడిచిపోతున్నది. నేనెవర్ని? విప్లవకారుడు? కమ్యూనిస్టు? విధ్వంసకుడు, పనికిమాలినవాడు- బహుశా ఆ అన్నీ నేను- ఎవరు నేను? తల పగిలిపోతున్నది. టీ తాగ లేదు. అందుకని తల పేలిపోతున్నది. వెళ్ళి భోజనం చేస్తే మంచిది. ఈ తలనెప్పితో ఒక మైలుదూరం నడవాలి. అక్కడ భోజనం వుంటుంది.

పదకొండు. హమీద్ షాపు దగ్గర లేదు. ఇంటికి వెళ్ళేడేమో. అసలు-అతను తనను దగ్గరుండి ఇంటికి తీసుకెళ్ళితే బాగుణ్ణు-

ఇల్లు – చాలా పెద్ద పెద్ద ఇనుపగేట్లు- మూసి ఉన్నాయి. హమీద్ లేడు. ఏదో పనిమీద ఎటో వెళ్ళాడట! గుమ్మం వెనక గాజుల చప్పుడు

ఎప్పుడొస్తాడూ?

సాయంత్రం బాగా పొద్దుపోవచ్చునట

వచ్చాక నేను వచ్చి వెళ్ళానని చెప్పండి

ఎవరు వచ్చి వెళ్ళారనీ?- గుమ్మం వెనుక తలుపునానుకొని-

అవును ఎవరని చెప్పాలి

సరే- నేనే వస్తాన్లెండి-

వెనుదిరిగాను. కాళ్ళకింద ఇసక కాలిపోతున్న పంచదారలా వుంది. ఆ పక్క చెరువు- సువిశాలమైన గ్లాసు పలకలా- గాజు



Text.pmd 31 2/28/2009, 6:15 PM

ముక్కలు– మెరుస్తూ– తెల్లగా– నా కళ్ళనిండా చీకటి– గుండెనిండా నిరాశ– ఎముకల్లో నొప్పి– మంట– వణుకు– లోపల ఆకలి– పిచ్చి ఆకలి– ఈ భూమిని మింగేసంత ఆకలి– ఆకలి తీరే మార్గం– రేపు– ఎల్లుండి– రోజుల తరబడి– తీరని ఆకలి– కళ్ళు తిరుగుతున్నాయి– నేల కూలుతున్నాను–



పన్నెండున్నర. తెలిసిన వాళ్ళు, పరిచయస్తులు, స్నేహితులు– దాటి పోతున్నారు– వెళిపోతున్నారు చూడకుండా– చూడనైనా చూడకుండా– ఇవ్వాళ నా పుట్టినరోజు– ఒరే నాయనా– పుట్టిన రోజురా నా పుట్టిన్రోజు ఇదేన్రా బాబూ– నాలో నేనే గుసగుసలా – ఎవరూ పలకరించరు– ఆగరు– ఎంచేత–

ఎవడదీ– సిఐడీ నా? ఏమో–

ఒంటిగంట. ప్రసాద్– ఒకప్పుడు పత్రికా రచయిత– ఇప్పుడు ఒక షాపులో కూచున్నాడు. ముందు ఏమీ కనపడటం లేదు.

ప్రసాద్– విప్లవం ఇంకా దూరంలో వుంటుంది?

దగ్గర్లోనే వుండొచ్చు–

ఓహో– ఎక్కణ్ణించి వస్తున్నావు– ఈ మధ్య కనపడలేదు

ఆ హా హో–

ఏదన్నా విశేషమా

అబ్బే– ఏం లేదు– లేదు

అతని పక్కనే ఒక కుర్చీలో కూర్చున్నాను. నా రచనలు చాలా తన పేరు మీద అచ్చు వేయించుకున్నాడు. ఆ పేపర్లన్నీ ఒక బైండుచేసి పెట్టుకున్నాడు– గొప్ప చాటుకోవడానికి. పేజీలు తిరగేస్తున్నాను. కళ్ళు తిరుగుతున్నాయి. నా గుండెలు చాలా వేగంగా కొట్టుకుంటున్నాయి. నా ప్రాణం నాకో కప్పు టీ కావాలి టీ కావాలి, నేను అలిసిపోయాను అని అరుస్తున్నది. నన్ను అతను– అడగడేం? నేను అలిసిపోయి ఉన్నానని తెలీదం లేదా? తను– గళ్ళా పెట్టె దగ్గర కూచున్నాడు– చాలా నిర్లిప్తంగా, ఏమీ పట్టనట్టు.

పక్కనున్న పెంటకుప్ప మీద పడివున్న– దోశె–దోశె ముక్క కోసం ఇద్దరు ముష్టి గుంటలు దెబ్బలాడుకుంటున్నారు.

నేను మౌనంగా నీరసంగా–

"నాకో కప్పు టీ కావాలి" అన్నాను

ప్రసాద్– గళ్ళా పెట్టె తెరిచి– రూపాయలు చిల్లరలోంచి– ఒక అణా కాసు తీశాడు– ఒక కుర్రాడికిచ్చి

"టీ పట్రా" అన్నాడు

కుర్రాడు పరుగుతీశాడు. నా మనసు కాస్త చల్లబడింది. కుర్రాడు తెచ్చిన టీ కప్పు పట్టుకుని నావేపు పెట్టి–

"టీ– " అన్నాడు

నేను వద్దన్నాను! నేను ఏదీ ఎరగని వాడిలాగ, నా ముఖంలో దైన్యభావం కనపడనీయకుండా ముందుకు నా బూటులేసు ముడివేసుకున్నాను.

"మీ పుస్తకాలు నాకేం ఇవ్వలేదు" అన్నాడు ప్రసాద్

"ఇస్తాను"

"మీ పుస్తకాల మీద సమీక్షలు చదివాను"

"మంచిది" అన్నాను. ముఖానికి చిరునవ్వు తగిలించుకొని మనసులో సంతోషం లేనిదే ముఖంలో నవ్వు ఎలా కనపడుతుంది.

లేచి వీధిలోకి నడిచాను, ముందుకి

ఆ గూఢచారి– నా వెంట వస్తున్నట్టున్నాడు

రెండు గంటలయింది, నేను నా గదిలో వాలు కుర్చీలో కూర్చున్నాను. అలిసి పోయాను, నిస్సహాయంగా. మంచి బట్టలు వేసుకుని– కాస్త సెంటుకూడా రాసుకొని ఒకామె మా గుమ్మం దగ్గరకొచ్చింది. ఆమె చాలా దూరప్రాంతం నుంచి వచ్చింది. వరదల్లో వాళ్ళవూరు ధ్వంసమయిపోయింది. ఆమె కొంత సహాయం అవసరం నా వేపు – కొద్దిగా నవ్వుతూ– చూసింది. గుమ్మానికి గుండెలు నొక్కి నిలబడింది. ఆమెను చూసి ఎక్కడో నాలో కోరిక మెదిలింది. చుట్టూ ఎవరూ అలికిడి లేదు, ఎక్కడో పుట్టిన కోరిక క్రమంగా పెరిగి వళ్ళంతా పాకింది. నా గుండెలు చప్పుడు నాకే వినపడుతున్నది. పరిస్థితి ఏదో ప్రమాదాన్ని సూచిస్తున్నది.

"అమ్మా– నా దగ్గర ఏమీ లేదు– వెళ్ళి ఇంకెవరినయినా అడుగు"

"ఓహో!" నిట్టూరుస్తూ నిరుత్సాహంగా ఆమె వెళ్ళిపోయింది.

ఆమెతో పాటు– ఆ సెంటువాసన కూడా– నిష్క్రమించింది.

మూడయ్యింది. ఎవరినయినా అప్పు అడిగితే? పరిస్థితి చాలా దారుణంగా వుంది. తోచడం లేదు, ఏం చెయ్యడానికీ. ఎవర్ని అడగను? నా మనసులో చాలామంది మెదిలారు. అప్పు అడగడం అంటే ఆత్మాభిమానం గాయపడుతుంది. ఆత్మహత్య చేసుకోనా? చావు – చావు ఎలా వుంటుంది?

మూడున్నర. నోట్లో నాలుక పిడచకట్టుకపోయింది. ఏదన్నా ఒక సముద్రంలో మునిగితే...! ఎవరో పత్రికా సంపాదకుల ఉత్తరాలు వచ్చాయి – అంతలో. తిరుగు టపాలో కథలు పంపాలట! ఉత్తరాలు జారవిడిచి నీరసంగా పడుకున్నాను. బ్యాంకు గుమస్తా కృష్ణపిళ్ళై నుంచి– ఒక కుర్రవాడొచ్చాడు, అగ్గిపెట్టెకోసం,

ఒక గ్లాసుడు నీళ్ళు కావాలన్నాను. తెచ్చాడు, తాగాను.

"వొంట్లో బాగులేదా సార్" అనడిగాడు కుర్రాడు

"బాగానే వుంది"

"భోంచెయ్యలేదు"

"లేదు"

"ఏం – ఎందుకు తినలేదు సర్"

ఆ కుర్రవాడి చిన్న ముఖం, నల్లని కళ్ళు, వంటిమీద చిరుగులు పట్టిన మాసిన బట్టలు. అన్నం తిన్నానా లేదా అని అడుగుతున్నాడు. నేను కళ్ళు మూసుకున్నాను.

మృదువుగా నెమ్మదిగా "సర్–" అని పిలిచాడు



Text.pmd 32 2/28/2009, 6:15 PM

నేను కళ్ళు తెరిచాను

"నా దగ్గర రెండు రూపాయలున్నాయి"

"వుంటే!"

కాస్త ఇబ్బందిగానే మాట్లాడుతున్నాడు.

"నేను వచ్చేనెల మా వూరికి వెళ్ళేలోగా తిరిగి ఇస్తే చాలు"



వాడి మాటలకి కదిలిపోయాను.

"సరే పత్రా" అన్నాను

నా మాట పూర్తయ్యేలోగానే వాడు ఒక్క పరుగున వెళ్ళాడు. ఇంతలో నా ఫ్రెండ్ గంగాధర్ వచ్చాడు. ఖద్దరు చొక్కా తొడుక్కున్నాడు. ఖద్దరు ధోవతి కట్టుకున్నాడు. నీలం రంగు శాలువా కప్పుకున్నాడు. ముఖంలో ఒక నిరాశా నిస్పృహలతో కూడిన భావం కమ్ముకుని వుంది.

వాలు కుర్చీలో పడుకుని వున్న నన్ను చూసి–

"నువ్వు నిజంగానే, ఒక బూర్జువాలా తయారయ్యావు" అన్నాడు

గడ్డం కాస్త మాసివుంది నాకు, ఒక నవ్వు నవ్వాను.

అతడు వేసుకొన్న దుస్తులు ఎవరివయి వుంటాయో అని అలోచించాను. నాకు తెలిసిన ఒక నాయకుడు నా కళ్ళ ముందు మెదిలాడు. అతనివయి వుండ వచ్చా ఈ దుస్తులు?

"ఎందుకు నవ్వుతున్నావూ? " అన్నాడు గంగాధర్

"ఏం లేదు– నీ వాలకం చూసి"

"సరేలే– వేళాకోళం ఆపి నా మాట కాస్త విను. ఒక పెద్ద చిక్కొచ్చిపడింది. మూడువేలమంది పనివాళ్ళు సమ్మెచేస్తున్నారు. వాళ్ళు దాదాపు పదిరోజుల్నించీ పస్తులుంటున్నారు. చాలా కష్టం వచ్చి పడింది" అన్నాడు గంగాధర్

"ఏమిటి? ఈ సంగతి పేపర్లో చదవలేదే, ఎలా మిస్ అయ్యాను–"

"ఇదంతా పత్రికల్లో ప్రచురించవద్దని ఆంక్షలున్నాయి?'

"అలాగా– సరే– మరి నన్నిప్పుడేం చెయ్యమంటావు?"

"ఈ సందర్భంగా ఒక పెద్ద సభ ఏర్పాటు చేస్తున్నాం. ఆ సభకి నేనే అధ్యక్షుణ్ణి. ప్రస్తుతం ఒక రూపాయి కావాలి. నేను ఇవ్వాళ ఏమీ తినలేదు. నువ్వు కూడా రావాలి సభకి"

"నాయనా అంతా బాగానే వుంది, కాని నా దగ్గరిప్పుడు ఒక్క పైసా కూడా లేదు. నేనూ చాన్నాళ్లనుంచి ఒక్క మెతుకు తినలేదు. –ఐతే–కాస్త ఆగు– చూద్దాం–"

గంగాధర్ కార్మికుల గురించి చెప్పాడు. వాళ్ళ స్థితిగతులు సమస్యలు–ప్రభుత్వ వైఖరి– నేను కూడా పత్రికల వారి గురించి ఎడిటర్లు–రచయితల గురించి మాట్లాడాను.

ఇంతలో ఆ కుర్రాడొచ్చాడు.

రెండు దోశెలు, బీడీలు, టీలు తెమ్మన్నాడు– ఒక్క రూపాయకి.

దోశెలు వచ్చాయి. చెరోటీ తిన్నాం. టీ తాగాం. దోశె కట్టిన పేపరు తీశాను. దానిమీద వార్త నన్ను ఆకర్షించింది. నేనొక బీడీ ముట్టించి, గంగాధర్ కొకటిచ్చాను. మిగిలిన ఒక్క రూపాయి అతనికిచ్చాను. లేచాడు, వెళ్ళడానికి

"ఇవ్వాళ నీ పుట్టినరోజు, ఈ రోజు నువ్వు ప్రపంచానికి ఇచ్చే సందేశం ఏదన్నా వుందా?"

"అవును– విప్లవం–విప్లవం గురించి–"

"చెప్పు–"

"విప్లవజ్వాలలు అంతటా అలుముకుంటాయి. ప్రస్తుతం వున్న ఈ సాంఘిక వ్యవస్థ కుప్పకూలిపోవాలి. ఆ పునాదుల్లోంచి ఒక నూతన ప్రపంచం పుట్టుకు రావాలి"

"బాగుంది. ఈ నా సందేశాన్ని సమ్మెచేస్తున్న వర్కర్ల కందిస్తాను. – అంటూ గంగాధర్ గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. నేను వివిధ సంఘాలకు, గ్రూపులకు చెందిన కార్మికుల గురించి ఆలోచించాను. వాళ్ళు ఎలా జీవితం గడుపుతున్నారు? దోశెకట్టి తెచ్చిన పేపరు తీశాను. ఇంతలో మా యింటి యజమాని వచ్చాడు. ముఖంలో కోపం కొట్టొచ్చినట్టు కనపడుతున్నది. ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచనల్లో పడ్డాను. పేపర్లో బొమ్మలో ఒక మనిషి తల పెకెత్తి నుంచున్నాడు. తల చుట్టూ ఆకాశ హర్మ్యాలు– పెద్ద పెద్ద భవంతులు–దిగువ అతను కాళ్ళకు ఇనుప సంకెళ్ళు– కాని అతడు ఒక వెలుతురు వేపు నిశ్చలంగా చూస్తున్నాడు. కాళ్ళ దగ్గర ఒక పుస్తకం. అందులో ఒక వాక్యం–

'కాళ్ళకు సంకెళ్ళున్నా, చూపులు సునిశితంగా సుదూర భవిష్యత్తు వైపు, ఒక సముజ్వల కాలం వైపు, కాంతిపుంజం వైపు చూస్తున్నాయి"

బహుశా అది సమస్త మానవాళికి వర్తించగల వాక్యం.

"చూడు బాబూ– ఇవ్వాళయినా డబ్బులిస్తావా?"

''నాకింకా డబ్బు అందలేదు– త్వరలో ఇవ్వగలనుకొంటాను"

కాని నా సంజాయిషీ అతను వినదలుచుకొన్నట్టు లేదు.

"ఇలా బ్రతకడం వల్ల ఏం ప్రయోజనం" అన్నాడు కోపంగా

నిజమే. ఇలా బ్రతకడం వల్ల ఏం ప్రయోజనం లేదు– నేను ఈ ఇంట్లో ప్రవేశించి మూడేళ్ళయింది. నేనుంటున్న గదికి– నేనిప్పుడు ఇస్తున్న దానికంటే ఎక్కువ అద్దె ఇచ్చేందుకు ఇప్పటికే కొందరు సిద్ధంగా వున్నారు. నేను ఎక్కువ అద్దె ఇవ్వలేను. ఖాళీచేసెయ్యాలి–! కాని – ఖాళీ చెయ్యడానికి నేను తయారుగా లేను.

నాలుగయింది. బాగా అలిసిపోయాను. ఈ వూళ్ళో నాకు ఏ విధమైన ఆకర్షణ– ఆసక్తీ లేవు. అవే రోడ్లు అవే ఇళ్ళు అవే మోహాలు– నిత్యం చూసినవే చూస్తూ – రోజూ–ప్రతిరోజూ–అవే మాటలు వింటూ– విసిగిపోయాను–చికాగ్గా వుంది–ఒక్కముక్క రాయలేను.

ఆరయింది. అందమయిన సాయంత్రం, అస్తమిస్తున్న



Text.pmd 33 2/28/2009, 6:15 PM

# రాగం

పాతూరి అన్నపూర్ణ

నాకెప్పుడూ అనిపిస్తుంది
ఈ ఉషోదయాలు
ఈ సూర్యాస్తమయాలు
మళ్ళీ వచ్చే చంద్రోదయం
ఆపైన జరిగిపోతున్న కాలం
అన్నీ రోజూ చూసేవైనా
ఉదయం ఎప్పుడూ
కొత్తగానే వుంటుంది
వెన్నెల ఎప్పుడూ
నవ్వుతూనే కనిపిస్తుంది
ఒక జిజ్ఞాసపు రేఖ
నాకు ప్రకృతికీ మధ్య వారధి కట్టింది!
ఎప్పుడైనా మనసు ఒంటరిగా మారి
నిశ్శబ్ద గీతాలను ఆలపిస్తుంటే
ప్రకృతే వచ్చి నన్ను పలకరిస్తుంది
ఒక ఆత్మీయ స్పర్శతో కదిలిస్తుంది
నా హృదయం మయూర మవుతుంది
ఇంద్రధనస్సులా వర్ణాలను పులుముకుంటుంది
గొంగళి పురుగులా ఉన్న నేను
సీతాకోక చిలుకనవుతాను
ప్రతి పువ్వూ నన్ను పలకరిస్తుంది
అందుకేనేమో?
రోజూ వినిపించే జీవనరాగం



ఎప్పటికప్పుడు మారుతూనే ఉంది.
తప్పటడుగులతో నడిచిన బాల్యం నుంచి
స్థిరంగా నిలబడే వయసు వరకు
నా ముందర రహదారులపైన
అడుగుజాడలను స్పర్శిస్తూ పోతుంటే
అనుభవాల పుటలు తెరుచుకుంటున్నాయి.
చంద్రుని వద్దకు వెళ్ళాలనుకునేవాళ్ళు
ప్రపంచాన్నంతా చుట్టి రావాలనుకునేవాళ్ళూ
ప్రేయసి పెదవి పైన ముద్దాడాలనుకునేవాళ్ళు
ఎందరెందరో స్వాప్నికులు
వాళ్ళు సాధించిన విజయాలన్నీ
నాలో మనిషికి స్ఫూర్తినిస్తుంటే
జీవితం ఉన్నది జీవించడానికంటూ హృదయం
హెచ్చరిస్తున్నది
మరుపు అనేది మనిషికి వరం
ఆ అద్భుత వరం సాక్షిగా
గాయపడిన గతాన్ని తుడిచివేసి
రేపటి ఆనందం కోసం నిరీక్షిస్తాను
నేను, కాలం కలిసి నడుస్తూ
నా వెనకాల వస్తున్న జనాలకు
వాయువిలీన రాగాలను
వదిలి వెళ్తాము
ఇప్పుడు నా చెవులకు
ప్రతిక్షణం వినిపిస్తున్నాయి
కాలం పాడుతున్న కొత్త రాగాలు

---

సూర్యుడు సముద్రంలోకి రాలడానికి సిద్ధంగా వున్న నెత్తురు ముద్దలా వున్నాడు. పడమటి ఆకాశంలో బంగారపు ముద్దల్లాంటి మబ్బులు– సముద్రానికి అంచుల్లేవు– ఒడ్డుల్లేవు. యువకులు సిగరెట్లు కాలుస్తున్నారు. అందమైన యువతులు చక్కని చీరలు కట్టుకుని ముస్తాబై చిరునవ్వులు చిందిస్తున్నారు. మనసును కైపెక్కించే సినిమా రికార్డులు వినవస్తున్నాయి. ఒక పిల్లగాలి పువ్వుల మీంచి పరిమళ గంధం వీస్తోంది. నాకు మాత్రం నీరసంగా సొమ్మసిల్లినట్టుంది.

ఏడయింది. ఒక పోలీసు వాడొచ్చి నన్ను తనతో తీసుకువెళ్ళాడు. ఒక పెద్ద పెట్రోమాక్స్ దీపం దగ్గర కూచోమన్నారు. వాళ్ళు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెబుతుంటే నాకు దగ్గర్లోనే అటూ ఇటూ పచార్లు చేస్తూ నా ముఖంలోని భావాల్ని పరిశీలిస్తున్నాడు, డిప్యూటీ కమీషనర్. కళ్ళన్నీ నామీదనే ఉన్నాయి. ఎంత ఘోరం. అక్కడికి నేనేదో చెయ్యరాని ఘోరనేరం ఏదో చేసినట్టు. అలా ఒక గంట ప్రశ్నలు అడిగారు. నీ స్నేహితులెవరు? ఎక్కడెక్కడి నుంచి నీకు ఉత్తరాలొస్తుంటాయి? ఏ రహస్య సంస్థలో నేను సభ్యుణ్ణి? ఆ సంస్థ కార్యకలాపాల ద్వారా ప్రభుత్వాన్ని కూలదొయ్యాలనుకుంటున్నారా? ఏమేమి రాస్తున్నావు– ఏయే రచనలు చేశావు– మొత్తం చెప్పాలి.

"తెలుసా? నేను నిన్ను ఏమయినా చెయ్యగలను–ఆం"

"తెలుసు నేను నిస్సహాయుణ్ణి. కేవలం ఒక పోలీసువాడు" – నిజంగా తలుచుకుంటే– అరెస్టు చేసి లాకప్‌లో పడెయ్యగలడు"

ఏడున్నర. నేను నా గదికి వచ్చేశాను. విపరీతంగా చెమటపోస్తోంది. దీపం లేదు. కిరసనాయిలు లేదు. ఏదన్నా ఇంత తినాలి– ఈ ఆకలిని చంపుకోవడానికి. ఎవరు నాకు తిండి పెడతారు. ఎవర్నీ అప్పు అడగడానికి్కూడా లేదు. ఒకవేళ మాధవన్, వద్దు. పక్క యింట్లో వున్న కళ్ళజోడు స్టూడెంట్‌ని ఒక రూపాయి అడుగలేను. ఆ మధ్య చాలా జబ్బుచేసి– ఇంజక్షన్లకీ మందులకీ చాలా డబ్బు తగలేసుకున్నాడు. ఆఖరికి నేనిచ్చిన రూపాయితో కొన్న మాత్రలవల్ల జబ్బు తగ్గింది. నన్ను సినిమాకి తీసుకు వెళ్ళాడు– సంతోషంగా. ఇప్పుడు– నేనిప్పుడు అతని దగ్గరకి వెళ్ళి ఒక రూపాయడిగితే ఇస్తాడా?

ఎనిమిదీ ముప్పావు. తిరిగి వస్తూ మాధవన్ గురించి చూశాను. సినిమాకి వెళ్ళాడట. పక్కనున్న ఇంటి డాబా మీదికి వెళ్తుంటే– పెద్దగా ఏవో మాటలూ నవ్వులూ వినపడుతున్నాయి. సిగరెట్టు పొగ. దీపం వెల్తురు. ●

## కవిత

# నావి- నీవి

మంత్రి కృష్ణమోహన్

చాలా కాలానికి
చెరువుకు నీళ్ళొచ్చాయి
ముందు
దాని దాహం తీరొద్దూ!



గ్లోబల్ యుగపు
గోప్యమిది
కరచాలనం చేస్తూ
అరచేయి గిల్లడం!

ఆంగ్రో ఆంగ్లియన్ భాష
తెలుసా!
నేను నేర్చుకొన్నా
టీ.వీ. యాంకర్ల దగ్గర.

గోధూళి వేళ
బడిగంట మోగింది
పిల్లలకిది
మురళీ నాదమా!

నదీమ తల్లులారా!
ఆకాశాన విహరిస్తూ
వాలలేరా
కరువు సీమల్లో

అభివృద్ధి ఫలాలు
అందుతున్నాయి
హెలికాప్టర్ల నుండి
అన్నం పొట్లాలుగా...!

పచ్చి నిజం చెప్పినా
నమ్మడం లేదా!
అబద్ధం
నీ ఆరోప్రాణం కదూ!

ఆలస్యం
అమృతం విషం.
అతి తొందర పడితే
మధనపు సుడిగుండమే!

ఇంత దేశాన్నీ కాపాడుతోంది.
కొంత మందే
మిగతావాళ్ళు
అంతర్యుద్ధాల్లో....

పచ్చటి జీవితం
మోడు వారింది
అక్షరమై
చిగురించాను.

# ఆవిష్కరణ

మౌనశ్రీ మల్లిక్



నువ్వు వున్నట్టే వాడున్నాడు
అసలు వాడే నువ్వు నువ్వే వాడు
అలాంటి వాడిని నువ్వు చంపేసావు
అంటే నువ్వు కూడా చచ్చినట్టేకదా
మరి చంపి ఏం సాధించావు?
చచ్చి ఏం సాధిస్తావు?
ఇప్పుడైనా ఎప్పుడైనా
చంపడం చావడం ముఖ్యం కాదు
బ్రతకడం ముఖ్యం!
జీవించడమంటే బ్రతకడం కాదు
దీపంలా వెలగడం
అంటే దారి చూపించడం
నీకు తెలుసా?
కత్తితో పువ్వు గెలుస్తుంది!
కత్తి పువ్వు రెండూ నేలపై పడితే
కత్తి త్రుప్పు పడుతుంది!
కాని పువ్వు మాత్రం పుప్పొడిని
వెదజల్లి అరణ్యాన్ని ఆవిష్కరిస్తుంది.

# ఫలితం

మాడుగుల రాములు

భవిష్యత్తంతా అంధకార బంధ
అంచుల వరకు తరిమి వేయబడుతూంది.
కారు చీకటికి కానుకగా కదిలించబడుతూంది
అమెరికా ఏకీకృత రూపకల్పన రూపు దిద్దుతూంది

మనుషులు డాలర్ల వేటలో
జాలర్లుగా మారుతున్నారు.
రేపటి తరం తరతరాలకు
నాశన వారధిగా నిలువబోతున్నారు
మొన్నటి తరం నిన్నటి తరానీ...

నిన్నటి తరం నేటి తరాన్నీ... ఇలా
తరతరాలుగా తన వారసులను
స్వార్థంతో చీకటి కూపంలోకి చిమ్ముతున్నారు
మానవతను మసి జేస్తున్నారు.



ఎంసెట్,ఐఐటి కంప్యూటర్ కల్లోలంలో
మైండ్‌సెట్‌లు మరిగిపోయి మారిపోతున్నాయి
సమాజ పౌరుల తయారీ తరిగి పోతూంది
మానవత్వం పిచ్చి తల్లిలా బిక్కమొఖంతో
పీక్కుపోతూంది.

పాఠశాల పానుపు కింద
చీకటి కూప నిర్మాణం
చురుకు చురుకుగా సాగుతూంది
అడ్డుగా నిలుస్తారో ఆహుతులౌతారో

నిర్ణయం మనది!
ఫలితం తరతరాలది!!

# చెక్కు ఇచ్చువాడు

◆ కథ



**అ**ది సారవంతమైన న్యాయస్థానం. బయట "సైలెన్స్ సైలెన్స్" అంటూ కోర్టు అటెండర్లు కక్షిదార్లను హెచ్చరిస్తున్నారు. అంతేగాదు మీ సెల్ ఫోన్స్ ఆఫ్ చేసుకోండి. కోర్టు లోపల మోగితే జుల్మాన కట్టాల్సి ఉంటుందని కూడా హెచ్చరిస్తున్నారు. ఆ రోజు కక్షిదారులు ఎక్కువగా ఉన్నారు.

■ కొలనుపాక మురళీధర్ రావు

**మూ**డు కోర్టులకు ఇన్‌ఛార్జి కాబోలు కొంతమంది న్యాయవాదులు తమ కక్షిదార్లకు, సాక్షులకు తర్ఫీదు ఇస్తున్నారు. హడావిడిగ కోర్టు పక్షులకు ఇది మామూలూ అయినా బోనులో నిలబడి సాక్ష్యం చెప్పాలంటే బెరుకుగా, కంగారుగ ఉంటుంది. బయట 'కాజ్ లిస్ట్' ఆ రోజు కేసుల వివరాలు తెలిపే పట్టిక అప్పుడే పెట్టారు. హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్నట్టుగా తమ కేసుల నంబర్లు చూసుకుంటున్నారు. కక్షిదార్లు, న్యాయవాద గుమస్తాలు, మరికొందరు న్యాయవాదులు. కొంతమంది ముఖాలలో ఆదుర్ధ, కంగారు కనబడుతూంది. పోలీసువాళ్ళు అండర్ ట్రయల్ ప్రిజనర్స్‌ని తీసుకొస్తున్నారు. జనం ఎక్కువ అయినారు కోర్టు హాలు చిన్నదిగ ఉండటం వల్ల అందులో న్యాయవాదులకు కూడా తగినన్ని కుర్చీలు లేకపోవడం వల్ల బయటనే నిలబడినారు. ఛేంబర్‌లో మెజిస్ట్రేట్ గారు స్టెనోకు డిక్టేట్ చేయిస్తున్నారు.

ఇంతలో బెంచి క్లర్కు వచ్చాడు. "హుష్షార్" అని బిగ్గరగా అటెండర్ కేక వేశాడు. ఛేంబర్‌లో నుండి మెజిస్ట్రేట్ గారు వచ్చి ఆసీనులుగాగానే గౌరవంగా లేచి నిలబడిన న్యాయవాదులు, కక్షిదార్లు తమ తమ స్థానాల్లో కూర్చున్నారు. పోలీసువాళ్ళు ఒక్కొక్కరిని లోపలికి హాజరు పెడుతున్నారు. బెంచి క్లర్క్ కేసు నంబరు చెప్పి ఫైలు మెజిస్ట్రేట్ గారికి అందచేయగ "ఏం నేరం చేశావా?" అడిగారు, తప్పయింది నల్లాల కాడ తిట్టిన, కొట్టిన ఇంకొక ఆడామెను పోలీసు లోపలికి పంపించాడు.

"ఏం నేరం చేశావా?" ఆమె తిడితే నేను ఊరుకుంటానా?ఆమె కొడితె నేను కొట్టాను" సమాధానం వచ్చింది.

ఈలాంటి పెట్టీ కేసులను మీ స్టేషన్లోనే విచారించి ఫైను వేయడమో లేదా తగు చర్య తీసుకోవచ్చుగా, కోర్టు టైం వేస్టు విసుగుతున్నారు.

ఎవరు మాట్లాడలేదు

మీ ఇద్దరికి రెండు వందల రూపాయలు"జుల్మానా వేస్తున్నా" లేకుంటే వారం రోజులు జైలు. మెజిస్ట్రేట్ గారి హుకూం.

బెంచి క్లర్కు డబ్బులు తీసుకొని వాళ్ళను వదిలిపెట్టి ఫైను రశీదు ఇస్తూ, మరొక్కసారి వస్తే ఏకంగా జైల్లోనే ఉంటారు తెలుసా? మెజిస్ట్రేట్ హెచ్చరిక.

తప్పైంది, మళ్ళీనేరం చేయం, వస్తాం, అన్నారు ముద్దాయిలు.

మళ్ళీ వస్తారా! రాము, రాము అంటూ వెళ్ళారు.

ఆ తరువాత మరికొంతమంది ఆడవాళ్ళను మొగవాళ్ళను పట్టుక వచ్చి కోర్టులో హాజరు పరిచారు.

డాబాలో, లాడ్జీలో వ్యభిచారం చేస్తుంటే పట్టుకొచ్చినాం అంటూ ఖడక్ సెల్యూట్ కొట్టి మెజిస్ట్రేట్ గారికి విన్నవించుకున్నాడు. కోర్టు కానిస్టేబుల్ మరియు యాదగిరిగుట్ట, చిట్యాల పోలీసు స్టేషన్లు వాళ్ళు భువనగిరి, రామన్నపేట మెజిస్ట్రేట్ గారు సెలవు పెట్టారట. ఇన్‌ఛార్జి నల్లగొండ మున్సిఫ్ మెజిస్ట్రేట్ గారు చాలా సీరియస్ కేసులు విచారిస్తున్నారు. ఇంతలో కోర్టు హాలులో సెల్ మోగింది. వెంటనే అటెండర్ కక్షిదారు నుండి, ఒక సాక్షి నుండి సెల్‌ఫోన్లు తీసుకొని మెజిస్ట్రేట్ గార్కి ఇచ్చారు. ఫోను స్వంతదార్లు కిమ్మనకుండా నిలబడ్డారు. అటెండరు ఇద్దరికి ఫైను వందలు కట్టమని చెప్పగా వారిద్దరు వెంటనే జరిమానా కట్టివేశారు. బయట కోర్టు సిబ్బంది



Text.pmd 36 2/28/2009, 6:15 PM

హెచ్చరించినా గోడలపైన హెచ్చరికలు రాయించినా మీకు ఏమాత్రం బాధ్యత తెలియదు. చదువుకొని ఏం లాభం. మెత్తగా చివాట్లు వేశారు మెజిస్ట్రేట్ గారు.

మరో కేసు పిలిచారు అది చెల్లని చెక్కు కేసు. చెక్కు తీసుకున్న వారి ఫిర్యాదు విన్నారు. ఏమో నీవు చూస్తే బాగా చదువుకున్న వాడిలా వున్నావు. బ్యాంకులో డబ్బు ఉన్నది లేనిది చూసుకొని చెక్కు ఇవ్వవద్దా అడిగారు ముద్దాయిని. మాట్లాడలేదు. "నేను వాడికి అప్పిచ్చి రెండేళ్ళు దాటింది సార్, ఎన్నిసార్లు ఇదిగో అంటున్నాడు గట్టిగా అడిగేసరికి నా దగ్గర క్యాష్ లేదు పోస్టు డేట్ చెక్కు ఇస్తాను. నీ ఇష్టం అంతే అన్నాడు. చచ్చినోని పెళ్ళికి వచ్చిందే చాలు అనుకొని ఒప్పుకున్నాను సార్ అన్నాడు ఫిర్యాదు చేసిన వ్యక్తి. పోస్ట్ డేట్ ఇచ్చిన చెక్ తీసుకొని తారీఖు కాగానే బ్యాంకులో ఇచ్చిన సార్. అప్పటికి ఖాతాలో డబ్బు లేదని వాపసు ఇచ్చిన్రు. మళ్ళీ పదిహేను రోజుల తరువాత మళ్ళీ బ్యాంకులో ఇచ్చినాను. తిరిగి అదే పరిస్థితి. నేను వెంటనే అతని ఇంటికి వెళ్ళి అడిగినాను. నిన్నెవరు బ్యాంకుకు పొమ్మన్నారు? నేనే నీ పైకం పూలల్లో పెట్టి ఇచ్చేవాడిని కదా వ్యంగమో మరి ఏమో నాతో అన్నాడు.



"ఇంకా ఎన్నాళ్ళు ఆగాలి, నాకిప్పుడే కావాలి" అన్నా.

"నీకు చెక్కు ఇచ్చిన గదా! ఏం చేసుకుంటావో చేసుకో ఫో " అని ఇంకా బూతులు మాట్లాడుతు వెళ్ళిపోయిండు సార్.

ఇంక ఆగలేక కోర్టులో కేసు వేసిన. విన్నవించుకున్నాడు, అప్పుయిచ్చిన తప్పుకు.

రేపు నీ కేసు పూర్తిగ విచారిస్తా. రేపు ఇద్దరు రాండి. నెక్స్ట్ అన్నారు. కొన్ని సారా కేసులు పిలిచి శిక్షలు, జుల్మానాలు వేశారు. ఇరువై లీటర్ల దొంగసారా అమ్ముతున్నారని లైసెన్స్ లేకుండా బట్టీలు పెట్టారని.

నాకు విసుగు పుడుతూంది. ఏదో మా స్నేహితుని కేసులో నన్ను సాక్ష్యానికి రమ్మంటే వచ్చాను. నా స్నేహితుడు కూడా చెక్కు బాధితుడే.

లంచ్ అవర్ దాటిన తరువాత మా స్నేహితుని వకీలు గారు చెప్పడం వల్ల విసుగు పుట్టింది. అంతా టైం వేస్ట్ అనుకున్నాను. ఈ రోజు అంతా కోర్టుకే అంకితం అనుకుంటూ బయట క్యాంటీనులో వేడి వేడి సమోసాలు తిని ఛాయ్ తాగి వచ్చి కూర్చున్నాం. మళ్ళీ మధ్యాహ్నాం అదే తంతు. కేసులు పిలవడం తారీఖులు చెప్పడం దాదాపు ఐదు గంటలకు మా స్నేహితుని కేసు పిలిచారు.

"దేవుని సాక్షిగా అంతా నిజమే చెబుతా, అబద్దం చెప్పను' అని నాతో ప్రయాణం చేయించుకున్నారు బంట్రోతు.

టీవిలో, సినిమాలోనే చూసిన కోర్టు సీనుకు ఇక్కడి వాతావరణానికి ఎంతో తేడా ఉంది. టీవిలో, సినిమాల్లో వాస్తవానికి విరుద్ధంగా చూపిస్తున్నారని తెల్సింది అప్పుడు.

ఇంతలో ఎదుటి న్యాయవాది నన్ను క్రాస్ ఎగ్జామ్ చేస్తారని చెప్పారు. ఈలోగా ఆ వకీలు గారి  చెవిలో చెక్కు యిచ్చిన శేఖరు ఏదో చెప్పినట్టుంది.

యువరానర్ ! మేము లోక్ అదాలత్‌లో సెటిల్ చేసుకుంటాం. టైం ఇవ్వండి. మెజిస్ట్రేట్ గారిని అడిగారు.

"మా వకీలు గారు ఇప్పటికే ఆలస్యమైంది, మూడు ఏళ్ళు దాటిపోవాలని చూస్తున్నారు. అతను ప్రభుత్వ ఉద్యోగి, ఖానూన్ తెల్సికూడా వాయిదా కోరుతున్నాడు" అన్నాడు మా స్నేహితుని తరపు లాయరు.

ఒక్క అవకాశం ఇద్దాం. తారీఖు నిర్ణయించి ఆ తారీఖు లోపల కేసు ఐపోవాలి. లేదంటే మళ్ళీ మొదటికి వస్తుంది నీ కథ. అని శేఖర్ను హెచ్చరిస్తూ మరో తేదికి కేసు వాయిదా వేశారు జడ్జీగారు.

మా స్నేహితుడు నా ముఖం మరి అతని వకీలు సాబు ముఖం చూస్తున్నాడు. మెజిస్ట్రేట్ గారు  చెప్పినట్టు వింటే మనకే లాభం, కంగారు పడొద్దని భరోసా యిచ్చాడు.

నాకు తలనొప్పి మొదలైంది. రోజంతా కోర్టులో కూర్చోవడం వల్ల అలవాటు లేని వాతావరణం వల్ల చికాకుగా ఉంది. ఏదో స్నేహితునికి సహాయం చేయాలని వస్తే నా తల బొప్పి కట్టినంత పనైంది. అందుకే కాబోలు 'కోర్టుకు ఎక్కినవాడు గాడిదనెక్కినవాడు' అన్నాడట ఓ పెద్దమనిషి. నాకైతే మొత్తానికి ఆ రోజు అంతా టైం వేస్టైంది. ఇంతలో శేఖరు కేసులాంటిదే పిలిచారు. శేఖరు కూడా కోర్టు హాల్లోనే కూర్చున్నాడు. కేసు నెంబర్ సి.సి. 420/ అని పిలిచి ముద్దాయి సంతోష్ అంటూ కేక వేశాడు బంట్రోతు. సంతోష్ కోర్టులో వచ్చి నిలబడి వాడు "నీపై కేసు రుజువైంది' నీవు ఇచ్చిన చెక్కు బౌన్సు అయింది. అంటే చెల్లలేదు. ఫిర్యాదు దారునికి రూ. 25,000/ –, ఐదువేలు నష్టపరిహారం, కోర్టు ఖర్చులు ఐదువేల రూపాయలు మరి నీకు ఏడాది జైలు శిక్ష అంటూ తీర్పునిచ్చి లోపలికి వెళ్ళారు జడ్జీగారు. శేఖరు ముఖంలో అలజడి, ఆందోళన భావాలు నాకు కనబడినాయి. మా వకీలు గారితో 'అతి త్వరలో కేసు రాజీపడతాం' అంటూ తలవంచుకొని బయటకు వెళ్ళాడు.

"కోర్టువారి తీర్పు రేపు తనకు అన్వయిస్తుందనుకున్నాడో ఏమో. అన్నాను మెల్లగా. నా మిత్రునితో మరి వారి లాయర్‌గారితో 'లెటజ్ వెయిట్ అండ్ సీ' అంటూ తాను బయటకు వెళ్ళాడు.

"చెల్లని చెక్కిచ్చువాడు, ఇలలో ఖలుడు ఫలితమనుభవించు, జైలు శిక్ష పొందు తథ్యము సుమతి" ఒకప్పటి మాట గుర్తొచ్చింది. ఆ ఒక్కరోజు కోర్టు అనుభవం వల్ల నేను నేర్చుకున్నది చాలా. సాధ్యమైనంత వరకు కోర్టు మెట్టు ఎక్కకూడదూ బాబూ అనుకుంటూ నా మిత్రునితో బయటకు వచ్చాను. ●



Text.pmd 37 2/28/2009, 6:15 PM

## నచ్చిన పుస్తకం

# అక్షరాల పూలుపూచిన సుద్దముక్క

**మద్దికుంట లక్ష్మణ్**

నలిమెల భాస్కర్ భాషావేత్తగా అందరికి తెలుసు. మంచికవిగా కథకునిగా కొందరికి మాత్రమే తెలుసు. వ్యక్తిగా భాస్కర్ ఎక్కడా రాజీపడనివాడు. ఆయన కవిత్వపు అద్దంలో ఆయన జీవితమే ప్రతిబింబిస్తుంది. విద్యార్థి దశనుంచే ఉధ్యమాలతో మమేకమై ఆదర్శజీవితం గడుపుతున్నాడు. జీవితాన్ని, వృత్తిని తక్కట్లో తూచినట్టు వెలువరించిన కవితా సంకలనం సుద్దముక్క

కవిగా భాస్కర్ బలమైన భూమికతో మొదలయ్యాడు. 'ముక్కు ఉక్కులా తయారవ్వనంత కాలం ఈకల్లో బాకులు మొలవనంత కాలం కోడి మెడ పిల్లికి సరదా' అంటూ దిక్కార స్వరాన్ని నేర్పుతాడు.

వృత్తిరిత్యా ఉపాధ్యాయుడైన భాస్కర్ వృత్తిలోని సాధక బాధకాలను 'అక్షరప్రాశన'లో వివరిస్తూ ఉపాధ్యాయున్న జాతికి మూల స్థంభంతో పోలుస్తూ ఈ దేశంలో నిర్లక్ష్యంగా మూలకు విసిరివేయ బడిన స్థంబాలన్ని మూలస్థంబాలని చమత్కారంగా నిరసన తెలియజేస్తాడు.

సుద్దముక్కలో పేరుకు తగ్గట్టుగా వృత్తిలోని నిబద్ధతను చెప్పే కవితలే ఎక్కువగా వున్నాయి. పగలి తల్లిదండ్రులను విడిచివచ్చిన విద్యార్థిని సిద్ధార్థునిగా చేసే బోధివృక్షంగా ఉపాధ్యాయున్ని సంభోదిస్తాడు. తరగతి గదిని అందమైన తోటతో పోల్చి సుద్దముక్కలను మొలిపిస్తాడు. బడిని గుడిగా అమ్మ ఒడిగా అభివర్ణిస్తూ మానవాలికే కాదు గ్రహాంతర వాసులకు కూడా దాన్ని దర్శనీయ స్థలం చేస్తాడు. ఇది ఒక గొప్ప దృశ్యీకరణ. అక్షరాన్ని లక్ష మెదళ్ళకు కదలిక చేసిన సిరాచుక్కను కాళోజికంటితో పోలుస్తూ అక్షర సేద్యం చేయిస్తాడు. కాగితం నేలమీద అక్షర బీజాల్ని చల్లుతున్న రైతన్న హస్తమే కలమని కవిని మార్మికంగా కార్మికున్ని చేస్తాడు.

భాస్కర్ రైతు బిడ్డ అంతకుమించి మట్టివాసనకు మరిగిన వాడు. మనసుకంటితో మనుషులను చూసినవాడు. అందుకే ఆయనకు చెప్పులుకుట్టేవాడు గాయపడ్డ పక్షిని చేరదీసే గౌతమునిగా కనిపిస్తాడు. మైలబట్టల్ని మల్లెపువ్వులను చేసే చాకలి ఓ సంస్కర్తలా దర్శనమిస్తాడు. మార్బుల్ మీద నడుస్తున్నా పాదాలు మట్ట స్పర్శను మరిచిపోలేదు. అందుకే మన పిల్లల్ని మట్టి అంటేలా పెంచమంటాడు తీరని దుఃఖ కవిత చదువుతుంటే మన కడుపుల పేగులు కదిలి కంటికి నీళ్లువస్తాయి.




కవికి కవిత్వం రాయడమంటే సేద్యం చేయడమన్నట్టే! సేధ్యంలో కవత్వపు పరిమళాన్ని ఆస్వాదిస్తాడు. చెట్టుచుట్టూ పాదు తవ్వి నీళ్లు పోస్తుంటే కవిత్వం రాసినంతగా సంతోషపడి నాట్లు వేస్తున్న గుంపులో కవిసమ్మేలనాన్ని చూస్తాడు. విరగబూసన ప్రతీ చెట్టు అతనికి మల్టికలర్ కవితా పుస్తకంలానే కనిపిస్తుంది.

భాస్కర్ భాషాశాస్త్ర వేత్త. ఆయన ప్రచురించిన తెలంగాణ పదకోశం తెలంగాణ వాళ్లకు గోప్ప నిఘంటువు. పదాల పుట్టు పూర్వోత్తరాలు తెలిసినవాడు. అందుకే భాష, యాసరుచిని చూపిస్తూ మీరు గాబరా పడితే మేము గావరగావరయితం. మీరు రండి అంటే మేము రాంధ్రి అంటం అని నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ భాషను నెత్తినెత్తుకుంటూ అర్థాలన్నీ ఒకటే అయి అంతరాలన్నీ ఒకటే అయినప్పుడు మీది భాషా ఎందుకయింది మాది యాస ఎందుకయింది. అని నిలదీస్తాడు.

తెలంగాణ వెనుక బాటుతనాన్ని బలంగా ప్రశ్నిస్తున్న భాస్కర్ ఫ్లోరైడ్ అంటే నీటిఫ్లో మీకురోగాలరైడ్ మాకు అని పాలకుల నిగ్గు దేలుస్తాడు.

కళ్ళు ఈరేడులోకాల వాకిళ్ళు. ఏడేడు పద్నాలుగు భాషలను ఒడిసిపట్టుకున్న భాస్కర్ పుస్తకాల పురుగు. కాని పుస్తకాలే పురుగులై కంటికి గ్లకోమాను తగిలించుకున్నాడు. మల్లెపూలను గులకరాళ్లతో నలుపుతున్నట్టు మంటలు పోట్లు భరిస్తున్నవాడు. అయినా తన రెండు కళ్లు తుమ్మెదలై పుస్తకాల మీద వాలితే ఎంత బాగుంటుందని కవిత్వంలో కలగంటూ మనకంట నీరు పెట్టిస్తాడు. సుద్దముక్క జీవితంలోని చలనశీలతను కవిలోని అంతర్మదనాన్ని ఆర్తిగా ఆవిష్కరించింది. ●




**శ్రీ శ్రీ సంస్మరణ**

అక్షరాన్ని లయబద్ధంగా, శబ్దబంధంగా జన హృద్యంగా భావోద్వేగంగా చెప్పడంలో మహాకవి శ్రీశ్రీని మించిన వారు లేరు.

సరిగ్గా ఇదే భావాన్ని అమరులైన శ్రీశ్రీ సమకాలికులైన 25 మంది సాహితీ వేత్తలు శ్రీశ్రీ ప్రతిభా పాటవాన్ని ప్రశంసించిన దాఖలాలతో, 25 మంది చిత్రకారుల శ్రీశ్రీ చిత్రాలతో 25 మినీ కవితలతో **శ్రీశ్రీ సంస్మరణ** రూపొందింది. దాదాపు ఐదు దశాబ్దాల పత్రికల్లోని సాహిత్య సాగరాన్ని శోధించి మధించి గుదిగుచ్చి శ్రీశ్రీ సంస్మరణగా వెలువరించిన శ్రీశ్రీ సాహిత్యనిధిని అంతా అభినందించి తీరవల్సిందే!

ఇది నాటి తరం మేటి సమర్థుల ప్రశంస. నేటి తరానికి స్ఫూర్తి బావుటా. అక్షరాన్ని ఆయుధంగా కవిత్వాన్ని ఖడ్గంగా మలచిన సమర యోధునికి నీరాజనం. కలం పట్టిన ప్రతీవాడూ ఎన్నదగి చదవదగ్గది. తెలుసుకొనదగ్గది.

**వి. సూర్యారావు**




Text.pmd 38 2/28/2009, 6:15 PM

## వర్తమానం

# కాషాయ మూకల ఫాసిస్టు చర్యలు

**పబ్ సంస్కృతి, వలెంటైన్స్‌డే, తమ మధ్య వున్న అనురాగాన్ని బహిరంగంగా ప్రదర్శించటం, పబ్‌లు, క్లబ్‌లలో మద్యపానం వంటివి పురుషులు చేస్తే దాని దృష్టిలో తప్పుకాదు. ఆ పని మహిళలు చేస్తేనే నేరం, ఘోరం అన్నట్లు మాట్లాడుతోంది. ఇలాంటి వాటిల్లో మహిళలే దోషులా? నిజానికి శ్రీరామ సేన వంటి సంస్థలు సాగించే దాడుల్లో సంస్కృతికి సంబంధించిన అంశాలేమీ ఉండవు. ప్రాచీన కాలం నాటి పురుషాధిపత్య ధోరణులనే వారు ప్రదర్శిస్తున్నారు.**



■ కల్పనా శర్మ

ఇటీవల మంగుళూరు పబ్‌లో ఐదుగురు మహిళలపై శ్రీరామ సేన సాగించిన దౌర్జన్యాన్ని కేవలం ఆ ఐదుగురు మహిళలపైనే కాక యావత్ స్త్రీలోకంపై చేసిన దాడిగానే భావించాలి. అంతేకాదు భారతీయ సమాజంపైనా, భారతీయ 'సంస్కృతి' (దీనిని ఎలా నిర్వచించినప్పటికీ) పైనా జరిగిన దాడిగానే భావించాల్సి ఉంటుంది. టెలివిజన్ ఛానెల్స్ ద్వారా శ్రీరామ సేన దుర్మార్గాన్ని ప్రజలు గ్రహించారు. కాషాయ దుస్తులు ధరించిన దుండగులు ఆడవాళ్ళను జుట్టుపట్టుకుని ఈడ్చుకొచ్చి నేలపై పడవేసి నానారకాలుగా అవమానించారు. ఏమాత్రం భయసంకోచాలు లేకుండా వారీ ఆకృత్యానికి పాల్పడ్డారు. వీరి ఆటవిక చర్యపై మహిళా సంఘాలతో పాటు ఇతరులు కూడా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అలానే 'భారతీయ సంస్కృతి' అన్న మాట వినటంతోనే 'ఉదారవాద' రాజకీయవేత్తలుగా ముద్రవేసుకున్న వారు సైతం మౌనాన్ని పాటించడాన్ని కూడా మనం చూశాము. ఉదాహరణకు రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌ను ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. మంగుళూరు దుర్ఘటనపట్ల ఆయన విచిత్రమైన రీతిలో స్పందించారు.

మహిళలపై ఇలాంటి దాడులు జరగటం ఇదే మొదటిసారి కాదు. కర్ణాటకలోని మంగుళూరులోనూ దాని పరిసర ప్రాంతాలలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలోనూ గతంలో పలుమార్లు ఇలాంటి దౌర్జన్యాలు జరిగాయి. ఇలాంటి సంఘటనలు మన సమాజం గురించీ, మన పాలక వ్యవస్థ గురించీ, మన రాజకీయాల గురించీ ఏమి చెపుతున్నాయన్న విషయాన్ని ఈ సందర్భంగా మనం ఆలోచించాల్సిన అవసరముంది.

'సంప్రదాయాలనూ, సాంస్కృతిక విలువలనూ పరిరక్షించ వలసిన బాధ్యతను వయోభేదంతో నిమిత్తం లేకుండా కేవలం స్త్రీలపై మాత్రమే ఎందుకు ఉంచుతున్నట్లు? 'సంస్కృతి' దిగజారటానికి పురుషులు వారి ప్రవర్తన ఎంతమాత్రం కారణంగా ఉండదా? 'హిందూ' లేదా 'భారతీయ' సంస్కృతిలోని ఏ అంశాన్ని కాపాడాలని శ్రీరామ సేనకు చెందిన మగవాళ్ళు కోరుతున్నారు? స్త్రీలను బహిరంగంగా కొట్టటం, అవమానించడం భారతీయ సంస్కృతి కిందకు వస్తుందా? పరాయి కులానికి లేదా మతానికి చెందిన వారిని వివాహమాడాలనుకున్న యువతులను చంపివేయటాన్ని భారతీయ సంస్కృతిగా భావించాలా? అడిగినంత కట్నం ఇవ్వలేదన్న కక్షతో స్త్రీలను చిత్రహింసల పాల్జేసి చంపివేయటం కూడా భారతీయ సంస్కృతేనా? బాల్య వివాహాలు వంటి తిరోగమన సంప్రదాయాలను వ్యతిరేకించిన దళిత మహిళపై మూకుమ్మడి మానభంగాలు చేయటాన్ని భారతీయ సంస్కృతి అని అందామా? ప్రసవ సమయంలో పలువురు తల్లులు చనిపోతుంటే సమాజంలోని అసమానతలపట్ల నిరాసక్తంగా ఉండటం కూడా భారతీయ సంస్కృతేనా?

తమ దాడులను సమర్థించుకోవడానికి కాషాయ మూకలు చూపే సాకులు బూజుపట్టిన దాని ఛ్యూడలిస్టు, ఫాసిస్టు తత్వాన్ని నగ్నంగా బయటపెడుతున్నాయి. పబ్ సంస్కృతి, వలెంటైన్స్‌డే, తమ మధ్య వున్న అనురాగాన్ని బహిరంగంగా ప్రదర్శించటం, పబ్‌లు, క్లబ్‌లలో మద్యపానం వంటివి పురుషులు చేస్తే దాని దృష్టిలో తప్పుకాదు. ఆ పని మహిళలు చేస్తేనే నేరం, ఘోరం అన్నట్లు మాట్లాడుతోంది. ఇలాంటి వాటిల్లో మహిళలే దోషులా? నిజానికి శ్రీరామ సేన వంటి సంస్థలు సాగించే దాడుల్లో సంస్కృతికి సంబంధించిన అంశాలేమీ ఉండవు. ప్రాచీన కాలం నాటి పురుషాధిపత్య ధోరణులనే వారు ప్రదర్శిస్తున్నారు. ప్రత్యేకించి స్త్రీలపై పితృస్వామ్య విలువలను రుద్దాలని చూస్తున్నారు. మన దేశంలోని స్త్రీలు విద్యావంతులై, ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుని, స్వతంత్రులుగా మెలగుతున్నారు. ఈ పరిస్థితి ఎక్కడో పెద్దపెద్ద పట్టణాలలోనే కాక గ్రామీణ ప్రాంతాలలో సైతం కనిపిస్తున్నది. ఈ మార్పు మన దేశంలోని తాలిబాన్లకు చెమటలు పట్టిస్తున్నది. అందుకే వారు నిగ్రహాన్ని కోల్పోతున్నారు. తమ అసహనాన్ని బహిరంగంగానే వెళ్ళగక్కుతున్నారు. స్త్రీలపై హింసకు దిగుతున్నారు.

బడి చదువులకు మధ్యలోనే ఎగనామం పెట్టిన 40 ఏళ్ళ ప్రవీణ్ వాల్కే తన తోటివారితో కలిసి శ్రీరామ సేనను స్థాపించాడు. స్త్రీల గురించి అతగాడి ఆలోచనలేమిటో ఈ నెల 3వ తేదీనాటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో వచ్చిన వార్తను చూస్తే తెలుస్తుంది. "ఆడపిల్లలు పబ్‌లకు ఎందుకు వెళ్ళాలి? తమకు కాబోయే భర్తలకు మద్యం అందించటానికి వెళ్తున్నారా? వాళ్ల చపాతీలు చేయటం నేర్చుకోగూడదూ? బార్‌లు, పబ్‌లు కేవలం మగవారికి మాత్రమే. మంగుళూరులోని ఆడవాళ్ళందరూ సాయంకాలం 7 గంటలకే ఇళ్ళ దగ్గర ఉండాలని మేము కోరుకుంటున్నాము" ఇదీ అతగాడి ఆలోచనా ధోరణి.



Text.pmd 39 2/28/2009, 6:15 PM

# సంగమం సమరం

**ఇందు**



ప్రకృతి వరం కూనవరం
శబరీ గోదావరి సంగమం
అందం ఆనందం
ఆంధ్రాకాశ్మీరం
అందరికుపకారం 'న్యాయ ప్రకారం'
అదే నేర్పింది 'శబరి నైజం'
గిరిజన ప్రజల అమాయకత్వం
పురజనుల నిండు మనుషులతత్వం
దొంగలు–దొరలు లేని సమాజం
దోచును మనసులు ఇది నిజం నిజం
మామూలు మనిషి 'మనీషై' పుట్టి
బ్రహ్మగ మారిందిక్కడ
మానవ విలువలు పుట్టిందిక్కడ
ప్రేమను రాగాల పురిటిగడ్డ ఇది –
విప్లవాలకు ఓంకారమ్మిది
నిండుగా సాగే గోదావరితో –
అటు నిటు అందగ పాపికొండలు
జలజల పారే జలపాతాలు –
స్వతఃస్సిద్ధత అడవి అందాలు

ఆప్యాయత కురిపించే చెట్లు –
అనురాగం పంచిచ్చే గట్లు
నాగులు, చిరుతలు, గెంతేలేళ్ళు–
చిలుకా – గోరొంకల ముచ్చట్లు
జీవనరాగం పలుకుకోయిలలు–
పెనవేసుకున్న వనమాలికలు
ప్రతిఫలమడగక సిరి సంపద పెంచి –
సువాసనలిచ్చే సుగంధ పూలు
అవును ఇది నిజం విశ్వ జనసత్యం
ఇదే ఇదేలే ఆంధ్రా కాశ్మీరం
నిండుగ సాగే జీవనరాగపు
గొంతు నులిమే దుర్మార్గులు ఎవరో
గిరిజన పురజన సమాగమాన్ని
నాశనం చేసే నక్కలు ఎవరో
మానవ చరితను నాశనం చేసే
ఆ రాబందుల కూల్చండి.
లేవండి, లేచి పిడికిలి బిగించి
శంఖం పూరించి పోరాడండి
మన సంస్కృతులను కాపాడండి

మహిన ఇది చాటి చెప్పండి
అని ఘోషిస్తోంది పేరంట పల్లె
ఇక హద్దులు వద్దంది రేఖపల్లి–
దోపిడి దారుల నీలినీడలు
అంటరాదందీ శ్రీరామగిరి
లక్షల మనుషుల సమాధి చేసే
దుర్మార్గులను దునుమాడమంది
పిల్లా –జెల్లా గొడ్డూ గోదా–
రక్షించేందుకు రుద్రులై కదిలి
అడుగు అడుగునా సైనికులై పోరి
అడవి తల్లిని రక్షిద్దాం
మన భూమి కొఆకు మరణాన్నెదిరించి
మరో చరిత్రను సృష్టిద్దాం
శాంతి సౌఖ్యాలు ప్రతిష్టిద్దాం–
మన సాధికారతను సాదిద్దాం

---

సంస్కృతి గురించి గొంతు చించుకునే వాళ్ళ ఆలోచనలేమిటో పైమాటలు స్పష్టం చేస్తున్నాయి. ఆడవాళ్ళు ఇంటిలో కూర్చుని చపాతీలు చేయాలి. మగవాళ్ళు మాత్రం బజార్ల వెంబడి బలాదూరుగా తిరుగుతూ, పీకలదాకా తాగి, మానభంగాలు, మోసాలు, ఖూనీలు వగైరాలు చేస్తుంటారు. ఆ రకంగా మన 'సంస్కృతి' పదిలంగా ఉంటుంది. శ్రీరామ సేన అనేది ఉన్మాదుల సంస్థ. స్త్రీలు ఏమి చేయాలి. ఏమి చేయగూడదు అనే విషయాలను బోధించేందుకు చాలామందే ఉన్నారు. స్త్రీ స్వాతంత్ర్యమనగానే చాలామంది మగవాళ్ళు ఉలిక్కి పడతారు. ఎందుకంటే ఆడవాళ్ళు స్వతంత్రులైతే మగవాళ్ళ అధికారానికి సవాలు ఎదురవుతుందని వారి భయం. సెక్సు విషయంలో మహిళల స్వేచ్ఛ వాళ్ళకు మరింత భయం కల్గిస్తుంది. కనుకనే లైంగిక విషయాలలో స్త్రీలను అణచి ఉంచాలని వారు ప్రయత్నిస్తారు.

భారతీయ సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా మార్పులు వస్తున్న కొలదీ ఇలాంటి సేనలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. ఈ బాపతులన్నీ సంస్కృతి పేరుతో తమ దుర్మార్గాలను సాగిస్తుంటాయి. హిందూ, ఇండియన్ లేదా ప్రాంతీయాల పేరులతో ఇవి ఉనికిలోకి వస్తుంటాయి. 'మరాఠీ' సంస్కృతిని కాపాడాలని రాజ్ థాకరే కంకణం కట్టుకున్నాడు. ఏ పేరుతో పుట్టుకు వచ్చినప్పటికీ వారి కార్యక్రమాలన్నీ ఒకే రకమైనవి. బలహీనులపై దాడి చేయటం, ప్రసార మాధ్యమంలో స్థానాన్ని సంపాదించటం. వాల్కే ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పాడు. "మా వాళ్ళు పట్టపగలే టీవీ కెమెరాల ముందే దాడులు చేస్తారు. ఇలా చేస్తే యువతులు పబ్‌లో అడుగు పెట్టటానికి భయపడతారు. అప్పుడు మా లక్ష్యం నెరవేరుతుంది".

ఈ ఉన్మాదుల చర్యలను ప్రభుత్వాలు కళ్ళప్పగించి చూస్తున్నాయి. కర్ణాటకలోని బిజెపి ప్రభుత్వం తన వాళ్ళ ఆగడాలను పట్టించుకోవటం లేదు. పైగా తన స్థానాన్ని బలపరుచుకోవటానికి గాను ఈ మూకలపైనే అది ఆధారపడుతున్నది. మహారాష్ట్రలోని కాంగ్రెస్–ఎన్‌సిపీ ప్రభుత్వం సంగతేమిటి? అది ఎందుకని చేతులు ముడుచుకు కూర్చొంటున్నది. ముంబయిలో ఉగ్రవాదుల దాడి అనంతరం ఉగ్రవాదాన్ని అరికట్టటానికి గాను కఠిన చట్టాలు తీసుకురావాలని చాలామంది కోరుతున్నారు. మంచిదే, కాని స్థానికంగా భయోత్పాతాన్ని సృష్టిస్తున్న ముష్కరుల సంగతేమిటి? వారి విషయంలో కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం లేదా?

మంగుళూరు సంఘటన మన రాజకీయవాదుల తత్వాన్ని బయటపెట్టింది. ఎవరో కొంతమందిని మినహాయిస్తే ఎక్కువమంది ఈ ఘటనలపై స్పందించటానికి నిరాకరించారు. 'సంస్కృతి' పేరుతో సాగే ఈ అరాచకాలను వారు చూసీ చూడనట్లు వదిలి వేస్తున్నారు. ఈనాడు రాజకీయంగా, సామాజికంగా భారతీయ సమాజం అత్యంత కీలకదశలో ఉన్నది. అభివృద్ధి, విద్యా వ్యాసంగాలు లక్షలాది స్త్రీలకు స్వతంత్రతను ప్రసాదిస్తున్నాయి. శ్రీరామ సేన వంటివి ఈ పరిణామాన్ని వెనక్కు నెట్టాలని చూస్తున్నాయి. అభివృద్ధి ఫలాలు ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అందకుండా ఇవి అడ్డుపడుతున్నాయి. స్త్రీలు నాలుగు గోడల మధ్యనే ఉండాలని ఇవి కోరుతున్నాయి. ప్రజాస్వామ్యాన్నీ, లౌకికత్వాన్నీ ప్రేమించే వారందరికీ ఈ ధోరణులు ఎంతమాత్రం నచ్చవు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు. దీనిని మనందరం కాపాడుకోవాలి.

●



Text.pmd 40 2/28/2009, 6:15 PM

# స్లమ్‌డాగ్ మిలియనీర్ సామాజిక సారాంశం



■ వొరప్రసాద్

**ఈ విమర్శలన్నింటినీ అలా ఉంచితే, అసలు ఈ సినిమాలు కానీ, పుస్తకాలు కానీ వర్తమానపు భారతదేశాన్ని ఈ విధంగా చిత్రించటాన్ని ఎలా స్వీకరించాలి? అసలు ప్రస్తుతం మన దేశం అమెరికాతో దోస్తీ కట్టి అగ్రరాజ్యాల సరసన నిలచున్నామని, అపూర్వమైన రీతిలో అభివృద్ధి సాధించేశామని భావిస్తున్న సమయం ఇది. గత ఎన్‌డిఎ ప్రభుత్వం దగ్గర నుండి నేటి మన రాష్ట్ర ప్రభుత్వం వరకూ అభివృద్ధితో వెలిగించి వేస్తున్నామని ప్రకటనల పరంపరలు మనం చూశాం. చూస్తున్నాం.**

ప్రపంచ సినీ పరిశ్రమ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డులు అత్యంత ఉత్కంఠతల మధ్య వెలువడ్డాయి. భారతీయ కథాంశంతో తీయబడిన 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రం పది ఆస్కార్ అవార్డులకు నామినేట్ కావడంతో భారతదేశ ప్రజలలో మరింత ఉద్వేగం నిండుకుంది. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎనిమిది ఆస్కార్ అవార్డులు అందుకుని 'స్లమ్ డాగ్ మిలియనీర్' అందుకు తగ్గట్టుగానే విజయకేతనం ఎగురవేసింది. ఈ ఎనిమిందింటిలో భారత్‌కు చెందిన ఎ.ఆర్. రహమాన్‌కు రెండు రాగా, ఆ చిత్రంలోని జయహో పాట రచయిత గుల్జార్‌కు (జయహో పాటకు సంగీతం సమకూర్చిన ఎ.ఆర్. రహమాన్‌తో పంచుకున్నారు), సౌండ్ మిక్సింగ్ లో కేరళకు చెందిన రసూల్ పూకుట్టికి అవార్డులు దక్కాయి. ఆస్కార్ అవార్డుల ప్రకటన వెలువడటానికి ముందే 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రానికి అనేక అవార్డులు దక్కాయి. ఆస్కార్‌కు నామినేట్ కావడంతో ఈ చిత్రం మరింతగా ప్రాచుర్యం పొందింది. బ్రిటన్ దర్శక, నిర్మాతలు  రూపొందించిన ఈ చిత్రం కథాంశానికి సంబంధించి పలు విమర్శలకు లోనయ్యింది. ఆ విమర్శలు తమ పరిధిని పెంచుకుని మ్యాన్ బుకర్ ప్రైజ్ పొందిన అరవింద్ అడిగ 'వైట్ టైగర్' నవల వరకూ వ్యాపించాయి. ఈ సినిమాను విమర్శిస్తున్న వారి ముఖ్యమైన ఫిర్యాదు భారతదేశ పేదరికాన్ని ఈ సినిమాలు, నవలలు వ్యాపారం చేసుకుంటున్నాయని, అలాగే వాస్తవికత పేరుతో భారతదేశ దారిద్ర్యాన్ని తీవ్రమైన అవమానకరమైన రీతిలో ప్రతిబింబిస్తున్నారని వీరంతా భావిస్తున్నారు. ఇలాంటి సినిమాలకు అంతర్జాతీయ అవార్డులు ఇస్తూ తమ ఆధిపత్య భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని కూడా కొందరి అభిప్రాయంగా ఉంది.

ఈ విమర్శలన్నింటినీ అలా ఉంచితే, అసలు ఈ సినిమాలు కానీ, పుస్తకాలు కానీ వర్తమానపు భారతదేశాన్ని ఈ విధంగా చిత్రించటాన్ని ఎలా స్వీకరించాలి? అసలు ప్రస్తుతం మన దేశం అమెరికాతో దోస్తీ కట్టి అగ్రరాజ్యాల సరసన నిలచున్నామని, అపూర్వమైన రీతిలో అభివృద్ధి సాధించేశామని భావిస్తున్న సమయం ఇది. గత ఎన్‌డిఎ ప్రభుత్వం దగ్గర నుండి నేటి మన రాష్ట్ర ప్రభుత్వం వరకూ అభివృద్ధితో వెలిగించి వేస్తున్నామని ప్రకటనల పరంపరలు మనం చూశాం. చూస్తున్నాం. ఇవన్నిటినీ గమనిస్తున్నప్పుడు సాధారణ పౌరులకు అయోమయం తప్ప ఏం మిగలదు.

స్లమ్ డాగ్ మిలియనీర్ సినిమా దగ్గరకు వస్తే అసాంతం సినిమా చాలా ఉత్కంఠగా సాగుతుంది. ముంబయిలోని 'స్లమ్' ప్రాంతంలోని 'జమాల్' అనే కుర్రాడు ఒక టివి చానల్ నిర్వహించే 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్రమంలో పాల్గొంటాడు. పాల్గొనడమే కాకుండా వారడిగిన అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి రెండు కోట్ల రూపాయలు గెలుచుకుంటాడు. ముంబయి నగరంలోని 'గుడిసెవాడ'లో పెరిగి, అనాథగా మిగిలి ఒక కాల్ సెంటర్‌లో టీలు అందించే 'జమాల్' టివీ కార్యక్రమంలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం అందరిలో ఆశ్చర్యం కలిగిస్తుంది. టివీ నిర్వాహకులు ఒక ప్రశ్న మిగిలి ఉండగా 'జమాల్'ను మోసం చేస్తున్నాడని పోలీసులకు అప్పజెప్తారు. ఇంటరాగేషన్ చేసిన పోలీసులకు జమాల్ తన జీవిత సంఘటనలను వివరిస్తాడు. టివి చానెల్ లో అడిగిన ప్రశ్నలన్నింటికి ఆ సంఘటనల్లో సమాధానాలు ఉంటాయి. సినిమా మొత్తం టివి చానెల్ ప్రోగ్రాంలో అడిగే ప్రశ్నలకు సమాధానాలను సమకూర్చేవిధంగా రూపొందించబడింది. ఎక్కడా అసహజత్వం లేకుండా చాలా సహజంగా రూపొందించడంలో దర్శకత్వ ప్రతిభను అభినందించాల్సిందే. సినిమా చూసింతర్వాత కూడా ఆ ప్రశ్నల కోసం సినిమా కథ రూపొందించారు అని అన్పించదు. జమాల్ జీవితం కూడా అల్లకల్లోంగా ఉండి సినిమా చూస్తున్న వారిని ఉద్వేగానికి గురిచేస్తుంది. ఇంత ఆందోళనాకర జీవితంలో చాలా సహజంగా ప్రేమ అంశాన్ని జోడించడాన్ని మెచ్చుకోవాలి. 'జమాల్' తన ప్రేమకోసం పరితపించడాన్ని బాగా చూపించారు. జమాల్ టివి చానల్ ప్రోగ్రామ్ అవకాశాన్ని ప్రయత్నించడంలో కూడా 'తన ప్రియురాలు లతిక' ను కనుగొనడం కోసమే. పేదరిక జీవితం, మనస్సును కఠినం చేసే జీవిత సంఘటనలు మనుషుల స్వభావాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో దర్శకుడు సృజనాత్మకంగా ఆవిష్కరించాడు.

అయితే కొన్ని విపరీత సన్నివేశాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా జమాల్ తన అభిమాన నటుడు అమితాబ్ వస్తున్నాడన్న సంతోషంలో చెక్కల మరుగుదొడ్డిలోని మలం గుంటలోకి దూకి ఒంటినిండా అంటుకున్న మలంతోటే పరుగెత్తుకుని వెళ్ళి అమితాబ్ ఆటోగ్రాఫ్ తీసుకునే సన్నివేశం చాలా అసహ్యకరంగా ఉంది. అంత అవసరం లేదనిపిస్తుంది. అలాగే



Text.pmd 41 2/28/2009, 6:15 PM

శ్రీరాముడి కుడిచేతిలో ఏముంటుందనే ప్రశ్నకు సమాధానం కోసం హిందూ ముస్లింలు ఒకరినొకరు చంపుకునే విధ్వంసకాండను చూపడం కూడా అభ్యంతరకరంగానే ఉంది. ఇలాంటి అంశాలను దర్శకుడి విదేశీయతకు అపాదిస్తూ విమర్శలు వస్తున్నాయి. అయితే పైన పేర్కొన్నట్టుగా ప్రధానమైన విమర్శ పేదరికాన్ని చూపిస్తున్న తీరును గురించే. ఆ విధంగా పేదరికాన్ని చూపించడం ఎంతవరకు సమంజసం అని విమర్శకుల ప్రశ్న. అందులోనూ విదేశీ దర్శక, నిర్మాతల దృష్టి కోణాన్ని తప్పుపడుతున్నారు.

ఈ విమర్శలను వ్యతిరేకిస్తున్న మరికొంత మంది 'అరవింద అడిగె' నవల 'వైట్ టైగర్'ను ప్రస్తావిస్తూ దానిలోని వెనుకబాటుతనాన్ని దుర్భరంగా వ్యక్తీకరించింది భారతీయుడే కదా అంటున్నారు. నిజమే అరవింద్ అడిగె మీద కూడా విమర్శలొచ్చాయి. అంటే స్వదేశీ, విదేశీ అని కాకుండా అందరూ దారిద్ర్యం గురించి చెబుతున్నవారే. నిజానికి ఈ అంశాలను మనం ఎలా అర్థం చేసుకోవాలి. సినిమాలో గానీ, పుస్తకంలో గానీ వ్యక్తీకరించినట్లుగా దేశంలో పేదరికం లేదా? ఒకవేళ ఉన్నా అది ఈ విధంగా ప్రదర్శించే పద్ధతి బాగాలేదా? లోతుల్లోకి వెళితే సదరు అభివృద్ధిలోని మర్మం బయటపడుతుంది. నిజానికి అభివృద్ధి కొందరికే పరిమితం అయింది. అందులోనూ గొంతున్న వారికే అది అధికంగా చెందుతుంది కాబట్టి అలాంటి వారికి ఈ దరిద్రం అసహజంగా కనపడుతుందని భావించాలి.

దేశంలోని దారిద్ర్యం ఒక వాస్తవం కాగా దాని చిత్రీకరించిన సినిమాల పట్ల, వ్యక్తీకరించిన పుస్తకాల పట్ల అసహనాన్ని ప్రదర్శించడం సరైంది కాదు. వాస్తవానికి అభివృద్ధి చెందిన సమాజంతో పోలిస్తే అభివృద్ధి చెందని సమాజం పాలే ఎక్కువ. కానీ ప్రచార యుగంలో, వ్యాపార యుగంలో ఎక్కువది తక్కువగానూ తక్కువది ఎక్కువగానూ చూపించబడుతుంది. ఆ అభివృద్ధి ఎంత డొల్లతనం కలిగినదో వర్తమాన సంక్షోభాలు అద్దం పడుతున్నాయి. ఇలాంటి సందర్భంలో కూడా ఇంకా మనం ముసుగులు వేసుకుని చర్చిద్దామా? లేక అసమానతలు లేని సిసలైన అభివృద్ధి కోసం, దారిద్ర్య నిర్మూలన కోసం చర్చలు చేపడదామా? ఆత్మగౌరవం పేరుతో వాస్తవికతను ప్రతిబింబించిన చిత్రాన్ని అంగీకరించకపోవడం సరైందేనా? స్లమ్ డాగ్ మిలియనీర్ చిత్ర నిర్మాత, దర్శకులు విదేశీయులే. వారి దృష్టికోణంలో కొన్ని లోపాలు ఉండవచ్చు. అంతమాత్రాన అసలు విషయాన్ని మరుగుపరిచే విధంగా వారిపై విమర్శలు చేయడంతో సరిపెట్టడం కాదు. మనం చేయాల్సింది చాలా వుంది. మన నేలను మనం చదును చేసుకుందాం. అది ఎదుటివాడికి అవకాశం ఇవ్వనంతగా చేద్దాం. అంతేగాని అసహనాన్ని ప్రదర్శించడం అనేది సరైన స్పందన కాదు. సినిమాలో 'జమాల్' గుడిసెవాసుల ప్రతినిధి అయితే అదే చిత్రంలో జమాల్‌ను ఆటంకపరచడానికి ప్రయత్నించిన క్విజ్‌మాస్టర్, ఇన్‌స్పెక్టర్ పాత్రలు అభివృద్ధి చెందిన సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. జమాల్‌కి వారికీ మధ్య వ్యత్యాసం చాలా ఉంది. ఆ మధ్యలో జమాల్‌లే ఎక్కువ మంది ఉంటారు. క్విజ్ మాస్టర్‌లు, ఇన్‌స్పెక్టర్‌ల సంఖ్య చాలా స్వల్పం.

ఇక్కడ ఇంకొక సామాజిక రహస్యం ఉంది. జమాల్ ఈ పోటీలో గెలవడం అసంభవం అనే ఆధిపత్య ధోరణి. పోలీసుల చిత్రహింసలు దానికి ప్రతీక. రిజర్వేషన్లతో చిత్రానికి ఆరంభవాచకం. ప్రతిభను దెబ్బతీయవద్దనే అగ్రవర్ణ దురహంకారం దాంట్లో తొంగిచూస్తుంది. ఒకవేళ అంతర్జాతీయ అవార్డులు ఇవ్వడంలోనూ అలాంటి దృష్టికోణం వుంటే అదీ ఈ కోవకే చెందుతుంది. ఇంతకూ ఇండియాలో ఇలాటి దుర్భర జీవనం వుందా లేదా అనేదే అసలు ప్రశ్న. దీనికి రెండు జవాబులుండవు.

ఆస్కార్ అవార్డుల పంటతో 'స్లమ్ డాగ్ మిలియనీర్' ప్రపంచవ్యాప్తంగా మరింతగా చర్చకు నోచుకునే అవకాశం ఉంది. సినిమాలోని కథాంశాన్ని పక్కనపెడితే సాంకేతిక నైపుణ్యాల విషయంలో భారత సినిమా రంగ నిపుణులకు ఈ అవార్డులు గొప్ప స్ఫూర్తిని ఇస్తాయనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకుని సామర్థ్యాన్ని చాటుకోవడంలో భారతీయులు తక్కువేమీ కాదు అనేది కూడా ఈ సందర్భం చాటుతుంది. అన్నింటికీ మించి దారిద్ర్యం కథాంశం కాని విధంగా దేశ అభివృద్ధికి సంబంధించి ప్రతీ ఒక్కరూ కూడా దృష్టి సారించాల్సిన సమయం కూడా ఇదే. ప్రపంచ దేశాలకు మన దారిద్ర్యం వ్యాపారవస్తువు కావడం వల్ల బాధపడడం కన్నా మన దారిద్ర్యాన్ని ఎలా నిర్మూలించాలో ఆలోచించాల్సిన బాధ్యత మన అందరి మీదా ఉంది. ఈ అవార్డులకు, ఉత్సవాలకు తెరవెనుక ఎన్నో వ్యాపార ప్రయోజనాలు ఉంటాయి. అవార్డులు పొందడం ఆత్మగౌరవాన్ని ప్రతిఫలిస్తుంది, కానీ దేశంలోని దుర్భర దారిద్ర్యాన్ని నిర్మూలించలేదు. నగరాలలోని 'గుడిసె వాడ'లను తొలగించలేదు. అవి తొలగించటం దేశంలోని పౌరులందరూ సామాజిక చైతన్యాన్ని పొందినప్పుడే సాధ్యమవుతుంది. ఇలాంటి సినిమాలు, అవార్డులు ఇచ్చే స్ఫూర్తిని వ్యక్తిగత కెరీర్‌లకే పరిమితం చేసుకోకుండా సామాజిక కోణాన్ని కూడా పట్టించుకోవాల్సి ఉంది. స్వదేశం, విదేశం అని కాకుండా పేదరికం ఉన్నంత కాలం దాన్ని చూపిస్తూ వ్యాపారస్తులు డబ్బు చేసుకుంటారు. ఆ దృష్టిని మళ్ళించి నిజమైన దారిద్ర్య నిర్మూలనకు నడుం కట్టాల్సిన బాధ్యత సామాజిక బాధ్యత కలవారందరిపైనా ఉంది. అందరూ టివి క్విజ్ కార్యక్రమాల ద్వారా కోటీశ్వరులు కాలేరు. అలాంటి వాటి మీద భ్రమలు పెంచి దోపిడీ వర్గాలు తమ దోపిడీని కొనసాగిస్తాయి. ఇటువంటి భ్రమల్ని బద్దలుకొట్టే చైతన్యం ప్రజల్లో రావాల్సి ఉంది. ●

---

## జి.ఎన్. రెడ్డి పీఠికల కోసం విజ్ఞప్తి

ఆచార్య **జి.ఎన్. రెడ్డిగారు** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఆచార్యుడుగా, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడుగా, పరిశోధకులకు పర్యవేక్షకుడుగా ఉన్నారు. అనేక మంది పరిశోధకులకు, విమర్శకులకు, కవులకు, రచయితలకు వారి గ్రంథప్రచురణ సందర్భంలో విలువైన పీఠికలు రచించారు. వాటిని ఒక సంకలనంగా తీసుకురావడానికి సంకల్పించాను. ఆయనతో పీఠికలు రాయించుకున్నవారు వాటిని గురించి తెలిసిన వారు వారి పీఠికల ప్రతిని నా చిరునామాకు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. వాటి ఆచూకి తెలిపితే నేను సేకరించుకుంటాను.

**రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి,**
అధ్యక్షుడు, తెలుగు శాఖ
యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప, ఆంధ్రప్రదేశ్,
పిన్: 516 003, సెల్: 9440222117


Text.pmd 42 2/28/2009, 6:15 PM

## కథాపురస్కారం

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు తెలుగు కథ శతవార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ కథల పోటీలో మేరెడ్డి యాదగిరి రెడ్డి రాసిన 'కొలిమి' కథకు అంతర్జాతీయ కథా పురస్కారం లభించింది. ఫిబ్రవరి రెండున వంగూరి ఫౌండేషన్ వారు హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో యాదగిరి రెడ్డిని సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డా॥ సి.నారాయణ రెడ్డి, ఆవుల మంజులత, ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, వంగూరి చిట్టెన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



**అంతర్జాతీయ కథా పురస్కారాన్ని కథా రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డికి అందజేస్తున్న గొల్లపూడి మారుతీరావు, ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ, వంగూరి చిట్టెన్ రాజు**

## మా వేములవాడ కథలు ఆవిష్కరణ

ప్రముఖ కవి, కథకుడు, న్యాయమూర్తి రాజేందర్ జింబో రచించిన 'మా వేములవాడ కథలు' పుస్తకాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి ఫిబ్రవరి 2 న హైదరాబాద్‌లోని దోమలగూడలో ఎమెస్కో హౌస్‌లో ఆవిష్కరించారు.



**ఫొటోలో ఎమెస్కో విజయకుమార్, నందిని సిధారెడ్డి, మునిపల్లె రాజు, జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి, రాజేందర్ జింబో, వఝుల శివకుమార్**

ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకంలోని కథలు తన బాల్య స్మృతులను తట్టి లేపాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కథా రచయిత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మునిపల్లె రాజు మాట్లాడుతూ సజ్జనుడే మంచి సాహిత్యం సృష్టించగలరంటూ, అది అన్వయించగల వ్యక్తి ఈ కథల రచయిత జింబో అన్నారు. మంచి సాహిత్యం సమాజాన్ని ఓజోన్ పొరలాగ రక్షిస్తుందని ఆయన అన్నారు. ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి పుస్తక సమీక్ష చేస్తూ నేటి తరానికి బాల్యమే లేకుండా పోయిందన్నారు. గతాన్ని జ్ఞాపకం చేసుకోవడం ఒక అనుభూతి అని, వేములవాడని మనందరి ఊరుగా అనుభూతి చెందింపచేయడంలో జింబో కృతార్థుడైనాడని అన్నారు. మరోకవి వఝుల శివకుమార్ మాట్లాడుతూ జీవితంలోని అతిసాధారణ విషయాలను, అసాధారణమైన లోచూపుతో ప్రకటించిన అనుభవాలు 'మా వేములవాడ కథలు' అని చెప్పారు. కథా రచయిత జింబో స్పందిస్తూ ఈ కథల్లో తన బాల్య స్మృతులను నమోదు చేయడంతో పాటు నాటి మా ఊరు, నేటి నగరీకరణ పరిణామాలు కూడా ప్రస్తావించబడ్డాయన్నారు. ఎమెస్కో విజయకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలుగు కథానిక వందేళ్ళ వేడుకలు

వందేళ్ళ కథానిక వెయ్యేళ్ళు వర్ధిల్లాలంటూ దాదాపు 300ల మంది రచయిత, రచయిత్రులు ఫిబ్రవరి 7, 8 తేదీలలో విజయనగరంలో ఆధునిక తెలుగు కథానిక శతజయంతి ప్రారంభ సభలు నిర్వహించారు.

ఆధునిక కథానిక ఆద్యులు గురజాడ అప్పారావుగారు 1910 ఫిబ్రవరిలో వారి 'దిద్దుబాటు' కథానికతో సంపూర్ణ కథానిక ప్రక్రియ అవతరించింది. అందుకని గురజాడ వారి ఇంటిదగ్గర నుండి ఈ శతజయంతి ప్రారంభోత్సవాలను ప్రారంభించారు. గురజాడ వారి చిత్రపటాలను శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ వారు బహూకరించగా వాటిని పలుచోట్ల పుష్పాలతో అలంకరించారు. రచయితలు అనంతరం అందరూ గురజాడవారి కళ్ళజోడు, పుస్తకాలు, ఆయన వాడిన కుర్చీ, రైటింగ్ బల్లలను దర్శించారు. తదనంతరం ప్రముఖ కథారచయిత కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మునిపల్లె రాజు గారు కథానిక శతజయంతి చిహ్నమున్న హీలియం బెలూన్‌ను గాలిలోకి ఎగురవేయడంతో ఉత్సవాలకు నాందిపలికినట్లయ్యింది. మేళతాళాల మధ్య ప్రారంభమైన ఈ ఉత్సవంలో రచయితలు గురజాడ వారి ఇంటినుండి ఊరేగింపుగా బయలుదేరి పట్టణంలోని గురజాడవారి శిలావిగ్రహాన్ని పుష్పమాలలతో సత్కరించి గురజాడ సభామందిరానికి చేరుకున్నారు. అక్కడ వందమంది కథారచయితలు 100 బెలూన్లను గాలిలోకి విడిచిపెట్టడంతో ప్రారంభమైన వేడుకలు రెండవ రోజు పాలగుమ్మి పద్మరాజు వేదికమీద 100 మంది కథానిక రచయితలు, రచయిత్రులను సత్కరించడంతో ఘనంగా ముగిసింది.

ఈ రెండు రోజులు తొమ్మిది వేదికలతో 100 ఏళ్ళ కథానికను సమీక్షించుకుంటూనే భవిష్యత్తు దర్శనాన్ని చేశారు. రెండురోజులపాటు జరిగిన ఈ సభలో తొమ్మిది వేదికలున్నాయి. ఈ తొమ్మిది వేదికలకు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, కనపర్తి వరలక్ష్మమ్మ, సురవరం ప్రతాపరెడ్డి, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, మధురాంతకం రాజారాం, చాసో, వాకాటి పాండురంగారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, పాలగుమ్మి పద్మరాజు గార్ల పేర్లను పెట్టారు. ఈ వేదికలలో కథానికకు సంబంధించిన భిన్న కోణాలను చర్చించుకోవటమే కాకుండా 80 ఏళ్ళ పై బడిన మునిపల్లె రాజు, పోతుకూచి సాంబశివరావు, కాళీపట్నం రామారావు, గండికోట



Text.pmd 43 2/28/2009, 6:15 PM

బ్రహ్మోజీరావు, రావూరి భరద్వాజ లాంటి సీనియర్ రచయితల్ని ఒక్కొక్క వేదికలలో ఒక్కొక్కరికి కథా సరస్వతి సత్కారం చేశారు. అలాగే విహారి, గుత్తుల భాస్కరరావు, గన్ను కృష్ణమూర్తి, శ్రీవిరంచి లాంటి సీనియర్ రచయితలు కథానికా సంపుటాలను ఈ వేదికపై ఆవిష్కరించారు.



**విజయనగరంలో కథానిక శతజయంతి ప్రారంభోత్సవాల వేదిక మీద డా॥ వేదగిరి రాంబాబు, విహారి, మునిపల్లె రాజు, వీరాజి**

మొదటిరోజు సభ చివరలో గురజాడ అప్పారావుగారి 'దిద్దుబాటు' కథానికని తాడేపల్లి శర్మగారి దర్శకత్వంలో దృశ్యరూపంలో ప్రదర్శించారు. వందేళ్లనాటిదైనా ఈ కథానిక అందర్నీ అలరించటం విశేషం. ఈ రెండురోజుల కార్యక్రమంలో కథానికా బంధువులు ఒకచోట చేరి ఈ కార్యక్రమాన్ని చర్చా కార్యక్రమంగా కాక, ఒక పండుగగా జరుపుకోవటం అందరికీ సంతోషం కల్గించింది. అంతేగాకుండా ఇలాంటి పండుగని ఏటా మొదటి ఆదివారం నిర్వహించాలని అనుకోవటం హర్షణీయం. ఈ శతజయంతి సందర్భంగా సంవత్సరం పొడవునా అన్ని ప్రాంతాల్లో అందరినీ కలుపుకుంటూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తే కథానికకు, కథకు, సాహిత్యానికి, భాషకు, తెలుగు జాతికి మేలు జరుగుతుందని అనడంలో సందేహం లేదు.

**కుడిపూడి భాస్కరరావు**

## సమాజ శ్రేయస్సే రచనల పరమావధి

రచయితలు సమాజానికి దిక్సూచి వంటివారనీ, తమ రచనల ద్వారా మానవ జీవితాలను ప్రభావితం చేసి నైతిక విలువల రక్షణగా, నైరాశ్యం, సోమరితనాలను దూరం చేసే విధంగా కృషి చేయాలని తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ అన్నారు. సాధన సాహితీ స్రవంతి, మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అంబల్ల జనార్ధన్ రచించిన 'బొమ్మవెనుక' కథా సంపుటి ఆవిష్కార కార్యక్రమం జరిగింది. ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి మాట్లాడుతూ జనార్ధన్ కథలు కుటుంబ సంబంధాల పటిష్టతకు, ప్రేమానురాగాలకు పెద్దపీట వేసే సజీవచిత్రాలని పేర్కొన్నారు. ప్రముఖ కవి అద్దేపల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ జనార్ధన్ కథలు సాఫీగానూ, సరళంగానూ సాగి ఉత్కంఠతను పెంపొందించే విధంగా ఉంటాయని అన్నారు. రచయిత్రి గోవిందరాజు సీతాదేవి మాట్లాడుతూ మనసుకు హత్తుకుపోయే రీతిలో



**హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అంబల్ల జనార్ధన్ కథల సంపుటి 'బొమ్మవెనుక' ఆవిష్కరణ. చిత్రంలో రఘుశ్రీ, అంబల్ల జనార్ధన్, అద్దేపల్లి రామ్మోహనరావు, అబ్బూరి ఛాయాదేవి, ఆచార్య టి. గౌరీశంకర్, విహారి**

'బొమ్మవెనుక' కథలున్నాయని అన్నారు. అంబల్ల జనార్ధన్ స్పందిస్తూ నిజ జీవిత సంఘటనలను ఇతివృత్తాలుగా చేసుకుని మానవ మనస్తత్వాలను చిత్రిస్తూ సామాన్యుల కోసం కథలు రాస్తున్నానని అన్నారు. అంపశయ్య నవీన్, సలీం, వడ్డేపల్లి కృష్ణ, ద్వానా శాస్త్రి, పెనుమాక నాగేశ్వరరావు తదితరులు ఈ సభలో పాల్గొన్నారు. సాధన నరిసింహాచార్య స్వాగతం పలుకగా, మానస రఘుశ్రీ వందన సమర్పణ చేసారు.

## మూడు ముక్కలాట ఆవిష్కరణ

విజయవాడలోని ప్రకాశం బ్యారేజి35 కానా వద్ద ఫిబ్రవరి ఒకటవ తేదీన చలపాక ప్రకాష్ రచించిన 'మూడు ముక్కలాట' దీర్ఘ కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. కవితా సంపుటిని ఆవిష్కరించిన కవి కొల్లూరి మాట్లాడుతూ కవి విశ్వశ్రేయస్సుకు పాటుపడాలని



అన్నారు. సంకుచిత ధోరణులతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసే రాజకీయ నాయకుల పన్నాగాలకు కొమ్ముకాస్తూ, ఒక ప్రాంతానికే పరిమితమై మరొక ప్రాంతం వారిని దోపిడీదారులుగా కొందరు స్వార్థపరులైన కవులు చిత్రీకరించడం విచారకరమన్నారు. వివిధ పత్రికల వార్తల ఆధారాలతో ఈ పుస్తకాన్ని పరిపూర్ణంగా రూపొందించిన కవికి అభినందనలు తెలిపారు. పుస్తక రచయిత చలపాక ప్రకాష్ మాట్లాడుతూ కవి ప్రాంతీయ విభేదాలు చూడక ప్రపంచ మానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించే లక్షణం కలిగి ఉండాలని అన్నారు. కొందరు కవులు రాజకీయనాయకుల వలె ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఏ ప్రాంతీయత, కుల, మత భేదం చూడక అందరి దాహార్తిని తీర్చుతూ పోయే కృష్ణా నదిని స్ఫూర్తిగా తీసుకుని కవులందరూ ప్రజల పక్షంగా నిలవాలని అన్నారు.



Text.pmd 44 2/28/2009, 6:16 PM

## కార్టూనిస్టు శేఖర్‌కు పురస్కారం

సామాజిక స్పృహతో, స్వయం కృషితో ప్రగతిశీల చిత్రకారుడుగా స్థానం సంపాదించుకున్న కంబాలపల్లి చంద్రశేఖర్‌కు 2006 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ అవార్డు లభించింది. నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన శేఖర్ ప్రజాశక్తి పత్రికలో తన రేఖా ప్రస్థానం ప్రారంభించాడు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, హిందూత్వ శక్తుల దాడి తదితర అనేక అంశాలపై అసంఖ్యాకంగా కార్టూనులు అందించి ప్రజా ఉద్యమాలను ఉత్తేజపర్చారు. కీలకమైన అనేక రాజకీయ



మంత్రి షబ్బీర్ అలీ నుండి రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం స్వీకరిస్తున్న శేఖర్

ఘట్టాలలో వెలువడిన పుస్తకాలకు,వివిధ సంఘాల సావనీర్లకు ఆయన కార్టూన్లు ఆకర్షణగా నిలిచాయి. వ్యంగ్య చిత్రాలతో పాటు ఇతర రకాలైన చిత్రకళా రూపాలను,యానిమేషన్ సూత్రాలను ఆకళింపు చేసుకొన్న శేఖర్ తర్వాతి కాలంలో ఆంధ్ర ప్రభనూ , ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌నూ కూడా తన రేఖలతో అలరింపచేశారు. ఉద్యోగ రీత్యా ఎక్కడున్నా తర్వాతి కాలంలోనూ ప్రజాశక్తితో ఆయన అనుబంధం కొనసాగింది. మతతత్వ శక్తులపై ఆయన కార్టూనులు కొన్నిసార్లు వేడి పుట్టించాయి. ప్రస్థానంలో కూడా శేఖర్ పలు చిత్రాలు గీసి సహకరిస్తుంటారు. సాహితీ స్రవంతి తొలి దశలో ఆయన చురుగ్గా సహకరించారు. ప్రస్తుతం ఆంధ్రజ్యోతి కార్టూనిస్టుగా నిత్య రేఖావ్రతం కొనసాగిస్తున్నారు. ఆయనకు లభించిన గౌరవానికి ప్రస్థానం అభినందనలు తెల్పుతున్నది.

## సలీం నవల కాలుతున్న పూలతోట హిందీ అనువాదం ఆవిష్కరణ

ఆయకార్ అధికారులు, సిబ్బంది పన్నుల వసూళ్ళకే కాదు... సృజనాత్మకతతో సమాజం పట్ల తమ వంతు బాధ్యతనూ నిర్వర్తించగలరని రచయిత సలీం నిరూపించారని ఆదాయపు పన్నుల శాఖ, ఆంధ్రప్రదేశ్-1 చీఫ్ కమీషనర్ రాధా శ్రీవాత్సవ ప్రశంసించారు. సాహిత్య సంగం ఇంటర్నేషనల్, హైదరాబాద్



కాలుతున్న పూలతోట హిందీ అనువాదం 'సయీ ఇమారత్‌కే ఖండ్‌హార్' ను ఆవిష్కరిస్తున్న దృశ్యం.

ఆధ్వర్యంలో రచయిత సలీం రచించిన తెలుగు నవల 'కాలుతున్న పూలతోట' హిందీ అనువాదం 'నయీ ఇమారత్‌కే ఖండ్‌వార్' ఆవిష్కరణ ఫిబ్రవరి 4న తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగింది. ఈ నవల జాతీయ మానవ హక్కుల కమిషన్ (న్యూఢిల్లీ) ప్రథమ పురస్కారాన్ని కూడా పొందింది. రచయిత సలీం మాట్లాడుతూ ఎయిడ్స్ వల్ల ప్రమాదం కన్నా భయమే ఎక్కువగా నష్టం కల్గిస్తుందని అన్నారు. రచయిత్రి ఆర్. శాంతాసుందరి ఈ నవలను తెలుగులో చక్కటి అనువాదం చేసారని పలువురు కొనియాడారు.



## గంటేడ గౌరునాయుడు కు మాడభాషి రంగాచార్య అవార్డు

సాహితీవేత్త, కథారచయిత డా॥ మాడభాషి రంగాచార్య పేరున ప్రతీ సంవత్సరం ప్రకటించే అవార్డును ఈ సంవత్సరం ఒక రాత్రి-రెండు స్వప్నాలు కథాసంపుటికి గాను గంటేడ గౌరునాయుడు అందుకున్నారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 25న హైదరాబాద్, సిటీసెంట్రల్ లైబ్రరీలో ఈ పురస్కార కార్యక్రమం జరిగింది. మాడభాషి రంగాచార్య సహృదయులని, మంచి సాహిత్యవేత్త అని పలువురు వక్తలు పేర్కొన్నారు. వర్తమాన కథాసాహిత్యంలో చక్కటి కథారచనతో అలరిస్తున్న గంటేడ గౌరునాయుడును అభినందించారు. అవార్డును స్వీకరించిన గంటేడ స్పందిస్తూ తన చుట్టూ ఉన్న జీవితాన్నే తన కథలలో చిత్రించానని అన్నారు. పోరంకి దక్షిణామూర్తి తొలికథ గురించిన వివరాల్ని ప్రస్తావించారు. అంపశయ్య నవీన్ డెబ్బై నుండి ఎనభై వరకూ వచ్చిన కథల ఆధారంగా పరిణామాన్ని వివరిస్తూ ప్రసంగించారు. సుధామ అధ్యక్షత వహించిన ఈ సభలో శీలా వీర్రాజు, అబ్బూరి ఛాయాదేవి తదితరులు ప్రసంగించారు. మాఢబాషి రంగాచార్య శ్రీమతి లలితను ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా ఈ అవార్డును అందిస్తున్నందుకు పలువురు అభినందించారు.



కార్టూనిస్టు శేఖర్‌కు పురస్కారం
స్వయం కృషితో ప్రగతిశీల చిత్రకారుడుగా స్థానం సంపాదించుకున్న కంబాలపల్లి
త్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ అవార్డు లభించింది. నల్గొండ జిల్లా సూర్యాపేటకు 2/28/2009, 6:16 PM
కలో తన రేఖా ప్రస్థానం ప్రారంభించాడు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు,



ఫిబ్రవరి 8న జరిగిన మానస సాహితీ సంస్థ అష్టమ వార్షికోత్సవ వేడుకలలో జాతీయ స్థాయి పురస్కారం పొందిన మార్కాపురంకు చెందిన కె. వి. రమణారెడ్డిని సత్కరిస్తున్న ప్రముఖ కవి శివారెడ్డి. చిత్రంలో బి. హనుమారెడ్డి, పొన్నూరి శ్రీనివాసులు, బాలక్రిష్ణారెడ్డి, సిహెచ్.వి.యస్. బ్రహ్మానందరావు ఉన్నారు.



ప్రసిద్ధ కవి డా॥ తిరుమల శ్రీనివాసాచార్య సప్తతి పూర్తి ముగింపు సందర్భంగా హైదరాబాద్, రవీంద్రభారతిలో రసమయి ఆధ్వర్యంలో అభినందన సభ. చిత్రంలో అక్కినేని, మంత్రి మండలి బుద్ధప్రసాద్, శ్రీమతి విజయలక్ష్మి, ఎం.ఎస్.గౌడ్, సినారె, కె.వి. రమణాచారి, ఎం.కె. రాము ఉన్నారు.



ఫిబ్రవరి 2 నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన కళాజ్యోతి 28వ వార్షికోత్సవ సందర్భంగా అలనాటి మేటినటి శ్రీమతి అంజలీదేవి నుంచి కళాజ్యోతి విశిష్ట అవార్డు అందుకుంటున్న కవి కాళహస్తి వెంకటశేషగిరి రావు



తంగిరాల సత్యలక్ష్మీదేవి రచించిన పండుటాకు కవితా సంపుటి ఆవిష్కరణ. చిత్రంలో ఆర్.ఎస్.ఎన్. సుజాత, సన్నిధానం నరసింహశర్మ, మహీధర రామశాస్త్రి, పోతుకూచి సూర్యనారాయణ మూర్తి, ఎండ్లూరి సుధాకర్, అద్దేపల్లి రామ్మోహనరావు, తంగిరాల సత్యలక్ష్మీదేవి, డా. బివిఎస్ మూర్తి, డా. టి. జయప్రద




గోవాలోని ఇనిస్టిట్యూట్ మెనీజస్ బ్రగాంజా ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో డా॥ ఎన్. గోపి రచించిన 'గోవాలో సముద్రం' కావ్యం హిందీ అనువాదగ్రంథాన్ని (సుమద్ర్, మై ఔర్ గోవా) ప్రముఖ కొంకణీ, హిందీ కవి రమేష్ భగవంత్ వెలుస్కర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో కృతి స్వీకర్త, ఇనిస్టిట్యూట్ వైస్-ఛైర్మన్ మోహన్‌దాస్ సుర్లకర్, ఆవిష్కర్త వెలుస్కర్, మూలకవి గోపి, మెంబర్ సెక్రటరీ అశోక్ పరబ్ ఉన్నారు.



మాకినీడు పురస్కార ప్రధానోత్సవం



మానస సాహిత్య అకాడమీ, విజయవాడ వారు ఫిబ్రవరి 8న కవి భీంపల్లి శ్రీకాంత్‌ను జాతీయ స్థాయి మానస సాహిత్య పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం



వి ా వమ్మత్ రావు ేపట కైలాసపతిరావు రచించిన వెలుగు రువ్వులు పుస్తకావిష్కరణ. చిత్రంలో అద్దేపల్లి రామ్మోహనరావు, యం. కులశేఖర్‌రావు, గ్రంథకర్త, శ్రీమతి సుభద్ర కైలాసపతిరావు



Text.pmd 46 2/28/2009, 6:16 PM

# కొత్త పుస్తకాలు

## రాణీగారి కథలు




**సలీం**

**వెల : 100 పేజీలు : 160**

"కథానాయకుడు సైఫ్, కథానాయిక రాణి పాఠకుల మనసుల్ని దోచుకునేటట్లు ఉత్తమ పురుషలో కథలు రాశారు. పెళ్ళిళ్ళు 'ఘనంగా' చెయ్యడంలో పోటీలు పడుతున్న ఈ రోజుల్లో 'ఆకాశమంత పందిరి' వేసి, 'నక్షత్రాలు అక్షింతలుగా' కురిసేలాగ అందంగా పెళ్ళి ఎలా చెయ్యవచ్చునో ఆఖరికథ చదివితే తెలుస్తుంది. మత సామరస్యం ఎలా సాధించవచ్చునో సంసార పక్షంగా, సరళంగా, ఆహ్లాదకరంగా గీతావిష్కరణ చేస్తూ, 'మనసుకు లేదు మడి' అని బోధించాడు. మతానికి అతీతమైన మంచితనానికీ, ప్రేమకీ, మానవత్వానికీ ప్రతీకలు ఈ కథలు. రచయిత సలీం అన్ని విధాలా అభినందనీయుడు."

**అబ్బూరి ఛాయాదేవి**

## స్మైలూ..జ్ఞాపకాలూ...




**వెల : 100 పేజీలు : 170**

"ఇస్మాయిల్/స్మైల్ రాసిన కవిత్వాల్నీ, కథల్నీ మళ్ళీ చదివాను. ప్రపంచాల్ని ఇంత గాఢంగా బోధపరుచుకున్న స్మైల్ ఇంత తక్కువ ఎందుకు రాసాడని అడగాలనిపిస్తాంది. కాని అంతేనేమో, అతను అంతకన్నా ఎక్కువ రాయక్కర్లేదనుకున్నాడేమో. చివరి రోజుల్లో ఒక నవల రాయబోతున్నానని చెప్పేవాడట. రాస్తే ఎలా వుండేదో, కాని అసలు రాయాలనుకున్నాడా? స్నేహితులందర్నీ దగ్గరికి తీసుకుంటూ, అందరికీ ఎప్పుడూ తన నవ్వులే పంచిపెడుతూ, అందరి పనులూ తనవి చేసుకుంటూ వుండే మనిషికి తన పని చేసుకునే తీరుబాటు వుంటుందా?"

**వెల్చేరు నారాయణరావు**

## నెగిటివ్ కథలు




**కెమెరా విజయ్ కుమార్**

**వెల : 90 పేజీలు : 120**

"ఈ డజను కథల్లో ఏ కథ చదివినా, ఎవరో తమ స్వీయచరిత్ర చెబుతున్నట్లే వుంటుంది.. దళిత సాహిత్యంలోని కథకయినా, నవలకయినా, కవితకయినా – స్వీయ చరిత్రాత్మకాంశం ఎక్కడో విధిగా వుంటుంది.మరాఠీ దళిత రచయితలయితే తమ అవమానాలను చిత్రించడానికి 'స్వీయచరిత్రాత్మక కథనాన్ని' కథారచనలో ఒక ముఖ్య స్రవంతిగా మార్చుకున్నారు.

ఈ ఎరుక లేకుండానే, కెమెరా విజయకుమార్ తన కథలకు ఆ రూపు నిచ్చారు. అందుకే ఈ కథలు నిజంగానే నెగిటివ్‌లు.

కడక్కండి. రంగుల్ని అద్దకండి. నలుపూ ఒక రంగే. చీకటీ ఒక బతుకే.నిజం విశ్వరూపం చీకటే. దర్శించి తరించండి."

**సతీష్ చందర్**

## మూడు ముక్కలాట




**చలపాక ప్రకాష్**

**వెల : 30 పేజీలు : 55**

"సామాజిక అవసరాన్ని గుర్తించి రచనలు చేసే కవి తప్పనిసరిగా సామాజిక ప్రయోజనాన్ని కూడా ఆశిస్తాడు. అలాగే చలపాక ప్రకాష్ తన అంతరంగాన్ని బట్టబయలు చేశాడు. ఐక్యతలో ఉండే ఆనందం, అభివృద్ధి విడిపోవటంలో ఉండవని గుర్తు చేసాడు. కొన్ని కొన్ని విషయాల్ని చెప్పటానికి కొంత ధైర్యం కూడా అవసరం. ఈ దీర్ఘ కవితను గమనించినప్పుడు ప్రకాష్ ధైర్యం సాక్షాత్కరిస్తుంది. ఏది ఏమైనా ఒక మంచి సందేశాత్మక దీర్ఘ కవితను రచించిన చలపాక ప్రకాష్‌ను అభినందిస్తూ ఆయన కలం నుంచి మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నాను."

**గుమ్మా సాంబశివరావు**

## జీవనచిత్రాలు(మినీకవితలు)




**చల్లగాలి బాబూరావు**

**వెల : 30 పేజీలు : 61**

"మినీ కవితకు కావలసిన పంక్తి విభజన, లయాన్విత భావ రచన మొదలైన కొన్ని కవితల్లో కనిపిస్తై. ఈనాటి హింసాత్మక సమాజం గురించి రాసిన 'భారతం' అనే కవిత ఒక ఉదాహరణ. 'ఆనాడు/భారతం/ సిరిసంపదలతో/పచ్చపచ్చని పంటలతో/కళ కళలాడింది/ఈనాడు/భారతం/తుపాకి మ్రోతలతో/బాంబుల బెదిరింపులతో/విల విలలాడుతోంది'. అయితే ఈ లక్షణాలు సరిగా పాటించనవి, మినీ కవితకు మించిన పాదాలు కొన్ని కవితలో కనిపిస్తై. తనలోని మెరుపుల్ని తాను గమనించి, అదే మార్గాన్ని సుస్థిరం చేసుకుంటే, ముందు ముందు చల్లగాలి బాబూరావు మంచి స్థాయిని సాధించగలడు. నిరంతరం కృషి చెయ్యవలసిందిగా కోరుతూ నా శుభాకాంక్షలు అందిస్తున్నాను."

**అద్దేపల్లి రామమోహనరావు**

## ఈద్ ముబారక్ (ప్రగతిశీల ముస్లిం కవిత్వం)




**షేక్ కరీముల్లా**

**వెల : 50 పేజీలు : 100**

"అస్తిత్వ వాద ఉద్యమాలను అనుసరిస్తూ తెలుగు సాహిత్యంలో ముస్లిం మైనారిటీ వాద సాహిత్యం కూడా వెలువడటం ప్రారంభమయ్యింది. ఆ క్రమంలో కరీముల్లా పలు పుస్తకాలను ప్రచురించారు. ప్రస్తుతం ప్రగతిశీల ముస్లిం కవిత్వంగా చెబుతూ 'ఈద్ ముబారక్' కవితా సంపుటిని వెలువరించారు. ఇప్పటికే వినుకొండ చరిత్ర, గాయ సముద్రం, ఘా..., నా రక్తం కారుచౌక, సాయిబు వంటి కవితా సంపుటులు ప్రచురించారు. ఖిబ్లా, కవాతు సంపుటాలకు సంపాదకత్వం వహించారు. బలమైన గొంతు, చక్కటి అభివ్యక్తి కలిగిన కరీముల్లా కవిత్వం కవిత్వ పాఠకుల్ని అలరిస్తుంది."




Text.pmd 47 2/28/2009, 6:16 PM

# కొత్త పుస్తకాలు




## చిగురు

**గోపగాని రవీందర్**

**వెల : 30 పేజీలు : 70**

"ఈ కవిత్వంలో బహుళ పార్శ్వాలు, భిన్న ఇతివృత్తాలూ ఉన్నా, స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వడం, గ్లోబలైజేషన్‌ని వ్యతిరేకించడం ప్రధాన అంశాలు. మార్కెట్ మాయాజాలం మనుషుల్ని కబళిస్తున్న నేపథ్యంలో తనని, తన మూలాల్ని కాపాడుకునే ప్రయత్నమే గ్లోబలైజేషన్‌కు సరైన ప్రతిఘటన. సౌందర్యాన్ని దర్శించడం, పచ్చదనం కోసం పలవరింత ఇందులో భాగంగానే పరిగణించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే పుడమిపై ఆకుపచ్చని లోకం కలకాలం నిలవాలన్న తపన ఈ కవిత్వానికి నేపథ్యం. కనుకనే పర్యావరణ కవిత్వానికి ఇది కొత్త చేర్పు."

**గుడిపాటి**



## నైలు నుంచి కుప్పం దాకా

**డాక్టర్ జి.వి. పూర్ణచంద్**

**వెల : 100 పేజీలు : 146**

"నైలు నుంచి కృష్ణదాకా' అరుదైన పరిశోధనా వ్యాస సంకలనం. ఈజిప్ట్ నుంచి తెలుగు నేల వరకూ తెలుగు భాషతో పెనవేసుకున్న భాషాబంధాల గురించిన కొన్ని అధ్యయనాంశాలు మనల్ని కొత్తగా ఆలోచింపచేయడమే కాదు, ఆశ్చర్య చకితులను చేస్తాయి. తెలుగుభాషా సంస్కృతుల మూలాలను అధ్యయనం చేసేవారికి ఈ పుస్తకం విలువైన ఆలోచనల్ని అందించే ఒక 'ఆకరం'గా ఉపయోగపడ్తుంది."



## భయం మేల్కొనేవుంది

**డా॥ నాగినేని భాస్కరరావు**

**వెల : 90 పేజీలు : 118**

"గత రెండు సంవత్సరాల కాలంలో రాసిన కవితలతో డా॥ నాగినేని భాస్కరరావు గారు 'భయం మేల్కొనేవుంది' కవితా సంపుటి వెలువరించారు. సీనియర్ కవులైన వీరు గతంలో ఆక్సిజన్, సమాజ శిల, నిప్పుకోడి కవితా సంపుటులు ప్రచురించారు. పలు ఇతర పుస్తకాలు కూడా ప్రచురించారు. సామాజిక దృష్టితో చేసే వీరి రచనలు పాఠకులలో ఆలోచనలు రేపుతాయి."




## అనంతరంగాలు

**నండూరి రాజగోపాల్**

**వెల : 150 పేజీలు : 239**

"చినుకు సాహిత్య మాసపత్రిక సంపాదకులయిన నండూరి రాజగోపాల్ గారి వ్యాస సంపుటి 'అనంతరంగాలు'. ఈ పుస్తకం పలు సందర్భాల్లో వివిధ సాహిత్య అంశాలపై రాసిన వ్యాసాలు ఉన్నాయి. ముఖ్యంగా తెలుగు సాహిత్య తీరుతెన్నులను పట్టిచ్చే వ్యాసాల భాగం ఎక్కువ. అలాగే పలు నవలల, కథల సంపుటిలపై కూడా సమీక్షా వ్యాసాలు ఉన్నాయి. సాహిత్య ప్రియులకు మంచి వ్యాసాలను, సమీక్షలను చదివే అవకాశం ఈ పుస్తకం ఇస్తుంది."



## నేనూ-నా జీవితం (సామాజిక జీవన చిత్రం)

**పి. దశరథ్‌కుమార్, ఎఆర్‌పిఎస్**

**వెల : 000 పేజీలు : 95**

"ఎమర్జెన్సీకి కొద్ది రోజుల ముందు నల్లగొండలో ఫొటో స్టూడియో పెట్టినప్పటి నుండి మా స్నేహము ముందుకు సాగింది. పిట్టంపల్లి నుండి తరుచు సైకిల్‌పై వచ్చి ప్రజాశక్తి వారపత్రిక పంపిణీ చేస్తూ, వీరితో కలిసి రాజకీయాలను చర్చించేవారం. అదే కాలంలో డాక్టర్ రామారావు గారు చిరంజీవి నర్సింగ్‌హోం ప్రారంభించారు. మా ముగ్గురి మధ్య స్నేహపూర్వక చర్చలు క్రమంగా రాజకీయాలు చర్చించేవారము. పీపుల్స్ డెమోక్రసీ తెప్పించేవారము. కుమార్‌గారు ఫోటోగ్రఫీకి సంబంధించిన నేషనల్ జాగ్రఫీ తెప్పించేవారు."

**పెన్నా అనంతరామశర్మ**




## పినలగర్ర

**ఆర్. రామకృష్ణ**

**వెల : 50 పేజీలు : 96**

"కవికి ఈ ఎరుక, ప్రాథమిక జ్ఞానం, ఇంగితం చాలా ముఖ్యం. అది రామకృష్ణ దగ్గర పుష్కలంగా ఉంది. పైకి కనపడని ఊహాశక్తి వుంది. రామకృష్ణ కవిత్వం మొదటిసారి చదివితే 'ఇదేమి కవిత్వం' అని అన్పిస్తుంది. మనమొక జిగేలుమనిపించే కవిత్వానికి అలవాటుపడ్డాం. ఆ నగిషీలు ఇక్కడ లేవు. అలా పొలంకేసి వెళ్ళినట్టు వుంటుంది. అక్కడో జానపదగీతమో, పద్యమో గాల్లో సుళ్ళు తిరిగి మీ చెవుల్ని తాకుతుంది. పెద్ద అలంకరణలు లేకుండా ఒక్క ముక్కుపుడకతో వున్న ఈ కవిత్వాన్ని ఆస్వాదించండి."

**కె. శివారెడ్డి**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



# గత నాలుగేళ్ళలో సంక్షేమవెలుగులు

- షెడ్యూల్డు కులాల లబ్దిదారులకు మార్జిన్ మనీ కింద రూ॥ 1122 కోట్ల రుణాలు మాఫీ
- షెడ్యూల్డు కులాల ఆర్థికాభివృద్ధి పథకాలకిచ్చే సబ్సిడీ రూ॥ 30,000లకు పెంపు
- రెట్టింపైన ఉపకార వేతనాలు
- ఈ ఏడాది రూ॥ 603 కోట్లతో 5.56 లక్షల మంది విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు. హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు
- మెస్ ఛార్జీలు 40 శాతం పెంపు



జారీచేసినవారు: సమాచార, పౌరసంబంధాల శాఖ

## ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చదువవలసిన పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|
| 1. | పిల్లలు నేర్చుకోవడంలో ఎలా వెనకబడతారు? | 60.00 | 13. | నల్లబల్ల వెనుక | 25.00 |
| 2. | పిల్లలు ఎలా నేర్చుకుంటారు | 60.00 | 14. | చదువు సంధ్యలు | 25.00 |
| 3. | టీచర్ | 40.00 | 15. | మహోజ్వల స్మృతులు | 35.00 |
| 4. | విముక్తి-విద్య | 40.00 | 16. | మనిషి కథ | 40.00 |
| 5. | టీచర్లకు ఉత్తరం | 40.00 | 17. | చార్లీచాప్లిన్ | 25.00 |
| 6. | మాస్టారూ...! | 10.00 | 18. | పరిణామక్రమంలో విద్యా వ్యవస్థ 1833-2003 | 15.00 |
| 7. | మీ ఒడిలో | 10.00 | 19. | వేదభూమి | 10.00 |
| 8. | కథలే పాఠాలు | 25.00 | 20. | సమాజం-సైన్స్- సంప్రదాయం | 15.00 |
| 9. | బోధన-శోధన | 30.00 | 21. | సైన్సు చరిత్రలో సామాజికాంశాలు | 10.00 |
| 10. | విభిన్న విద్యా సంస్థలు | 25.00 | 22. | పిల్లల అలవాట్లు | 25.00 |
| 11. | భాష-భావం | 20.00 | 23. | భారతదేశ చరిత్ర | 25.00 |
| 12. | మీరు - మీ పిల్లలు | 15.00 | 24 | పిల్లల భాష - ఉపాధ్యాయుడు | 25.00 |

## పిల్లలు చదివే పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | మహావిశ్వం మన భూమి | 20.00 | 34. | మూడు కథలు | 10.00 | 67. | యముని దర్బారు | 10.00 |
| 2. | అదర్శబాల్యం | 25.00 | 35. | నత్తగుల్ల స్వార్థం-బంగారుచేపగర్వం | 15.00 | 68. | బంగారు జింక | 15.00 |
| 3. | విలియం షేక్స్పియర్ | 15.00 | 36. | అద్భుతాలనియం-నీరు | 10.00 | 69. | మూడు ఏనుగులు | 15.00 |
| 4. | హైడీ | 20.00 | 37. | నోయా | 10.00 | 70. | బోబక్ నేర్పిన పాఠం | 15.00 |
| 5. | విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞులు | 15.00 | 38. | బద్ధకం వదిలింది | 15.00 | 71. | పులి-తాబేలు | 10.00 |
| 6. | విదేశీ కథలు | 15.00 | 39. | బుడిబుడికథలు | 40.00 | 72. | పింకి-పిల్లి | 10.00 |
| 7. | విజ్ఞాన శిఖరాలు | 15.00 | 40. | పిల్లల ప్రశ్న-సైన్స్ జవాబు | 15.00 | 73. | సైన్యాధిపతి గర్వభంగం | 15.00 |
| 8. | చైనా నీతి కథలు | 15.00 | 41. | మేమొచ్చేశాం | 20.00 | 74. | కుడి-ఎడమ | 10.00 |
| 9. | భారతీయ శాస్త్రవేత్తలు | 15.00 | 42. | నిర్జీవం-జీవపరిణామం | 30.00 | 75. | నాతప్పేమిటో! | 15.00 |
| 10. | అందాల పార్కు | 15.00 | 43. | సరదాసరదా లెక్కలు | 30.00 | 76. | నందువంట-నేస్తంతంటా | 10.00 |
| 11. | పిల్లల గణితం | 15.00 | 44. | విశ్వం-విజ్ఞానం | 25.00 | 77. | వంశీధర్ నిజాయితీ | 10.00 |
| 12. | పిల్లలు-పిడుగులు | 20.00 | 45. | ప్రకృతిలో అద్భుతాలు-విజ్ఞానవిశేషాలు | 45.00 | 78. | జమిందారు వేట | 10.00 |
| 13. | సరదా సరదా చదువులు | 15.00 | 46. | కాలిక్యులేటర్ గేమ్స్ | 20.00 | 79. | అద్దంలో సింహం | 15.00 |
| 14. | తరగతిలో తమాషాలు | 15.00 | 47. | అలెగ్జాండర్ గ్రాహంబెల్ | 10.00 | 80. | సముద్ర నేస్తాలు | 15.00 |
| 15. | వానరుడు - నరావతరణ | 25.00 | 48. | మేకపిల్ల మెడగంట-చిట్టెలుక కృతజ్ఞత | 15.00 | 81. | కప్పకల | 15.00 |
| 16. | చదువంటే మూడోకన్ను | 25.00 | 49. | మంచిగా వుందాం | 30.00 | 82. | కథలంటే మాకిష్టం-1 | 25.00 |
| 17. | పాడరా ఓ తెలుగువాడా | 15.00 | 50. | ఖలేకథలు | 10.00 | 83. | కథలంటే మాకిష్టం-2 | 25.00 |
| 18. | పిల్లల సంరక్షణ | 25.00 | 51. | తోకతెగిన తోడేలు | 15.00 | 84. | రాబిన్సన్‌క్రూసో | 45.00 |
| 19. | అక్షరాలతో ఆటలు | 30.00 | 52. | బల్బు వెలిగింది | 20.00 | 85. | నల్లగుర్రం | 25.00 |
| 20. | నేర్చుకోడం మాకిష్టం | 20.00 | 53. | రవీంద్రనాథ్ ఠాగూర్ | 15.00 | 86. | పెన్సిల్‌బాక్స్ | 15.00 |
| 21. | కథలంటే మాకిష్టం | 40.00 | 54. | వినయంలేని వీరుడు | 25.00 | 87. | మంచి అమ్మ | 15.00 |
| 22. | ఆటలంటే మాకిష్టం | 30.00 | 55. | బండి నుంచి మోటారుకు | 20.00 | 88. | కోతి ఫొటో | 25.00 |
| 23. | పాటలంటే మాకిష్టం | 20.00 | 56. | చెట్లు | 15.00 | 89. | కథ కాని కథ | 15.00 |
| 24. | పాడుకొందాం | 25.00 | 57. | చిటపట చినుకులు | 20.00 | 90. | లోకంచుట్టిన వీరుడు | 40.00 |
| 25. | తేటతెలుగు-1 | 30.00 | 58. | చిట్టిరాకుమారి-చందమామ | 10.00 | 91. | చివరి ఆకు | 10.00 |
| 26. | తేటతెలుగు-2 | 30.00 | 59. | గుడ్డు నుంచి పిల్ల | 20.00 | 92. | పెద్దల మాయం-పిల్లలరాజ్యం | 20.00 |
| 27. | కొత్తబ్యాగ్ | 10.00 | 60. | కుకూ భూరీల కథ | 20.00 | 93. | నెలవంక | 25.00 |
| 28. | బొటనవేలితోబొమ్మలు | 10.00 | 61. | మన కథ | 20.00 | 94. | సాయపడే చేతులు | 20.00 |
| 29. | పొడుపుకథలు-చింగ్‌చదువు | 15.00 | 62. | నడిచేటి నావకథ | 20.00 | 95. | నీళ్ళు ఎందుకు తడిగాఉంటాయి? | 15.00 |
| 30. | డంభాలమారి డాన్ క్విక్సాట్ | 25.00 | 63. | రహస్యం | 10.00 | 96. | బడి-బ్రతుకు | 25.00 |
| 31. | గణితసూత్రదీపిక | 20.00 | 64. | ఎద్దు | 20.00 | 97. | హిరోషిమా అగ్నిజ్వాలలు | 25.00 |
| 32. | జంతువుల వింతభాష | 10.00 | 65. | మనము రాద్దామా? | 10.00 | 98. | సిసింద్రీలు | 20.00 |
| 33. | జంతువుల వింతరుచులు | 10.00 | 66. | బుచ్చిబాబు-బొమ్మకారు | 15.00 | 99. | అద్దాలతో ఆటలు | 15.00 |

# ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

గమనిక : పై పుస్తకాలు స్కూలు గ్రాంటు నుండి కాని, టీచర్ గ్రాంటు నుండి కానీ మీ స్కూలుకు కొనుగోలు చేసుకోవచ్చును. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ పేరిట డి.డి./ఎం.ఓ. తీసి పంపవలెను.